

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


అమెరికా జోక్యం లేదు
పాక్ విజ్ఞప్తి మేరకే 'ఆపరేషన్ సిందూర్' ఆపేశాం: జైశంకర్

లోపలి పేజీల్లో


మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

పాక్‌తో గూఢచర్యం...
సిఆర్‌పిఎఫ్ జవాన్ అరెస్టు


సంపుటి 08, సంచిక: 177 | మంగళవారం | 27-05-2025 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# 1000 కేసులు

- భారత్‌లో మళ్లీ విజృంభిస్తున్న కరోనా
- కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలో తీవ్రతరం



**న్యూఢిల్లీ :** ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో మళ్లీ వెలుగులోకి వస్తున్న కొవిడ్ కేసులు ఇప్పుడు భారత్‌లో కూడా మొదలయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు, తాజా సమాచారం (సోమవారం నాటికి) ప్రకారం దేశంలో వెయ్యికిపై కరోనా కేసులు నమోదైనట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కేరళ నుంచి కర్ణాటక వరకు, మహారాష్ట్ర నుంచి ఢిల్లీ వరకూ కొత్తగా వెలుగులోకి వచ్చిన కరోనా కేసులు ఇప్పుడు భయపెడుతున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో మొత్తం 1009 యాక్టివ్ కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ సంవత్సరంలో దేశంలో కరోనా కేసులు 1000 దాటడం ఇదే తొలిసారి కావడం విశేషం. కొవిడ్–19 తాజా తరువాయి 2లో

# భారీవర్ష బీభత్సం..
# భారతావని విలవిల

- వరదనీటిలో ముంబయి, థానే, ఢిల్లీ, కర్నాటక, కేరళ, బెంగాల్ జనజీవనం అస్తవ్యస్తం
- ముంబయిలో 107 ఏళ్ల రికార్డును అధిగమిస్తూ 279.4 మి.మీ. అత్యధిక వర్షపాతం
- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలింపు



**న్యూఢిల్లీ :** నైరుతి రుతుపవనాల రాక ప్రభావంతో దేశంలోని పలు ప్రధాన నగరాలు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న కుండపోతవర్షానికి అతలాకుతలం అవుతున్నాయి. శనివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ నిరవధికంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. తెరిపిలేకుండా కురుస్తున్న కుండపోతవర్షాలు జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు, కష్టనష్టాలను చవిచూపిస్తున్నాయి. మహారాష్ట్రలో దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరం, థానే, పల్ఘార్ ప్రాంతాలు, దేశ రాజధాని ఢిల్లీ, కర్నాటక తీర ప్రాంతం, దక్షిణ కన్నడ జిల్లా, కేరళ రాష్ట్రంలోని ఉత్తర జిల్లాలు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని దక్షిణ బెంగాల్ వర్ష బీభత్సానికి గజగజ వణుకుతున్నాయి.కొలాబా అబ్జర్వేటరీలో మే నెలలో వర్షపాతం 295 మి.మీ.గా నమోదు అయ్యింది. మే నెలలో 107ఏళ్లలో కురిసిన అత్యధిక వర్షపాతం ఇదే. 1918లో అత్యధిక వర్షపాతం 279.4 మి.మీ.గా నమోదైంది. కానీ ఇప్పుడు కురుస్తోన్న కుండపోత వర్షం 107ఏళ్ల రికార్డును (1918లో నమోదైన అత్యధిక వర్షపాతం) బద్దలు కొట్టింది.సోమవారం ముంబయిలో కురుస్తున్న భారీ వర్షాలకు సెంట్రల్ రైల్వే హార్బర్ మార్గంలోని వడాలా రోడ్, ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ మధ్య సబర్బన్ ట్రైన్ సర్వీసులు ఉదయం 10:25 గంటల నుండి రద్దు అయ్యాయి, మహానగరంలోని పలు ప్రాంతాలలో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి నదీ ప్రవాహాలను తలపిస్తోంది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) తెలియజేసిన ప్రకారం నగరంలోని ఉదయం 9గంటల నుంచి 10గంటల సమయం వరకు దక్షిణ కొనలోఉన్న నారీమన్ పాయింట్ ఫైర్ స్టేషన్ వద్ద అత్యధిక వర్షపాతం (104మి.మీ) నమోదైంది. వార్డ్ తరువాయి 2లో

## పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్

- తెలంగాణాలోకి నైరుతి రుతుపవనాలు
- నాలుగు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని తెలిపారు. అంచనా వేసిన సమయం కంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు వచ్చినట్లు చెప్పారు. ఉత్తర తెలంగాణపై ద్రోణి ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయన్నారు. మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తరువాయి 2లో

## పెన్షన్‌కు కాంట్రాక్ట్ సర్వీస్‌నూ లెక్కించాలి

హైకోర్టు తీర్పు

ప్రజాపక్షం/హైదరాబాద్

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించేప్పుడు ఉద్యోగి కాంట్రాక్ట్ సర్వీసును కూడా లెక్కించాలని హైకోర్టు తీర్పు చెప్పింది. రిటైర్మెంట్ తర్వాత గ్రాట్యుటీ, పెన్షన్ మొదలైన బెనిఫిట్స్‌ను లెక్కింపులో తాత్కాలిక సర్వీసును పరిగణనలోకి తీసులేదంటూ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.నిర్మల మరో 52 మంది వేసిన పిటిషన్లపై జస్టిస్ సూరేపల్లి నంద తీర్పు చెప్పారు. పిటిషనర్లు 2002 నుంచి 2006వరకు కాంట్రాక్ట్ కింద విధుల్లో చేరారని లాయర్ అన్నారు. రెగ్యులర్ సర్వీసు డాక్టర్లతో సమానంగా సేవలందించారని తెలిపారు. కానీ, పెన్షన్, గ్రాట్యుటీ, పదవీ విరమణ ప్రయోజనాలను రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లతో సమానంగా ఇవ్వలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల వివక్షచూపారన్నారు. దీనిపై తరువాయి 2లో

## ఫార్ములా ఇ–కార్ రేస్
## కెటిఆర్‌కు ఎసిబి నోటీసు



**విదేశాలకు వెళ్లొచ్చాక హాజరవుతా : కెటిఆర్**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఇ– రేస్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుకు అవినీతి నిరోధక సంస్థ (ఎసిబి) సోమవారం తాజా నోటీసును జారీ చేసింది. ఈ నోటీసులో ఆయనను మే 28వ తేదీన విచారణకు హాజరుకావాలని కోరింది. ఆ నోటీసులపై కెటిఆర్ స్పందిస్తు ముందు నిర్ణయించిన కార్యక్రమాలకు హాజరయ్యేందుకు యుకె, యుఎస్‌లకు వెలుతున్నందున తిరిగి వచ్చిన వెంటనే ఎసిబి ఎదుట హాజరౌతానని అధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు. కాగా ఈ నెల 28న కెటిఆర్ అరెస్ట్ అవుతారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీంతో బిఆర్‌ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ కేసులో 2023 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఇ– రేస్‌కు తరువాయి 2లో

# స్వదేశీ తయారీ వస్తువులనే కొనుగోలు చేయండి



- పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి భారత్ లక్ష్యం
- భారత్‌పై పాకిస్థాన్ పగతో రగులుతోంది
- గుజరాత్ ర్యాలీలో నరేంద్రమోదీ

**దహోద్ (గుజరాత్):** పగ,ద్వేషం, విరోధాన్ని పెంచి పోషించడమే పాకిస్థాన్ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత మొదటిసారి గుజరాత్‌లో నరేంద్రమోదీ పర్యటించారు. భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్వాగత సత్కారాలు అందుకున్నారు. సరిగ్గా 11 సంవత్సరాలక్రితం మే 26న ఆయన ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు అదే తేదీన ఆయన స్వరాష్ట్రం గుజరాత్ దహోద్‌లో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగాల్లో పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. స్వదేశీ తయారీ వస్తువులనే ఎక్కువగా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. గుజరాత్ పర్యటన సందర్భంగా రూ. 24,000 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. దహోద్‌లో లోకోమోటివ్ ఉత్పత్తి ప్లాంటును ప్రారంభించారు. రూ. 21,405 కోట్లతో తరువాయి 2లో



## రిజిస్ట్రేషన్ల వేగవంతానికి 'ఆధార్ – ఇ – సంతకం'

- ఆర్మూర్, కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే ఈ విధానం అమల్లోకి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్లాట్ బుకింగ్‌తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు 'ఆధార్– ఇ–సంతకం' విధానాన్ని ప్రవేశపెడుతున్నామని, ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా తరువాయి 2లో

## నంబాలను సజీవంగా పట్టుకుని కాల్చి చంపారు

- కొందరు ద్రోహుల వల్లనే ఉద్యమానికి నష్టం
- శాంతి చర్చలకు ఎందుకు సిద్ధం కాలేదు
- లేఖ విడుదల చేసిన మావోయిస్టులు
- నక్సల్స్ మృతదేహాలకు సామూహిక ఖననం



ప్రజాపక్షం/ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు పోలీసు బలగాలు సజీవంగా పట్టుకుని కాల్చి చంపాయని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ పేరుతో లేఖను విడుదల చేశారు. నంబాల కేశవరావును కాపాడుకోవడంలో విఫలమైనట్లు మావోయిస్టులు ఆ లేఖలో అంగీకరించారు. ఆరు నెలలుగా మాడ్ ప్రాంతంలో కేశవరావు ఉన్నారన్న సమాచారం సాయుధ పోలీసు బలగాలకు తెలుసునని, గతంలో రెండు సార్లు నంబాల లక్ష్యంగా పోలీసులు దాడి చేసి విఫలమయ్యారని లేఖలో తెలిపారు. ఇటీవల కేశవరావు దళంలో ఉన్న ఆరుగురు ఉద్యమ ద్రోహులు లొంగిపోయారని వారు అందించిన సమాచారం మేరకే కేశవరావును పోలీసు బలగాలు చుట్టు ముట్టాయన్నారు. ఈనెల 17వ తేదీన దళం నుంచి ఒక మావోయిస్టు పరారయ్యాడని అతనే పోలీసులకు దారి తరువాయి 2లో




# తలసరి ఆదాయం రెట్టింపైతే ఆకలి చావులెందుకు?

- రైతుల ఆత్మహత్యలు ఎందుకు ఆపలేకపోతున్నారు
- ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదెందుకు?
- నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రావడం లేదు
- కేంద్రాన్ని నిలదీసిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి
- ఘనంగా ప్రారంభమైన సిపిఐ హనుమకొండ జిల్లా మహాసభలు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

గడిచిన పదేళ్ళలో దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులను, రైతుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేక పోయారని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం సిపిఐ హనుమకొండ జిల్లా ద్వితీయ మహాసభలు హసన్ పర్తి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. బహిరంగ సభ ముందు డాక్టర్ సోమేశ్వర్ హాస్పిటల్ నుండి హై స్కూల్ వరకు సిపిఐ ఆధ్వర్యంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని జెడ్‌పి హెచ్‌ఎస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్ రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత తలసరి ఆదాయం రెట్టింపు అయితే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని, రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఎందుకు కల్పించబడలేదని ప్రశ్నించారు. మోడీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతం అయిందని, అందుకే పేదల బతుకులు మారలేదని అన్నారు. మోడీ అధికారంలోకి రాక ముందు కేవలం రూ.50లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు రూ.160 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని చెప్పారు. మోడీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతు పెట్టినటువంటి పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే తరువాయి 12లో



## వెనిజులా ఎన్నికల్లో మదురో కూటమి విజయభేరి

**కారకస్ :** దక్షిణ అమెరికా తూర్పుతీరప్రాంతదేశం వెనిజులా (బొలీవియరిన్ రిపబ్లిక్ ఆఫ్ వెనిజులా) పార్లమెంటుసహా వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో అందరూ ఊహించినవిధంగానే దేశాధ్యక్షుడు నికొలస్ మదురో పార్టీ కూటమి విజయభేరి మోగించింది. మొత్తం 24 రాష్ట్రాలకుగాను 23 రాష్ట్రాలలో యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులాగవర్నర్ పదవులను గెలుచుకుంది. 82.68 శాతం ఓట్లను సంపాదించింది.ఈ ఎన్నికలు శాంతి,సుస్థిరతలకు ప్రత్యక్షతార్కాణమని మదురో ప్రశంసించారు.ప్రధానప్రతిపక్ష గ్రూపు నాయకురాలు మరియా కొరినా మఛడో మాత్రం, ఈ ఎన్నికలు ఒక బూటకమని, ఎన్నికల్లో పాల్గొనవద్దని పిలుపు ఇచ్చారు. వెనిజులాలో 2.10 కోట్లమంది అర్హులైన ఓటర్లు ఉండగా 42 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. హ్యూగో ఛావెజ్ మరణానంతరం 2013లో జరిగిన ఎన్నికల్లో మదురో దేశాధ్యక్ష పదవి చేపట్టారు. తాజాగా జరిగిన ఎన్నికల తరువాయి 2లో

## చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు

- ఎస్‌సి,ఎస్‌టి తరహాలో బిసిలకు బడ్జెట్ కేటాయించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- పాలకులకు ఓటు బ్యాంకు రాజకీయాలే తప్ప వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదు : ఎమ్మెల్సీ సత్యం



ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యతగల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సమాజంతోనే పుట్టిన చేనేత వృత్తిని పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాను రాను నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు ఈ వృత్తిని ఆధునీకరించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేనేత రంగాన్ని పరిరక్షించాలని తదితర డిమాండ్లపైన తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ తరువాయి 12లో

## పరిశ్రమల స్థాపనకు కృషి

- ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి
- మంథని పట్టణంలో ప్రోటో టైపింగ్, ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం



ప్రజాపక్షం/ముత్తారం/ మంథని

ప్రపంచస్థాయిలో మంథనిప్రతిభకు చిహ్నంగా నిలిచేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం మంథని పట్టణంలో బస్ డిపో సమీపంలో డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్వర్క్‌లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రోటో టైపింగ్, ఇన్నోవేషన్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... టీ వర్క్స్ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికత పరంగా వారికి ఉన్న నైపుణ్యాన్ని బయటికి తీసుకుని వచ్చేందుకు మంథని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రోటోటైపింగ్ & ఇన్నోవేషన్ ఉపయోగపడుతుందన్నారు. మంథని పట్టణంలో టీ వర్క్స్ బృందం నుంచి 3 శిక్షకులను నియమిస్తామని, భావితరాలకు విజ్ఞాన నిలయంగా మంథని ప్రాంతం నిలవాలని కృషి చేస్తున్నామని అన్నారు. స్థానికంగా తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## ఇయుపై ట్రంప్ సుంకాలు మరోనెల వాయిదా

వాషింగ్టన్ : యూరోపియన్ యూనియన్‌తో సుంకాలపై చర్చలను వాయిదా వేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. దీంతో ఆయన విధించిన యాభైశాతం సుంకాల వసూళ్ళు మరో నెలరోజులుపైగా వాయిదా పడ్డాయి. యూరోపియన్ కమిషన్ ఛైర్‌పర్సన్ ఉర్సులా వోండర్ లేయన్ సోమవారంనాడు ట్రంప్‌తో టెలిఫోన్ సంభాషణ చేశారు. వారిమధ్య సంభాషణ తర్వాత ట్రంప్ సుంకాల వసూళ్ళపై సంప్రదింపులను మరో నెలరోజులుపైగా వాయిదా వేసేందుకు సమ్మతించారు. యూరోపియన్ యూనియన్ నుండి అమెరికాకు వచ్చే దిగుమతులపై ఇరవైశాతం సుంకాలను ట్రంప్ గతనెలలో ప్రకటించారు. ఆ తర్వాత ఆ సుంకాలను పదిశాతానికి తగ్గించి సంప్రదింపులకు గడువును అనుమతించారు. కానీ గడచిన శుక్రవారంనాడు మాత్రం ట్రంప్ ఈ చర్చల ప్రక్రియ తీరుతెన్నులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జూన్ ఒకటో తేదీ నాటికి యూరప్ వస్తువుల దిగుమతులపై పన్నులను యాభైశాతానికి పెంచుతామని కూడా హెచ్చరించారు. కానీ ఉర్సులా వోండర్ లేయన్‌తో చర్చల తర్వాత ఈ సుంకాలను, సంప్రదింపుల గడువును జులై తొమ్మిదోతే దీనాటికి వాయిదావేసినట్లు ట్రంప్ తనసొంత సోషల్‌మీడియా ట్రూత్ ప్రకటించారు.

## ఏకపక్ష సుంకాలతో ప్రపంచ అస్థిరత సమస్య

### ఏసియన్ సదస్సులో మలేసియా ప్రధాని అన్వర్ విమర్శ




కౌలాలంపూర్: మలేసియా రాజధాని కౌ లాలంపూర్‌లో ''ఏసియన్'' (ఆగ్నేయ ఆసియా దేశాలు) 46వ శిఖరాగ్ర సదస్సు సోమవారంనాడు ప్రారంభమైంది. ఆగ్నే య ఆసియా దేశాల సమగ్రత, పరిరక్షణ, వాణిజ్య,ఆర్థికపరమైన ఆటంకాలను తట్టుకుని నిలబడేందుకు చేయాల్సిన ప్రయత్నాలు అనే విషయమే ప్రధాన ఎజెండాగా ఈసారి 'ఏసియన్' శిఖరాగ్ర సదస్సు జరుగుతున్నది. ప్రారంభోత్సవం సందర్భంగా ప్లీనరీ సమావేశంలో అతిథేయదేశం మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం మాట్లాడుతూ, ప్రపంచం విసిరిన సవాళ్ళను సమైక్యంగా ప్రతిఘటించాలనీ, మా ర్పులు సంతరించుకుంటున్న ప్రపంచంలో స్థిరమైన అభివృద్ధి, సమస్థాయి అభివృద్ధి అనే ఎజెండా వెనక్కువెళ్ళిపోకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. మనం పాటించే వాణిజ్యం, సమ్మిళిత విధానాలు అంతర్జాతీయ శాంతిపై ఆధారపడి ఉంటాయని, వాణిజ్య కార్యకలాపాలు, పెట్టుబడుల ప్రవాహం యధేచ్ఛగా సాగిపోవాలం టే స్థిరమైన శాంతి ఉండాలన్నారు. ఏకపక్ష విధానాలు, చర్యలవల్ల ఈ స్థిరమైనశాంతి లేకుండా పోయిందని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ సుంకాల విధానాల వల్ల భౌగోళిక రాజకీయాలలో మార్పులు జరుగుతున్నాయనీ, రక్షణవా దం తిరిగి తలెత్తిందని, వాణిజ్య కార్యకలాపాలు సమస్యల్లో పడ్డాయనీ, అందువల్ల ఏసియన్ దేశాలు చైనాతోపాటు గల్ఫ్ కో–ఆపరేషన్ కౌన్సిల్ వంటి మైత్రీ భాగస్వామ్య గ్రూపులతో సహకారాన్ని మరింత పటిష్టవంతం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు.

## గాజాలో స్కూలుపై దాడి

### 54మంది మృతి

గాజా : ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై ఆగ్రహం పెల్లుబుకుతున్నప్పటికీ ఆ దేశ సైనికులు మాత్రం గాజాలో విధ్వంసాన్ని మానలేదు. ఆదివారం సోమవారం తెల్లారుజామునుండీ జరిగిన దాడుల్లో 54 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఒక స్కూలును శరణార్థులకోసం తాత్కాలిక నివాసకేంద్రంగా మార్చారు. ఈ నివాసకేంద్రంపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. రెండు వేరు వేరు ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. ఉత్తరగాజాలోని జబాలియాలో ఒక ఇంటిపై జరిగిన గగనతల దాడిలో 19 మంది మరణించారు. బైట్ లహియా నగరం నుండి శరణార్థులుగా వచ్చిన వందలాదిమంది ప్రజలు సెంట్రల్‌గాజాలోని ఫహ్మీ అల్ జర్గావీ స్కూలులో తలదాచుకున్నారు. హమాస్ అధీనంలో ఉన్న పౌర రక్షణ దళ అధికార ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ, శిథిలాల నుండి ఇరవై మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, వీరిలో ఎక్కువమంది పిల్లలు ఉన్నారని చెప్పారు. ఐతే హమాస్, ఇస్లామిక్ జీహాదీ కమాండ్ కంట్రోల్‌ను లక్ష్యంగా చేసుకుని తాము దాడులు చేశామని ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) ప్రకటించింది. వీడియో దృశ్యాల్లో చూసినప్పుడు భారీగా ఎగసిపడుతున్న మంటలు పలుచోట్ల కనిపించాయి. స్కూలు ఆవరణ శిథిలకేంద్రంగా మారింది. ఇదిలా ఉండగా గాజాలో ఎలాగైనా యుద్ధాన్ని ముగించాలని కోరుతూ మాడ్రిడ్‌లో 20 దేశాల ప్రతినిధులు ఆదివారంనాడు సమావేశం జరిపారు.

**ఇజ్రాయెల్ మద్దతు గల గాజా ఆహార పంపిణీ సంస్థ అధిపతి రాజీనామా**



గాజాలో బాధిత ప్రజలకు ఆహారం పంపిణీ చేయడానికి ఇజ్రాయెల్ మద్దతుతో ఏర్పాటు చేసిన ఆహార, సహాయ



పంపిణీ సంస్థ అధిపతి తన పదవికి రాజీనామా చేశారు. ఐక్యరాజ్యసమితి విధించిన అంతర్జాతీయ నిబంధనల ప్రకారం, నిజాయతీగా, నిష్పక్షపాతంగా, తటస్థంగా, స్వతంత్ర పద్ధతులలో ఆహార, సహాయ సరఫరాపంపిణీ చేయడం తనవల్లకాదంటూ 'గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) అధిపతి జాక్ ఉడ్ తన పదవికి ఆదివారం రాత్రి రాజీనామా చేశారు. హమాస్ ఉగ్రవాదులు ఆహారాన్ని తన్నుకుపోవడాన్ని ఆపాలని, వారికి ఆహారం అందకుండా చేయాలని కోరుకుంటున్న ఇజ్రాయెల్ , తనుచెప్పిన ప్రాంతాల నుండి ఆహారసరఫరా చేసేందుకు వీలుగా అమెరికా మద్దతుతో ఈ ప్రణాళిక ప్రైవేటు సంస్థల ద్వారా అమలు చేయాలని ఆలోచించింది. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఇజ్రాయెల్ సైన్యాలు ఆహారసరఫరాలను రాకుండా అడ్డుకున్నాయి. ప్రపంచ దేశాల ఒత్తిడితో రెండు రోజుల క్రితం నుండీ పరిమితస్థాయిలో ఆహార సరఫరాను గాజాలోకి ఇజ్రాయెల్ సైన్యం అనుమతిస్తున్నది.

## అసలు పుతిన్‌కి ఏమైంది?

### జెలెన్‌స్కీ నోటి తంటా :ట్రంప్ అసంతృప్తి




**వాషింగ్టన్ :** ఉక్రేన్‌పై తీవ్రస్థాయిలో రష్యా విరుచుకుపడటంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పుతిన్‌తో సమానంగా జెలెన్‌స్కీ ని కూడా ఆయన విమర్శించారు. జెలెన్‌స్కీ నోరుపారేసుకుని సమస్యలు తెచ్చుకుంటున్నారని విమర్శించారు. నోటితో తంటాలు తెచ్చుకోవడం జెలెన్‌స్కీ మానేయాలన్నారు. అదే సమయంలో పుతిన్‌ను 'క్రేజీ'గా అభివర్ణించారు. వాషింగ్టన్ కు బయలుదేరేముందు న్యూజెర్సీ విమానాశ్రయంలో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ''అసలు పుతిన్‌కు ఏమైంది? ఎందుకిలా చేస్తున్నారు? మేం చేస్తు న్న చర్చలు, సంప్రదింపులు మధ్యలో ఉన్నాయి, ఆయనేమో రాకెట్లు ప్రయోగిస్తున్నారు, ఎంతోమంది ఆయన దాడుల్లో చనిపోతున్నారు, చాలాకాలంగా పుతి న్ నాకు తెలుసు, ఇద్దరం కలిశాం కూడా, కానీ జనావాసాలమీదకు రాకెట్లు పంపి ప్రజలను పుతిన్ చంపుతున్నారు, ఇది నాకు నచ్చడంలేదు'' అని ట్రంప్ అన్నారు. గడచిపోయిన సోమవారం నాడు పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడి 30 రోజులపాటు కాల్పుల విరమణ చేయించేందుకు ప్రయత్నం చేశారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఆదివారంనాడు ఉక్రేన్ రాజధాని కీవ్‌పై వందలడ్రోన్లు, క్షిపణులతో రష్యా సైన్యం దాడులు చేసింది. ఉక్రేన్‌కు భారీస్థాయిలో నష్టం వాటిల్లింది. అనేక ఆయుధ డిపోలు, పౌరప్రాంతాలు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. రష్యాకు స్థిరమైన ఆలోచనలు లేవని, వెర్రితనంగా ప్రవర్తిస్తోందని, ఈ విషయంలో తాను చాలా అసంతృప్తితో ఉన్నాననీ ట్రంప్ అన్నారు. 2022లో ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభించాక రష్యా చేసిన అతిపెద్ద దాడి ఇదే.

## పోలెండ్‌లో లక్షలాదిమందితో

# పోటాపోటీ ర్యాలీలు






**వార్సా :** సెంట్రల్ యూరప్ దేశం పోలెండ్‌లో రెండో విడత అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తూ ఉండటంతో గెలిచిన ప్రధాన అభ్యర్థులు ఇరువురూ దేశరాజధాని వార్సా నగరంలో లక్షలాదిమందితో పోటీపోటీ ర్యాలీలు నిర్వహించారు. ప్రతిపక్షాల తరపు అధ్యక్ష అభ్యర్థి కరోల్ నవ్రోకీ రెండు లక్షలమందితో భారీ ర్యాలీ నిర్వహించడగా అధికారపార్టీ అభ్యర్థి ట్రజస్కోవ్‌స్కీ తరపున నిర్వహించిన ర్యాలీకి ఐదు లక్షలమంది ప్రజలు హాజరయ్యారని పోలెండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్ ప్రకటించారు. జూన్‌లో జరిగే రెండో విడత రన్నాఫ్ ఎన్నికలు ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్‌కు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. ఆయన దేశంలో అనేక సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించారు. అధ్యక్షపదవికి తనపార్టీ అభ్యర్థి గెలుస్తాడని టస్క్ ఎంతో ధీమాగా ఉన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకురావాలని ప్రధానమంత్రి ఆత్రంగా ఉన్నారు.

అధ్యక్ష ఎన్నికల మొదటి రౌండ్ పోలింగ్‌లో అధికారపార్టీకి చెందిన రాఫెల్ ట్రజస్కోవ్‌స్కీ 31.36 శాతం ఓట్లతో ఆధిక్యం సాధించారు. ప్రతిపక్ష లా అండ్ జస్టిస్‌పార్టీ అధ్యక్ష అభ్యర్థి కరోల్ నవ్రోకి 29.54 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. 1990 నుండీ ఇప్పటివరకూ ఎన్నడూ లేనంతస్థాయిలో ఈనెల 18వ తేదీన జరిగిన మొదటిరౌండు ఎన్నికల్లో 67.3 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. అధ్యక్ష పదవికోసం ఎన్నికల్లో మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. జూన్ 1వ తేదీన రన్నాఫ్ ఎన్నికలు జరుగుతాయి. ఏడేళ్ళుగా వార్సా నగర మేయర్‌గా పనిచేస్తున్న రాఫెల్ ట్రజస్కోవ్‌స్కీ అధికార సివిక్ ఫ్లాట్‌ఫామ్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి పోటీ చేశారు. 2023 డిసెంబరులో ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన డోనాల్డ్ టస్క్ భవితవ్యం ట్రజస్కోవ్‌స్కీ గెలుపుమీదే ఆధారపడి ఉంది.

## ఎసిబి నోటీసు (మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో కెటిఆర్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించిన అవినీతి ఆరోపణలపై తెలంగాణ ఎసిబి కెటిఆర్‌పై కేసు నమోదు చేసింది. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరిలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణకు సంబంధించి, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపణలపై ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో కెటిఆర్ ప్రధాన నిందితుడిగా (ఎ1) పేర్కొనబడ్డారు. ఇతర నిందితుల్లో అప్పటి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ (ఎ2), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ) మాజీ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి (ఎ3) ఉన్నారు.

**ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికే : కల్వకుంట్ల కవిత**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి కుట్ర పూరితంగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు నోటీసులు జారీ చేసిందని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత విమర్శించారు. కెటిఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే ఎసిబి నోటీసులు జారీచేసినట్లు స్పష్టమవుతోందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైందన్నారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకుని నిలబడ్డ చరిత్ర కెసిఆర్ సైనికులదన్నారు.

## ఆరెంజ్, ఎల్లో అలెర్ట్

(మొదటి పేజీ తరువాయి)

అల్పపీడనం ఏర్పడే అవకాశముందన్నారు. ప్రస్తుతం ఉత్తర తెలంగాణ వరకు కొనసాగుతున్న ద్రోణి కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. కరీంనగర్ పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిలాల్లలో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు.

## 1000 కేసులు

(మొదటి పేజీ తరువాయి)

కేసుల విషయానికి వస్తే, కేరళలో అత్యధిక సంఖ్యలో కొత్త కేసులు నమోదయ్యాయి. ఇక్కడ అత్యధికంగా 430 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో 209, ఢిల్లీలో 104, గుజరాత్‌లో 83, తమిళనాడులో 69, కర్ణాటకలో 47 యాక్టివ్ కేసులు ఉన్నాయి. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో 15, రాజస్థాన్‌లో 13, పశ్చిమ బెంగాల్‌లో 12, పుదుచ్చేరిలో 9, హర్యానాలో 9, ఆంధ్రప్రదేశ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 2, ఛత్తీస్‌గఢ్‌లో 1, గోవాలో 1, తెలంగాణలో 1 యాక్టివ్ కేసులు రికార్డయ్యాయి. దీంతో భారతదేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1009కి చేరుకుంది. అండమాన్ నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, అసోం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ వంటి కొన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఎటువంటి కరోనా యాక్టివ్ కేసులు నమోదు కాలేదు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం ఇటీవల పలు శాఖలు వీటి గురించి చర్చించాయి. వాటిలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి), ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ (ఇఎంఆర్) డివిజన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్), సెంట్రల్ గవర్నమెంట్ హాస్పిటల్స్ నిపుణులు ఉన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్‌ఎస్) అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. ప్రధానంగా కరోనా వ్యాప్తి గురించి వీరు చర్చించారు. రాష్ట్రాలవారీ డేటా గురించి మాట్లాడుకుంటే ప్రస్తుతం కేరళ అత్యంత కరోనా ప్రభావిత రాష్ట్రంగా ఉంది. కేరళలో 430 యాక్టివ్ కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ రాష్ట్రాల్లో ఆరోగ్యశాఖ పర్యవేక్షణ, చికిత్స ప్రక్రియ కొనసాగుతోంది.

## విజయభేరి (మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియను వెనిజులా ప్రతిపక్షాలు బహిష్కరించాయి. ప్రభుత్వం తమను అణచివేతకు గురి చేస్తోందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారంనాడు జరిగిన పోలింగ్‌ను బహిష్కరించాయి. పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారన్న ఆరోపణలపై పలువురు ప్రతిపక్ష నాయకులను ప్రభుత్వం ముందుగానే అరెస్టు చేసింది. పిఎస్‌యుబి, జిపిపిఎస్‌బి అధికార కూటమి అనుకున్న విజయం సాధించింది. గత ఏడాది జులై 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మదురో విజయం సాధించారు. మళ్ళీ ఆయన ఆరేళ్ళపాలనాకాలం ఈ ఏడాది జనవరి నుండి ప్రారంభమైంది. దేశాన్ని బలహీన పరచేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయని మదురో ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు.

## 'ఆధార్- ఇ సంతకం'

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తామన్నారు. హైదరాబాద్, సచివాలయంలోని తన ఛాంబర్‌లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి ''స్లాట్ బుకింగ్ విధానం, పని భారం అధికంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగులు'' పలు అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం సమీక్షించారు. పటాన్‌చెరువు,యాదగిరిగుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ ఆర్ వోలను నియమించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అవినీతి రహితంగా,పారదర్శకంగా, సమయాన్ని ఆదాచేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెడుతన్న నేపథ్యంలో 'ఆధార్ ఈ సంతకం' కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువరావాలని అధికారులను ఆదేశివంచారు. 'ఈ ఆధార్ ఈ సంతకం' వల్ల 10 నుంచి 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకొస్తున్న నేపథ్యంలో ఎటువంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవినీతికి దూరంగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వ పేరును, ప్రతిష్టలను పెంచే విధంగా సబ్ రిజిస్ట్రార్ల పనితీరు ఉండాలని మంత్రి పొంగులేటి చెప్పారు.

## సర్వీస్‌నూ లెక్కించాలి

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి... దేవరకొండ లక్ష్మి వర్సెస్ ఎపి కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలన్న తీర్పును అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. 1980 సవరించిన పెన్షన్ నిబంధనలు 13, 14 ప్రకారం కాంట్రాక్ట్ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి పెన్షన్ సర్వీసు ప్రారంభమవుతుందన్నా రు. సుప్రీం కోర్టు, తెలంగాణ, ఎపి హైకోర్టుల తీర్పుల ప్రకా రం పిటిషనర్ల వినతలను చట్ట ప్రకారం అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు.

## కొనుగోలు చేయండి (మొదటి పేజీ తరువాయి)

నిర్మించిన రోలింగ్ స్టాక్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు.

పాకిస్థాన్ ఏకైక లక్ష్యం భారతదేశం మీద ద్వేషం, విరోధం పెంచిపోషించడమేననీ, భారత్‌కు హానితలపెట్టే ధోరణును ఆ దేశం పెంచుతుందని, అదేసమయంలో భారత మాత్రం పేదరిక నిర్మూలన, ఆర్థిక పురోగతి విషయంలో అచంచలమైన స్థిరత్వంతో ముందుకు వెళుతుందని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్'ను ఎంతగానో ప్రశంసించారు. ఇద కేవలం ఒక సైనిక చర్య మాత్రమేకాదనీ, భారతదేశం విశ్వసించిన ప్రగాఢమైన వ్యక్తీకరణలను, భావోద్వేగాలను, విలువలను ఆపరేషన్ సిందూర్ ప్రతిబింబిస్తుందని అన్నారు. ''ఈ విధంగా ఉగ్రవాదులు దాడులు చేసిన తర్వాత భారతదేశం గానీ, మోదీ గానీ ఎందుకు మౌనంగా కూర్చుంటారు?'' అని మోదీ ప్రశ్నించగానే ర్యాలీకి హాజరైన ప్రజలు ఉరుములు మెరుపుల గర్జనల్లా హర్షధ్వానాలతో ప్రతిస్పందించారు. ''నా సోదరీమణుల నుదుటి కుంకుమను ఎవరైనా చెరిపేయాలనే ధైర్యం చేస్తే అలాంటివాళ్ళు ఖచ్చితంగా అంతమైపోతారు, మోదీకి వ్యతిరేకంగా చేసే పోరాటం ఎంత కష్టంగా ఉంటుందనే విషయాన్ని ఉగ్రవాదులు కనే క్రూరమైన కలల్లో కూడా ఊహించలేరు, నుదుట తిలకం వివాహానికి చిహ్నం, దాన్ని చెరిపేయడమంటే వైధవ్యం సంప్రాప్తించడమే, 2014 మే 26న నన్ను దేశ ప్రధాన సేవకుడుగా ఎన్నుకున్నప్పుడే ఉగ్రవాదుల నిర్మూలన అనే నిర్ణయాత్మకమైన ప్రత్యక్షచర్యను పూర్తిచేసే బాధ్యతను కూడా భారతదేశ ప్రజలు నాకు అప్పగించారు, అందుకే ఈ కర్తవ్యాన్ని పూర్తి చేసేందుకు భారతదేశ త్రివిధ దళాలకు పూర్తిస్వేచ్ఛ ఇచ్చాను, దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఎవ్వరూ చూడనివిధంగా చర్యలు తీసుకోమని ఆదేశించాను'' అని నరేంద్రమోదీ ర్యాలీలో చెప్పారు. ''దేశ విభజన తర్వాత పొరుగున పాకిస్థాన్ ఉనికిలోకి వచ్చింది,భారతదేశంపై పగ,ద్వేషం వెదజల్లడంకోసమే ఆ దేశం బతుకుతోంది, భారత్‌కు హాని కలిగించాలని మాత్రమే ఆ దేశం కోరుకుంటున్నది, ఐనప్పటికీ కూడా భారతదేశం పేదరికాన్ని నిర్మూలించాలనే తన లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళుతోంది, ఆర్థిక అభివృద్ధి దిశగా దేశాన్ని తీసుకువెళుతోంది, అందువల్ల ''మేడ్ ఇన్ ఇండియా'' వస్తువుల కొనుగోలు చేయడానికే ప్రాధాన్యత ఇవ్వండి, ప్రత్యేకించి హోలీ, దివాళీ,గణేశ్ పూజ వంటి పర్వదినాల సమయాలలో మన దేశీయ వస్తువులనే కొనుగోలు చేయండి, ఐతే విదేశీ వస్తువులను దిగుమతి చేసుకోవడం మానేస్తామని మీరు అనుకుంటున్నారా? అని మోదీ ప్రశ్నించారు. విదేశాల నుండి వచ్చే బాణసంచా, గణేశ్ విగ్రహాలు వంటివాటిని ఉపయోగించడంపట్ల మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశాభివృద్ధికి ప్రతీదీ ముఖ్యమే, కానీ దేశీయంగా తయారు చేసిన వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వండి'' అని మోదీ కోరారు.

## కాల్చి చంపారు

(మొదటి పేజీ తరువాయి)

చూపాడన్నారు. 60 గంటల పాటు పోలీస్ బలగాలకు వ్యతిరేకంగా పోరాడామని 10 గంటల్లో ఐదు ఎన్‌కౌంటర్లు జరిగాయని తొలి ఘటనలోనే పోలీస్ జవాన్ మరణించాడని వారు తెలిపారు. మొత్తం 35 మంది సభ్యులు ఉన్నారని తొలి దశలో చందన్ అనే దళ కమాండర్ పోలీస్ బలగాలను ఎదిరిస్తూ మృతిచెందారన్నారు. పోలీస్ బలగాలనే చేధిస్తూ తప్పించుకునే మార్గం లేకపోయిందని అయిన ఏడుగురు మావోయిస్టులు తప్పించుకున్నారని నంబాల కేశవరావు సహా మరి కొందరిని తప్పించే మార్గం మూసుకుపోవడంతో కేశవరావును పోలీసులు సజీవంగా పట్టుకున్నారని మావోయిస్టులు లేఖలో తెలిపారు. హింసించి కాల్చి చంపారని ఉద్యమ ద్రోహుల కారణంగానే నంబాల ప్రాణాలను కోల్పోయారని వారు లేఖలో తెలిపారు. మరణించిన వారి ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకు పోయేందుకు చివరి వరకు కృషి చేస్తామని లేఖలో పేర్కొన్నారు. ఈనెల 21న గూడెపోట్ అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతులకు సంబంధించి పోలీసులు విడుదల చేసిన జాబితాలో తప్పులు ఉన్నాయని మావోయిస్టు పార్టీ తెలిపింది. నీలేష్ పేరు పోలీస్ జాబితాలో ఉందని కానీ అది ఆ మృతదేహం నీలేష్‌ది కాదని సంజు బీమా మృతదేహమని అతను బీజాపూర్ జిల్లాకు చెందిన వాడని తెలిపారు. క్రాంతి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారని క్రాంతి బతికే ఉన్నాడని క్రాంతిదిగా చెబుతున్న మృతదేహం హుగిమాద్వి అనే మావోయిస్టుదని అతను బీజాపూర్ జిల్లా పామేడ్ ప్రాంతానికి చెందిన వాడన్నారు. పోలీసులు మృతి చెందినట్లు చెబుతున్న జాబితాలో కల్పన పేరు ఉందని కానీ కల్పన బతికే ఉందని కల్పనదిగా చెబుతున్న మృతదేమం కమల అలియాస్ లక్ష్మి దని ఈమె జైపూర్ జిల్లాలోని పెద్ద గల్లేరు ప్రాంతానికి చెందినదని మావోయిస్టులు ఆ లేఖలో తెలిపారు. మావోయిస్టు మృతదేహాలను పోలీసులు ఖననం చేశారు.

ఈనెల 21న జరిగిన ఛత్తీస్‌ఘఢ్‌లోని గూడె పోట్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మరణించగా అందులో ఐదు మృతదేహాలను పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించ లేదు. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, నాగేశ్వరరావు, విజయలక్ష్మి , సంగీత, రాకేష్ లు ఉన్నారు. వీరి మృతదేహాలను అప్పగించాలని వారి బంధుమిత్రులు నారాయణపూర్ ఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అయిన పోలీసులు వారిని అప్పగించకుండా సోమవారం సాయంత్రం నారాయణపూర్ సమీపంలోని అడవిలో ఖననం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను పోలీసులు విడుదల చేశారు. మృతదేహాల కోసం మావోయిస్టుల బంధుమిత్రులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

## భారతావని విలవిల

(మొదటి పేజీ తరువాయి)

ఆఫీస్ వద్ద (86మి.మీ). కొలాబా పంపింగ్ స్టేషన్ వద్ద (83మి.మీ), మున్సిపల్ హెడ్ ఆఫీస్ (80మి.మీ)నమోదు అయ్యిందని వెల్లడించింది. ఈ ప్రాంతాలతో పోలిస్తే సబర్బన్ ఏరియాల్లో తక్కువ వర్షపాతమే నమోదు అయ్యిందని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ తెలియజేసింది.మసీదు స్టేషన్ వద్ద ఉన్న హార్బర్‌లైన్ రైల్వే ట్రాక్ పైన నీరు భారీగా చేరడంతో రైళ్ల సర్వీసులకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని సెంట్రల్ రైల్వే అధికారులు చెప్పారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరికల మధ్య ద్వీప నగరమైన ముంబైలో కొన్ని గంటలపాటు కుండపోత వర్షం కురిసింది.సెంట్రల్ రైల్వేలోని మసీద్, బైకుల్లా దాదర్, మాతుంగా, బాద్లాపూర్ రైల్వే స్టేషన్ల ట్రాక్‌లు నీటితో నిండిపోయాయి. దీనివల్ల అత్యంత రద్దీగా ఉండే ఉదయం పూట రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలాఉంటే మహారాష్ట్రలోని థానే, పల్ఘార్ జిల్లాలలో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలనుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆశ్రయం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఉల్హాస్ నది నీటి ప్రవాహ స్థాయిలు పెరిగి కళ్యాణ్‌ముర్బాద్ రోడ్డు మార్గంలోఉన్న రైతీ బ్రిడ్జి పొడవునా నీరు భారీగా చేరి ట్రాఫిక్ నిలిచిపోయిదని కళ్యాణ్ తహసీల్దార్ సచిన్ షెజల్ చెప్పారు.బృహన్ మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజీ వ్యవస్థ శివసేన (యుబిటి) హయాంలో బృహన్ మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజీ వ్యవస్థ నిధులను కాంట్రాక్టర్లు దుర్వినియోగం చేశారని మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ ఆరోపించారు. సోమవారం మధ్యాహ్నం భారత వాతావరణ శాఖ ముంబయి, థానే. రాయగఢ్, రత్నగిరి ప్రాంతాలకు రెడ్‌అలర్ట్ జారీచేసింది.

**జలదిగ్బంధంలో...ఢిల్లీ !...** ఢిల్లీలో శనివారం రాత్రి ఆదివారం రాత్రి వరకూ కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షాలకు దేశ రాజధాని .జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఢిల్లీ కంటోన్మెంట్, ధౌలా కువాన్, సుబ్రతో పార్కు, నానక్‌పురాలు జలదిగ్బంధానికి గురయ్యాయి. వర్ష ప్రభావంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 49విమానాలను దారి మళ్లించారు. 180కి పైగా విమానాల రాకపోకలపై వర్ష ప్రభావం పడింది. అయితే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా సోమవారం మాట్లాడుతూ నగరంలో ఎడతెరిపిలేకుండా కురిసిన భారీవర్షాల వల్ల అనేక వీధుల్లో వరదనీరు భారీగా నిలిచిపోయిందని, ఫలితంగా ఢిల్లీ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, సంబంధిత అధికారులు వారి ఏరియాలలో నిలిచిపోయిన వరద నీరును తొలగించడానికి బాధ్యత వహించాలని లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**కర్నాటక తీర ప్రాంతంలో వర్ష విధ్వంసం : రెడ్‌అలర్ట్ జారీ**

కర్నాటక తీర ప్రాంతంలో మూడవ రోజైన సోమవారం కూడా భారీ వర్షాలు కుదిపేశాయి.దీంతో దక్షిణ కన్నడ జిల్లాలో సాధారణ జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. సంబంధిత అధికారులు రానున్న మరో ఐదు రోజుల వరకూ రెడ్‌అలర్ట్ ప్రకటించారు.ప్రకృతి విపత్తు స్పందన బృందాలను భారీ వర్షప్రాంతాలలో మోహరింపజేశారు.మంగళూరు నగరంలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని రోడ్లపైకి మురుగునీరు చేరుకుంది. దక్షిణ క న్నడ జిల్లాలోని కొండ ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడ్డ కొద్దిపాటి సంఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. కొట్టారా జంక్షన్, మలేమార్, మంగళూరు నగరంలోని మహావీర సర్కిల్, నగరంలోని ఉర్వ, మటాడకని, కుద్రోలి,నగరంలోని కొడియల్‌బైల్ (పశ్చిమ) ప్రాంతాలలో వరద నీరు చేరిందని చెప్పారు. దక్షిణ కన్నడ జిల్లా అధికారయంత్రాంగం వెల్లడించిన ప్రకారం అనేక ప్రాంతాలలో గడచిన 24గంటలలో 150మి.మీ.వర్షపాతం నమోదు అయ్యిందని వివరించారు.సుల్లియాలోని బెల్లారేలో రికార్డు స్థాయిలో అత్యధిక వర్షపాతం 200.5మి.మీ నమోదు అయిందని తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం బృందాలు (ఎస్‌డిఆర్‌ఎఫ్) సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.

**కేరళలోనూ..వర్ష ఉగ్రరూపం...** కేరళలోని ఉత్తర జిల్లాలలో భారీగా కురిసిన కుండపోత వర్షాల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జనజీవనం స్తంభించిపోయింది. అధికారులు ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శిబిరాలలోకి తరలించారు.కేరళలో కురుస్తున్న భారీ వర్షాలు విస్తృత వరదలకు కారణమయ్యాయి. గ్రామాలు, పట్టణాలు, ఎత్తైన ప్రాంతాలు భారీవర్షాలకు అతలాకుతలం అయ్యాయి. వాయనాడ్‌లోని సుల్తాన్ బతేరీలోని పుజామ్‌కుని అనే ఒక చిన్న గ్రామం నుండి అనేక గిరిజన కుటుంబాలను అక్కడ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. బతేరీలో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశామని, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరింపజేసినట్లు వారు తెలియజేశారు. త్రిస్సూర్‌గురవయ్యూర్ రైలు మార్గంలో చెట్టు కూకటి వేళ్లతో సహా పడిపోయాయి.చెట్ల కొమ్మలు, మొద్దులను తొలగిస్తున్నామని అధికారులు చెప్పారు.

**దక్షిణ బెంగాల్‌లో..భారీ వర్షాలు....**దక్షిణ బెంగాల్‌లో సోమవారం భారీవర్షాలు కురిశాయి. భారత వాతావరణ శాఖ నైరుతిరుతు పవనాల రాకను ముందస్తుగానే తెలియజేస్తూ అప్రమత్తం చేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు ఈశాన్యప్రాంతంలోని వివిధ ప్రాంతాలలోకి ప్రవేశిస్తోంది. వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన ప్రకారం, పశ్చిమమధ్య, దానిని అనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మే 27న ఒకరూపంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో మే 28న రాష్ట్రంలో భారీవర్షాలు కురుస్తాయని చెప్పారు.

# జనరల్
STATE & REGIONAL NEWS

## 30న పూర్తి స్థాయి కార్యవర్గం ఏర్పాటుపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) పూర్తి స్థాయి కార్యవర్గం ఏర్పాటుపై కాంగ్రెస్ అధిష్టానం ఈ నెల 30వ తేదీన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కార్యవర్గం ఏర్పాటుపై అధిష్టానంతో చర్చించేందుకు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు గత కొన్ని రోజుల కింద ఢిల్లీకి వెళ్ళారు. అయితే ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే బిజీ షెడ్యూల్‌తో ఆయన ఢిల్లీలో లేకపోవడంతో టిపిసిసి కార్యవర్గ ఏర్పాటు నిర్ణయం వాయిదాపడింది. దీంతో ఈ నెల 30వ తేదీన మరోసారి ఢిల్లీకి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌కు, ఇతర సీనియర్ నాయకులకు అధిష్టానం సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అధిష్టానంతో భేటీ అయిన అనంతరమే టిపిసిసి కార్యవర్గం ఏర్పాటుపై స్పష్టత వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ ఆశావహులు ఎదురుచూస్తున్నారు.




## సిపిఐ సోషల్ మీడియా విభాగ సమావేశం

**న్యూఢిల్లీ:** 'సమకాలీన ప్రపంచంలో సోషల్ మీడియాకు ఎంతో కీలక ప్రాధాన్యత' అనే అంశంపై న్యూఢిల్లీలోని అజయ్ భవన్‌లో సోమవారంనాడు జరిగిన ఈ సమావేశాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. సోషల్ మీడియా విభాగ విస్తరణ సమావేశ సందర్భంగా ఆ విభాగం ఇన్‌ఛార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి డా.భాల్‌చంద్ర కాంగో మాట్లాడుతూ, సమావేశ ఉద్దేశాలను వివరించారు. పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని విస్తరించి పటిష్టంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, అనీ రాజా, పల్లబ్ సేన్‌గుప్తా కూడా సమావేశంలో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. పార్టీ ఎజెండాకు అనుగుణంగా తదుపరి డిజిటల్ వేదికలను సద్వినియోగం చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో కార్యకర్తలను ప్రోత్సహించాలని వారు కోరారు.

# పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కారం

### మంత్రి సీతక్క హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీ కార్యదర్శుల సమస్యల వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హామీనిచ్చారు. న్యాయపరమైన సలహాలు తీసుకోవడంతో పాటు క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్లి సర్వీస్ సమస్యలను తీర్చేందుకు ప్రయత్నిస్తామని, స్పోర్ట్స్ కేటగిరీలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లను చేపట్టాలన్న ప్రతిపాదనపై మరింత అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కతో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ప్రతినిధి బృందం సోమవారం సమావేశమైంది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, డైరెక్టర్ సృజనతో పాటు తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, గౌరవాధ్యక్షులు సందీప్, కోశాధికారి శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ సమస్యల పరిష్కారంపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ శాఖ పరిధిలో ఉండే అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, క్యాబినెట్‌లో పరిష్కరించాల్సిన అంశాలను ఉద్యోగ సమస్యల పరిష్కారానికి ఏర్పడిన క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు సమస్యల పరిష్కారం పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో పంచాయతీ కార్యదర్శులు సవాలక్ష సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇతర ఉద్యోగస్తులకు లేని ఎన్నో షరతులతో పంచాయతీ కార్యదర్శుల నియామకాలు చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. 2019లో పంచాయతీ కార్యదర్శులను రిక్రూట్ చేసిన సమయంలో మొదట మూడేళ్ల ప్రొబేషన్ అన్నారని, ఆ తరువాత మరో ఏడాది పెంచారని, కానీ ఎఫెక్టెడ్ తేదీని మాత్రం ఖరారు చేయలేదని మంత్రి సీతక్క వివరించారు. పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో ఎన్నో చిక్కుముడులు ఉన్నాయని, న్యాయపరంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ ప్రస్తావించిన అంశాలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, డైరెక్టర్ సృజనకు మంత్రి ఆదేశించారు.



పంచాయతీ కార్యదర్శులు లేని గ్రామ స్వరాజ్యాన్ని ఊహించుకోలేమని, అందుకే జాబ్‌చార్ట్ కావాలని, ఫలానా పనులనే చేస్తామనే విధానాన్ని పంచాయతీ కార్యదర్శులు విరమించుకోవాలని కోరారు. ముందస్తు సమాచారం,అనుమతులు లేకుండానే కొంతమంది పంచాయతీ కార్యదర్శులు విధులకు నెలల తరబడి గైర్హాజరవుతున్నారని, అయినప్పటికీ మానవతా దృక్పథంతో వారిని ఎవరిని కూడా సర్వీస్ నుంచి తొలగించలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. 1038 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలను జూనియర్ పంచాయతీ సెక్రటరీలుగా చేయాలన్న ప్రతిపాదనను, స్పోర్ట్స్ కోటాలో రిక్రూట్ అయి తొలగించబడిన 98 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తిరిగి చేర్చుకునే అంశంపై కోర్టులో కేసు నడుస్తోందని, కోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పునకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, త్వరలో రెవెన్యూ శాఖలో గ్రామ పాలన అధికారులు రిక్రూట్ అవుతున్నారని, ఈ రిక్రూట్‌మెంట్ పూర్తయితే, పంచాయతీ కార్యదర్శుల మీద పని భారం తగ్గుతుందని వివరించారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో అత్యవసర పనుల కోసం పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులను వెచ్చించారని, వారి బిల్లులను త్వరలో విడుదల చేస్తామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. విధుల నిర్వహణలో భాగంగా మండల కేంద్రాలకు వెళ్లే పంచాయతీ కార్యదర్శులు టిఎ, డిఎ సౌకర్యాన్ని కల్పించాలనే అంశాన్ని కూడా పరి శీలిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు సంతోషంగా ఉంటే పల్లెలు సంతోషంగా ఉంటాయని, పంచాయతీ కార్యదర్శులు తమ పనితీరును మరింత మెరుగు పరచుకోవాలని మంత్రి సూచించారు.

# ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రాథమిక సహకార సంఘాలబలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరామిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి రైతు కమిషన్ సిఫార్సులను మంత్రికి అందజేశారు. సహకార రంగానికి సంబంధించి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. తద్వారా ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి అనువుగా ఈ సమావేశం నిర్వహించుకోవాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా మట్టి నమూనా ఫలితాలు ప్రతీ రైతుకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపథ్యంలో ఇందుకు తగ్గ విధి విధానాల రూపకల్పనలో కమిషన్ అభిప్రాయాలను మంత్రికి వివరించారు. అంతకు ముందు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అమలు అవుతున్న కార్యక్రమ అమలు తీరు సమీక్షించాలని, ఇదే తరహాలో ఈ నెల29 నుంచి జూన్ 12వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని సైతం విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ డైరెక్టర్ గోపిని ఆదేశించారు మట్టి నమూనా పరీక్షలు త్వరితగతిన పూర్తిచేసి ఎఫ్‌పిఓలకు అందచేయడం, రైతువేదికలలో పెట్టడం ద్వారా, ప్రతీ అవసరమున్న రైతుకు మట్టి నమూనా పరీక్ష చేసుకొనే వెసులుబాటు కల్పించాలని సూచించారు. యూనివర్సిటీ ద్వారా ప్రతీ రెవిన్యూ గ్రామాలలో ముగ్గురు ఎంపిక చేసిన రైతులకు మూల విత్తనము (ఫౌండేషన్ సీడ్)ను ఇచ్చేలా డిపార్ట్ మెం ట్ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నా రు. ఇందుకు సంబంధించి మూలవిత్తనం సరఫరా చేసిన రైతుల పొలాల నిరంతర పర్యవేక్షణ చేస్తూ, అలా ఉత్పత్తి చేసిన విత్తనాన్ని రైతులకు తిరిగి చేరేవిధంగా చూడాలని, అప్పుడే కార్యక్రమం యొక్క లక్ష్యం నేరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

**పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు ప్రభుత్వం అన్ని చర్యలు**

పచ్చిరొట్ట విత్తనాల సరఫరాలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టిజి సీడ్స్ అధికారులను ఆదేశించారు. పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు సంబంధించి తెలంగాణ సీడ్స్ కార్పోరేషన్‌కు 90వేల క్వింటాళ్ళు, నేషనల్ సీడ్ కార్పోరేషన్‌కు 40వేల క్వింటాళ్లకు అధికారులు ఇండెంట్ ఇచ్చారు. ఇందులో భాగంగా 32 జిల్లాలలో 20 జిల్లాలు టిజి సీడ్స్‌కు, 12 జిల్లాలు నేషనల్ సీడ్ కార్పోరేషన్ కు కేటాయించారు. అయితే తెలంగాణ సీడ్ కార్పోరేషన్ ఇప్పటివరకు 71,535 క్వింటాళ్లను తెప్పించి వారికి కేటాయించిన 20 జిల్లాలలో పంపిణీ ప్రారంభించిగా, నేషనల్ సీడ్ కార్పోరేషన్ కేటాయించిన40 వేల క్వింటాళ్లలో ఇప్పటి వరకు కేవలం 1000 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేసింది. దీంతో ఆ సంస్థకు కేటాయించిన 12 జిల్లాలలో సరఫరాలో అడ్డంకులు రావడంతో అధికారులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తక్షణమే టిజి సీడ్స్ ద్వారా మిగతా 12 జిల్లాలలో కూడా సరఫరా ఆరంభించి ఆ జిల్లా రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఒప్పందం మేరకు సరఫరా ఆరంభించని నేషనల్ సీడ్ కార్పోరేషన్ రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు ఢిల్లీ స్థాయిలో ఉన్న అధికారులను కల్సి పచ్చిరొట్ట విత్తనాల సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరాలన్నారు. ఇదే క్రమంలో పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి టిజీసీడ్స్ ద్వారా అదనంగా విత్తనాలను తెప్పించి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రైతులెవరూ ఆందోళన పడొద్దని మంత్రి కోరారు.

## విద్యుత్ కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే రికార్డు

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టామని, ఆ తర్వాత విద్యుత్ సంస్థల్లోనూ అమలు చేస్తున్నామని వివరించారు. ఎన్‌పిడిసిఎల్ పరిధిలోని విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటీ రూపాయల ప్రమాద బీమా చెక్కును, నరష్ భార్యకు విద్యుత్‌శాఖలో కారుణ్య నియామక ఉత్తర్వుల పత్రాన్ని భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన చేయలేదని, కనీసం ప్రయత్నించలేదని వివరించారు. ప్రమాద బీమా, కారుణ్యనియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు, మానవీయ కోణానికి అద్దం పడుతుందన్నారు. కోటి రూపాయల పైబడి ప్రమాద బీమాను ఇవ్వడం విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికులందరిలో ఒక భరోసాను నింపుతుందని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భట్టి కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతం గా అమలు చేసిన ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం.నరేందర్ రెడ్డి, విద్యుత్తు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు వస్తుందని కలలో కూడా అనుకోలేదు

### మంత్రి శ్రీనివాసరెడ్డితో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ముఖాముఖీ
### లబ్ధిదారులే నిర్మాణకర్తలు.. ఇప్పటి వరకు రూ.68 కోట్లు దాటిన చెల్లింపులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూడా పేదవారికి ఇచ్చిన మాట ప్రకారం తల తాకట్టుపెట్టయినా సరే ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులను విడుదల చేసి తీరుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఒక్క రోజు కూడా ఇందిరమ్మ లబ్ధిదారుడు నిధుల కోసం ఎదురుచూడకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తామన్నారు. సచివాలయంలోని తన కార్యాలయం నుంచి సోమవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గంటన్నర పాటు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదవారి సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని, త్వరలో గృహ ప్రవేశాలు కూడా చేసుకుంటారని పేదింటి ఆడపడుచుల ఆహ్వానాన్ని స్వీకరించి వీలైన చోట్ల గృహ ప్రవేశానికి వెళ్తానని చెప్పారు. ఈనెల 19వ తేదీ నుంచి ఈ వారానికి సంబంధించి లబ్ధిదారులకు రూ.14.44 కోట్లను విడుదల చేశామన్నారు. ఈ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇండ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు 7,824 ఇండ్లు బేస్‌మెంట్, 895 ఇండ్లు గోడల నిర్మాణం వరకు మరో 64 ఇండ్లు శ్లాబ్‌ల వరకు పూర్తయ్యాయని వివరించారు. రాష్ట్రంలో ఇంతవరకు బేస్‌మెంట్ పూర్తి అయిన 5,682 ఇండ్లకు లక్ష చొప్పున రూ.56. 82 కోట్లు, గోడలు పూర్తి అయిన 497 ఇండ్లకు రూ.2 లక్షల చొప్పున రూ.9.94 కోట్లు, స్లాబు పూర్తయిన 33 ఇండ్లకు 4 లక్షల చొప్పున రూ. 1.32 కోట్లు విడుదల చేశామని మొత్తంగా ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.68.08 కోట్లు అందజేశామని మంత్రి వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇల్లు వస్తుందని కలలో కూడా అనుకోలేదు**

'ఇందిరమ్మ ఇల్లు వస్తుందని కలలో కూడా అనుకోలేదు. 10–15 సంవత్సరాల నుంచి గుడిసెలు, రేకుల షెడ్డుల్లోనే ఉంటున్నాం. పిల్లలు పెద్ద అవుతున్నారు. సరిపోవడంలేదు. ఉన్నదాంట్లోనే సర్దుకుంటున్నాం. ఎన్నో ఏండ్ల నుంచి కిరాయి ఇంట్లో ఉంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాకు ఇందిరమ్మ ఇల్లు వచ్చింది. స్లాబ్ వేసుకున్నాం. రూ.4లక్షలు ఇచ్చారు. కొద్దిరోజుల్లో ఇంటి పనులు పూర్తి చేసుకుంటాం. మా గృహ ప్రవేశానికి సిఎం రేవంత్ రెడ్డి సార్‌ను తీసుకుని మీరు రావాలి సార్.. మీరు వస్తే జొన్న రొట్టెలు పెడతాం యాటను కూడా కోస్తాం. రేవంత్ రెడ్డి సార్ మీరందరరూ తినే సన్నబియ్యం మాకు కూడా ఇస్తుండు. ఆ బియ్యంతో భోజనం పెడతాం'' అని వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తమ మనోగతాన్ని వ్యక్తం చేశారు. 'ఇందిరమ్మ ఇల్లు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. బేస్‌మెంట్, గోడలకు ఇప్పటి వరకు రూ.2 లక్షలు ఇచ్చారు. సొంత ఇల్లు ఉండాలన్న మా కోరికను సిఎం రేవంత్ రెడ్డి తీర్చారు' అని ఖమ్మం జిల్లాకు చెందిన ఉమ అన్నారు.

# నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం నక్సలైట్లతో శాంతి చర్చలు జరిపి, అట్టి సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జన సేవాదళ్ శిక్షణ శిబిరానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అంతకు ముందు సిపిఐ జెండాను ఆవిష్కరణ చేసి, కార్యకర్తలతో కలిసి కర్రసాము చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీజ్‌ఫైర్ తక్షణమే ఆపివేసి నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నక్సలైట్ల సమస్యను ఒక సైద్ధాంతిక సమస్యగా చూడాలి లేదా రాజకీయ సమస్యగా చూడలే తప్ప తీవ్రవాద సమస్యగా పరిగణించకూడదని ఆయన హితవు పలికారు. నక్సలైట్ల రహిత దేశంగా మార్చుతామని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని నక్సలైట్లను చంపడం సరైన విధానం కాదన్నారు. నక్సలైట్లను చంపి వారి సిద్ధాంతాలను అణచివేయాలని చూస్తే అది తాత్కాలిక మాత్రమేనని, ఆ తర్వాత అయినా వేల మంది పుట్టుకొస్తారన్నారు. దేశంలో నక్సలైట్లను లేకుండా చేస్తామని చెప్పడం సరికాదన్నారు. రెండు తుపాకులతో సమస్య పరిష్కారం కాదు. చర్చలతోనే సమస్య పరిష్కారం అవుతుందని ప్రభుత్వం గుర్తెరగాలని నారాయణ సూచించారు. సిద్ధాంతాలను ఓడించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేయండి తప్పులేదు, కాని నక్సలైట్ల సిద్ధాంతాన్ని, నమ్మిన వారిని చంపివేస్తామంటే ప్రజాస్వామ్య ప్రభుత్వం కాదన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో వివిధ రాజకీయ, ప్రతిపక్ష పార్టీలు విభేదిస్తాయి కాని, విభేదించి వారిని చంపివేస్తామంటే ప్రజల చేత ఎన్నుకున్న ప్రభుత్వం కాదా.. అన్నారు. టెర్రరిస్టులతో పాకిస్తాన్, విదేశీ శక్తులతో శాంతి ఒప్పందం చేసుకున్న కేంద్ర ప్రభుత్వం మరి దేశ పౌరులైన వారితో చర్చలు జరిపితే తప్పు ఏం అవుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే స్పందించి నక్సలైట్లతో చర్చలు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేవ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, గోశిక మోహన్, మారుపాక అనిల్ కుమార్, శంకర్, ఎఐ ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగరావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, చందు యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్ గౌడ్, బి.సుభాన్ రెడ్డి, బికెఎంయు జిల్లా అధ్యక్షులు అంజయ్య, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బిఒసి జిల్లా ప్రధాన కార్యదర్శి కన్య గారి నరసింహా రెడ్డి, వివిధ మండలాల కార్యదర్శులు ఎం.సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, ఎన్ ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మీనాక్షి కృష్ణ, బాబురావు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ అరుణ

### వ్యక్తి వద్ద రూ.30వేలు తీసుకుంటుండగా పట్టివేత
### అధికారులు లంచం అడిగితే ఎసిబి టోల్‌ఫ్రీ నెంబర్ '1064'కు సమాచారం ఇవ్వండిః డిఎస్‌పి వై.రమేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఓ రైతు వద్ద నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా.. ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ అరుణను ఏసీబీ అధికారులు దాడులు చేసి కార్యాలయంలో పట్టుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడులో రెండువేల గజాల స్థలం ఉంది. దీనిని తన కుమారుడి పేరుపై గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ అరుణను అడగగా రూ.లక్ష వరకు డిమాండ్ చేసింది. ఆ డబ్బులను ఇచ్చేందుకు నిరాకరించిన సదరు వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి సబ్‌రిజిస్ట్రార్‌కు సంబంధించిన డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేశ్వరరావుకు ముందుగా రూ.30వేలు ఇస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం తీసుకున్న డబ్బులను సబ్‌రిజిస్ట్రార్ అరుణకు కార్యాలయంలో అందిస్తుండగా... డాక్యుమెంట్ రైటర్‌తో సహా సబ్‌రిజిస్ట్రార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.

## విత్తన చట్ట ముసాయిదా రూపకల్పన
# కమిటీ తొలి సమావేశం

### విత్తన చట్ట ముసాయిదా రూపకల్పనలో రైతుల అభిప్రాయాలే కీలకం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విత్తన చట్ట ముసాయిదా రూపకల్పనలో రైతుల అభిప్రాయాలే కీలకమని విత్తన చట్టం రూపకల్పన కమిటీ వెల్లడించింది. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో సోమవారం కమిటీ తొలి సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలోకమిటీ సభ్యులు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, రామాంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహా రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ ,కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవిందులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతు సంక్షేమం లక్ష్యంగా తీసుకు రానున్న విత్తన చట్టం ముసాయిదా రూపొందించడానికి ముందు కమిటీ క్షేత్రస్థాయి పర్యటించాలని, ఈ సందర్భంగా రైతులతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి వారిఅభిప్రాయాలు, సూచనలు. సలహాలు తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. విత్తన చట్టంముసాయిదా రూపకల్పనలో రైతుల అభిప్రాయాలలే కీలకమని, ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విత్తన చట్టాలపై అధ్యయనం చేయాలని కమిటి అభిప్రాయానికి వచ్చింది. విత్తన చట్ట ముసాయిదాలో కీలకంగా రైతుకు విత్తన హక్కు కల్పించడం, నకిలీ విత్తనాలు అరికట్టడం, ఒకవేళ నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఏవిదంగా నష్టపరిహారం చెల్లించాలి అనే అంశాలు ఈసమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకు ఉన్న చట్టాల్లోని లోపాలపై కమిటీ సభ్యులు క్షుణంగా చర్చించారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో సమావేశాలు నిర్వహించాలని, సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు, డీలర్స్‌తో సైతం దశలవారీగా చర్చించాలని కమిటీ నిర్ణయించింది.

## జూన్‌లో బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూన్‌లో బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, గ్రామస్థాయి నుంచి కొత్త కమిటీలను ఏర్పాటు చేయబోతున్నామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్, బిజెపికి గట్టిగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీని పాలమూరు ప్రజలు నమ్మి బొక్క బోర్లపడి, ఇప్పుడు, బాధపడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ దరిద్రాన్ని ఇంకా ఎన్ని రోజులు చూడాలని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారని, కానీ ఒక్క తప్పు ఓటుకు ఐదేళ్లు శిక్ష కదా? అని కెటిఆర్ వ్యాఖ్యానించారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బిజెపికి నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ సమక్షంలో సోమవారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ఉప ఎన్నికలు వస్తే గద్వాల్‌లో మళ్ళీ గులాబీ జెండా ఎగరేస్తామన్నారు. ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయ హస్తం అని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తరువాత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రానికి బలమైన పునాది వేశామన్నారు. పార్టీని వీడిన 10 మంది ఎంఎల్‌ఎలకు కర్రు కాల్చి వాతపెట్టాలని, ఆ ఎంఎల్‌ఎలను పండబెట్టి తొక్కాలని సూచించారు. మనతోనే ఉండి వారు మనకే వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. గద్వాల్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల ఖాయమని, 200 జెట్ స్పీడ్ తో కారు గెలవడం ఖాయమని, కారు అంటే కెసిఆరే అని అన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని కెటిఆర్ అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, బిఆర్‌ఎస్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
మంగళవారం, మే 27

# సిందూరం – రాజకీయం

కశ్మీర్‌లోని పహల్గాం బైసరన్ లోయలో పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు అమాయక పర్యాటకులు 27మందిని కుటుంబసభ్యుల కళ్లెదుటే తుపాకులతో కాల్చిచంపిన దారుణ కృత్యానికి భారత సైన్యం ప్రతీకారం తీసుకున్న 'ఆపరేషన్ సిందూర్' కుల, మతాలు, ప్రాంతాలు, రాజకీయాల కతీతంగా దేశ ప్రజలందరి సంఘీభావం పొందింది. అంతర్జాతీయ పర్యవసానాలు ఆలోచించి ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సైన్యం టెర్రరిస్టుల మౌలిక వసతులపైనే క్షిపణిదాడులు గురిపెట్టి దెబ్బతీసింది; మే 8న దాడి అనంతరం రెండ్రోజులకే 'కాల్పుల విరమణ' ప్రకటన దేశ ప్రజలకు ఆశ్చర్యం కలిగించగా, హిందూత్వ బ్రిగేడ్‌లు మాత్రం ఆశాభంగం చెందాయి, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను విముక్తి చేయనందుకు అసంతృప్తి వ్యక్తం చేశాయి. అప్పటివరకు ఉన్న జాతీయ ఏకాభిప్రాయం, 'తమ ప్రభుత్వం కాల్పుల విరమణ సాధించిందని, వాణిజ్యం పెంపుదల హామీతో రెండు దేశాల ప్రభుత్వాలను ఒప్పించామని' అధ్యక్షుడు ట్రంప్, భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలకన్నా ముందే ప్రకటించి ఆ ఖ్యాతిని తన ఖాతాలో వేసుకోవటం, కశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేసేందుకు తద్వారా చేసిన ప్రయత్నం వివాదాస్పదమైంది. ప్రధాని నరేంద్రమోదీ నోరు తెరిచి ఖండించకపోవటం దేశ సార్వభౌమత్వ పరిరక్షణలో రాజీపడినట్లు విమర్శలకు గురైంది.

రాజకీయం చేయకూడదని సమస్యను నెలరోజులు తిరక్కమునుపే పాలక బిజెపి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవటం మొదలు పెట్టింది. అందుకు ప్రతిగా కాంగ్రెస్, ఇతర పార్టీలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రధానమంత్రి రెండు అఖిలపక్ష సమావేశాలకు ఎందుకు హాజరు కాలేదు, అందులో తొలి సమావేశానికి గైరుహాజరై బిహార్‌లో ఎన్నికల సభకు ఎందుకు వెళ్లారు? ఆపరేషన్ సిందూర్ ప్రయోజనాలను, చర్చించి జాతీయ ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూ, సైన్యానికి అభినందనలు తెలుపుతూ తీర్మానించేందుకు పార్లమెంటును సమావేశపరచాలన్న ప్రతిపక్షం ప్రజాస్వామిక డిమాండ్‌ను ప్రధాని ఎందుకు అంగీకరించలేదు?


భారత సైన్యం సాధించిన సాహసోపేత కార్యాన్ని తమ ఖాతాలో వేసుకుని ప్రధానమంత్రి మోదీకి ఆ ఘనతను కట్టబెట్టేందుకు బిజెపివారు ఏకపక్షంగా తిరంగా ఊరేగింపులు చేశారు. అఖిలపక్ష కార్యక్రమంగా దాన్ని నిర్వహించి ఉంటే ప్రపంచం ముందు మన దేశం ప్రతిష్ట ఇనుమడించేది కాదా? స్వదేశంలో ప్రతిపక్షాలను కలిసికట్టుగా తన వెంట తీసుకెళ్లే ప్రయత్నం చేయని ప్రధాని మోదీ, పార్లమెంటరీ ఫోరంను ఉపయోగించుకుని అరడజను ఎంపిల 'అఖిలపక్ష' బృందాలను ఓ 30దేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' వివరించి వాటి సంఘీభావాన్ని కూడగట్టేందుకు పంపారు. వాటిలో సిపిఐ, ఇంకా కొన్ని పార్టీలకు స్థానం కల్పించలేదు. ఎంపిల ఎంపికలో పక్షపాతం విమర్శలకు గురైంది.

మరోవైపున, ప్రధాని నరేంద్రమోదీయే ఆర్మీ కమాండర్ ఇన్ ఛీఫ్ అయినట్లు ఆయన బొమ్మకు మిలటరీ యూనిఫాం వేసిన ఫోటోలు పెద్ద ఎత్తున ప్రచారంలోకి తెచ్చారు. టెర్రరిస్టులు ఆడవారి నుదుటి కుంకుమ బొట్టు (సిందూర్) తుడిచివేస్తే, మోదీ టెర్రరిస్టు శిబిరాలపై దాడులు చేసి ఆ సిందూర రక్షకుడైనట్లుగా ఆయన సభలకు ప్రత్యేకించి మహిళలను సమీకరించే సరికొత్త ఎత్తుగడను సోమవారం ఆయన గుజరాత్ పర్యటనలో మొదలుపెట్టారు. రానున్న బిహార్ తదితర అసెంబ్లీ ఎన్నికలకోసం మహిళా ఓటర్లకు 'సిందూరం సెంటిమెంట్' ప్రచారం ప్రారంభించారన్న మాట! టెర్రరిస్టుల హత్యాకాండలో ఆప్తులను కోల్పోయిన కుటుంబ సభ్యుల కన్నీరు ఇంకిపోకమునుపే ఈ పనులు చేస్తున్నారు. 2019లో పుల్వామాలో సైనిక శకటాల కాన్వాయ్‌పై టెర్రరిస్టుల దాడిలో 40మంది సిఆర్‌పిఎఫ్ జవాన్‌లు హతులైనప్పుడు తిరంగా యాత్రలు, ఎంపిల విదేశీయాత్రలు లేవు. అయితే టెర్రరిజాన్ని నిర్మూలించేందుకు కేంద్రంలో బలమైన ప్రభుత్వం కావాలన్న విజ్ఞప్తి, ఆ ఎన్నికల్లో బిజెపికి ఎన్నడూలేనన్ని సీట్లు ఇచ్చింది.

పహల్గాం టెర్రరిస్టు దాడిని సాకుగా తీసుకుని వివిధ యూనివర్శిటీల్లోని కశ్మీరీ విద్యార్థులపై అపర హిందూత్వ వాదులు చేసిన దాడులకు, కొన్ని ప్రదేశాల్లో ముస్లింల వ్యాపారాలపై దాడులకు ఒడిగట్టిన వారికి గట్టి హెచ్చరిక, ఎటువంటి చర్యలు కనిపించవు. జాతీయ ఐక్యత పరిరక్షించాల్సిన సమయాల్లోనూ ఇటువంటి వివక్ష తగునా?

రాజకీయ స్వార్థాలను అలా పక్కనబెడితే, భారత రాజ్యాంగం మౌలిక విలువల్లోనే భారత దేశ బలం, శక్తి ఉన్నాయని మరువరాదు. సీమాంతర ఉగ్రవాదం వంటి సమకాలీన సవాలు ఎదుర్కోవటంలో ఆ విలువలను మరింత బలంగా ప్రచారంలో పెట్టాలి. గుర్తింపుకోసం పాకులాడే ప్రజలను విభజించే పిడివాద రాజకీయాలను ఎదుర్కొనేందుకు ప్రజాస్వామ్యం కోసం పోరాటం కొనసాగించటం నేటి అవసరం.

# మూఢ నమ్మకాలపై కందుకూరి పోరాటం


డాక్టర్ దేవరాజు మహారాజు

''కార్యశూరుడు వీరేశలింగం.
కదం తొక్కి పోరాడిన సింగం
దురాచారాలు దురాగతాలను
తుదముట్టించిన అగ్ని తరంగం''

తెలుగు రచయిత, సంఘ సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం పంతులు గూర్చి తెలుగు కవి శ్రీశ్రీ వాక్కులివి!

ఇది కందుకూరి వారి 177వ జయంతి, 106 వ వర్ధంతి (16 ఏప్రిల్ 1848 : 27 మే 1919)

'ఉద్యోగంలో చేరడానికి అమావాస్య నాడే ఎందుకు వచ్చావ'ని అధికారి అడిగాడు.

''అయ్యా! అన్ని రోజులూ ఆ ఈశ్వరుడు సృష్టించినవనే చెపుతారు కదా? మరి అలాంటప్పుడు అన్ని రోజులూ మంచివే – అలాంటప్పుడు ఇక నేను ఏ రోజు ఉద్యోగంలో చేరినా, అది మంచి రోజే అవుతుంది!'' అని తాపీగా సమాధాన మిచ్చారు వీరేశలింగం. ఈ విషయం ''మూఢ నమ్మకాలపై నా పోరాటం'' – అనే గ్రంథంలో ఆయనే స్వయంగా రాసుకున్నారు (పే.24). అభిరుచి ఉన్నవారు (ఆ) పుస్తకం సంపాదించి, క్షుణ్ణంగా చదవడం మంచిది. అందులో ఆయన అనేక ప్రహసనాలు రాశారు. అందులో ఒకటి ''శకునాలు'' అనే శీర్షికతో ఉంది. ఉదాహరణకు ఇక్కడ అందులోని విషయాలు కొన్ని క్లుప్తంగా పొందుపరుస్తున్నాను. సున్నిత హాస్యం, వ్యంగ్యం మేళవించి ఎంతో మనోరంజకంగా రాశారు గమనించండి !

కుటుంబాన్ని తీసుకుని ప్రయాణం చేయాలంటే వెనకటి రోజుల్లో ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేది. అసలే రవాణా సౌకర్యాలు సరిగాలేని రోజులు. పైగా ఘడియ ఘడియకూ ముహూర్తాలు చూసుకునే పిచ్చి. మనువాదులు ఆ పిచ్చిని ఎప్పటికప్పుడు మరింతగా పెంచి పోషిస్తూ ఉండేవారు. ఆ విశేషాలన్నీ వీరేశలింగం సోదాహరణంగా రాసుకొచ్చారు. ఇన్నిన్ని చాదస్తాల మధ్య ఆ కాలం మనుషులు ఎలా బతికారబ్బా ? అని ఆశ్చర్యపోవాల్సి వస్తుంది కూడా !

ఆడవాళ్ళను తీసుకుని మంచి చెడ్డా విచారించకుండా దూరాభారం ఎలా బయలుదేరనండీ? పోనీ, అమావాస్యకు ముందే బయలు దేరుదామంటే, దోవలో అమావాస్య వస్తే మంచిది కాదని పెద్దలు చెప్పినారు. అమావాస్య వెళ్ళిన పాడ్యమి ప్రయాణానికి బొత్తిగా మంచిది కాదు. విదియనాడు బయలుదేరుదామంటే ఆ రోజు శుక్రవారం అయింది. అక్కడికీ మొండిగా చొరవచేసి బయలుదేరుదామని అనుకునేంతలో ఎవరో 'హాచ్'మని తుమ్మినారు. అటువంటి అపశకునం అయిన తర్వాత, ప్రయాణం ఎలా చేస్తామని ఆనాటికి మానేశాం. శనివారం ఉదయమా దుర్ముహూర్తం ! పిల్లలను తీసుకుని ఎలా బయలుదేరడం ? ఆ మధ్యాహ్నమేమో వర్జ్యం వచ్చింది! వర్జ్యం వెళ్ళిన తరువాతి రాత్రి, బండికోసం కబురు చేయబోతుంటే – గుడ్లగూబ కూసింది. అలాంటప్పుడు ప్రయాణం మానేయక తప్పదు కదా? ఇక ఏం చేయడం ? ఆ మరునాడు చవితి. ప్రయాణానికి చవితి ఏమాత్రం మంచిది కాదని అందరికీ తెలిసిన విషయమే కదా?

తరువాతి రోజు పంచమి బయలుదేరాలి. కానీ, ఉదయాన నక్షత్రం మంచిది కాదు. అదీ కాకుండా వర్జ్యం కూడా వచ్చింది. మధ్యాహ్నం బయలు దేరుదామని భోజనం చేసి పచార్లు చేస్తూ ఉంటే, మాల బల్లి మీద పడింది. జ్యోతిష్యుణ్ణి పిలిపించి స్నానం చేసి, దీపం పెట్టుకుని శాంతీగింతీ చేసుకునేప్పటికి దీపాల వేళయింది. రాత్రి భోజనాలు చేసి బయలు దేరుదామంటే పెద్దలందరూ చుక్క ఎదురు వెళ్ళగూడదన్నారు. సరే – ఆ మరుసటి రోజు షష్ఠి. ఒక్క షష్ఠి మాత్రమే అయితే ఎలాగయినా బయలు దేరుదును. కానీ, ఆ రోజు పిడుగువలె మంగళవారం కూడా వచ్చింది. ఈ రెంటికీ తోడు ఆ రోజు ఒట్టి పాడు నక్షత్రం – ఇక సప్తమీ బుధవారం ప్రయాణానికి బహు అనుకూలమైంది. కానీ, ఆ రోజు మా చిన్న కుర్రవాడి పుట్టిన దినం. ఆ పండుగ ముగించుకుని భోజనాలు చేస్తే గాని బయలుదేరేదే లేదని ఇంట్లో ఆడవాళ్ళు పట్టుబట్టారు. అసలు ఉదయాన్నే బయలుదేరితే మధ్యాహ్నానికి దొంగల మర్రి దాటిపోయే వాళ్ళం. దొంగల మర్రి అంటే దారి దోపిడీ దొంగలు పొంచి ఉండే చోటు. కానీ, భోజనాలు కాగానే బయలుదేరుదామని బండి కట్టించి, తీరా ఎక్కబోయేసరికి వెధవ ముండ ఎదురుగా వచ్చింది. మళ్ళీ లోపలికి వెళ్ళి అర్ధ గంటసేపు ఆగినాము. అప్పుడు బయలు దేరినా దీపాలు పెట్టకముందే దొంగలమర్రి

దాటేసేవాళ్ళం. కానీ, వీధి గుమ్మంలోకి వచ్చేసరికి ఒంటి బ్రాహ్మణుడు ఎదురుగా వచ్చాడు. అందుకని లోపలికి వెళ్ళి కొంతసేపు ఆగినాము. ఇలా అయితే లాభం లేదని వీధిలో ఎవరూ నడవకుండా జాగ్రత్తపడి పొరుగింట్లో నుంచి ఒక ముత్తయిదువును ఎదురు రమ్మని చటుక్కున బండి ఎక్కి బయలుదేరినాము. ఎంత మంచి శకునం చూసి బయలుదేరినా, ఆ వెధవ ముండ ఎదురుగా


నేడు కందుకూరి 106వ వర్ధంతి

వచ్చిన వేళ ఎటువంటిదో కానీ ఫలితం మాకు వెంటనే కనిపించింది. రాత్రి పది గంటలకు మేము జడుస్తూనే దొంగలమర్రి దగ్గరకు చేరాము. దొంగలు వచ్చి నగలన్నీ ఎత్తుకుపోయారు. మేం మంచి శకునం చూసుకుని బయలుదేరడంవల్ల ప్రాణాలు కాపాడుకోగలి గాం. మొన్న ఓసారి జాతకం చూపించుకుంటే – నాకు ధన నష్టం ఉందని జ్యోతిష్యుడు చెప్పాడు. అంటే అంతా నిజమైనట్టే కదా? జ్యోతిష్యం తప్పలేదు

జ్యోతిష్యాన్ని నమ్మేవారు తాము నమ్మిన జోస్యాలు నిజం కానప్పుడు వాటిని పట్టించుకోకుండా పక్కన పెడతారు. ఎప్పుడైనా ఒకటీ, అరా నిజమైతే వాటినే మళ్ళీ పట్టుకుని వేళ్ళాడుతారు. ఒక విధంగా జ్యోతిష్యం చెడిపోయిన గడియారంలాంటిది. ఆగిపోయిన గడియారం కూడా రోజుకు రెండుసార్లు సరైన సమయాన్ని చూపిస్తుంది. అలాగని, ఆగిపోయిన గడియారాన్ని నమ్మడం ఎంత మూర్ఖత్వమో, జ్యోతిష్యాన్ని నమ్మడం కూడా అంతే మూర్ఖత్వం! వాస్తవానికి మనం ఏదైనా విషయం ఊహించి చెపితే, అందులో కొంతవరకు నిజమయ్యే అవకాశాలు ఉంటే ఉంటాయి. ఉండకపోతే ఉండవు. ఇకపోతే, దేవుడి విషయం చూద్దాం! ఒక కారుకు బ్రేకులు ఫెయిలయ్యి లోయలో పడిందని అనుకుందాం. ఆ ప్రమాదంలో బతికిన వాళ్ళు 'ఆ దేవుడి దయవల్ల బతికామని' చెప్పుకుంటారు కదా ? మరి చనిపోయిన వారిని ఎవరు చంపినట్టు? ఆ దేవుడే చంపాడని చెప్పాలి.. కదా? కానీ, చెప్పరు. ఒక వేళ ప్రమాదానికి గురైన ఆ కారులోని వారంతా చనిపోతే మీడియాలో వార్త ఇలా ఉంటుంది. ''కారు బ్రేకులు' ఫెయిల్: ఐదుగురు ప్రయాణికుల మృతి'' అనే కదా ఉంటుందీ? బ్రేకులు ఫెయిల్ కావడం హైలైట్ అవుతుందే తప్ప, ఆ వార్తలో దేవుడి ప్రసక్తి ఉండదు.

ప్రయాణికులు బతికితే 'దేవుడి దయ'వల్ల బతికారనడం, మరణిస్తే తప్పు బ్రేకులు ఫెయిల్ కావడంపై పెట్టడం ఏమైనా బాగుందా? తప్పు దేవుడి మీద పెట్టి ఆయనే చంపేశాడని అనుకునే ధైర్యం ఉండదు. ప్రజలు ఇలాంటి ధోరణికి అలవాటు పడిపోవడం వల్ల కదా దేవుడు, జ్యోతిష్యం, వాస్తు, ఆత్మ, పునర్జన్మ వంటి అంధ విశ్వాసాలు సమాజంలో సజావుగా బతుకుతున్నాయి. ఇలాంటి విశ్వాసాల వల్లనే సమాజం రోగగ్రస్తమవుతూ ఉంది? మన చుట్టూ జరుగుతున్న విషయాల్ని నిశితంగా పరిశీలిస్తూ, హేతుబద్ధంగా విశ్లేషించుకుంటే నిజానిజాలు బయటపడతాయి! దైవాన్నీ, జ్యోతిష్యాన్ని ప్రభోదించే వారు తమ సౌకర్యానుసారంగా ఆలోచనల్ని విధి విధానాలని మార్చుకుంటూ ఉంటారని – వీరేశలింగం పంతులు ఏనాడో

**ఆ దేవుడే చంపాడని చెప్పాలి.. కదా? కానీ, చెప్పరు. ఒక వేళ ప్రమాదానికి గురైన ఆ కారులోని వారంతా చనిపోతే మీడియాలో వార్త ఇలా ఉంటుంది. ''కారు బ్రేకులు' ఫెయిల్: ఐదుగురు ప్రయాణికుల మృతి'' అనే కదా ఉంటుందీ? బ్రేకులు ఫెయిల్ కావడం హైలైట్ అవుతుందే తప్ప, ఆ వార్తలో దేవుడి ప్రసక్తి ఉండదు. ప్రయాణికులు బతికితే 'దేవుడి దయ'వల్ల బతికారనడం, – మరణిస్తే తప్పు బ్రేకులు ఫెయిల్ కావడంపై పెట్టడం ఏమైనా బాగుందా?– తప్పు దేవుడి మీద పెట్టి ఆయనే చంపేశాడని అనుకునే ధైర్యం ఉండదు. ప్రజలు ఇలాంటి ధోరణికి అలవాటు పడిపోవడం వల్ల కదా దేవుడు, జ్యోతిష్యం, వాస్తు, ఆత్మ, పునర్జన్మ వంటి అంధ విశ్వాసాలు సమాజంలో సజావుగా బతుకుతున్నాయి. ఇలాంటి విశ్వాసాల వల్లనే సమాజం రోగగ్రస్తమ–వుతూ ఉంది? మన చుట్టూ జరుగుతున్న విషయాల్ని నిశితంగా పరిశీలిస్తూ, హేతుబద్ధంగా విశ్లేషించుకుంటే నిజానిజాలు బయట పడతాయి!**

చెప్పారు. మరి మనవాళ్ళు ఏమైనా చెవికి ఎక్కించుకున్నారా? లేదే – గుడ్డెద్దు చేలో పడ్డట్టు గుడ్డిగా అంధవిశ్వాసాల్లో పడిపోతున్నారు.


ఒక పెరియార్, ఒక కందుకూరి, ఒక తాపీ ధర్మారావు, ఒక గోరా వివేచన అనే దుడ్డుకర్రతో జనాన్ని అదిలిస్తూనే వచ్చారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ మనం కూడా ఆ పనిని కొనసాగిస్తూనే ఉండాలి! జన చైతన్యానికి దోహదం చేస్తూనే ఉండాలి!!

మత ద్వేషం, ఆవు పేడ, ఆవు మూత్రం వంటి వాటితో ఈ దేశ ప్రజల్ని విడగొట్టి, విభజించి దేశాన్ని హిందూరాష్ట్రగా మార్చాలన్న ఉద్దేశంతోనే విద్యారంగాన్ని కూడా కాషాయంలో ముంచుతున్నారు. దేశాన్ని మొత్తానికి మొత్తంగా మూఢ నమ్మకాల్లోకి దించుతున్నారు. ''దేశం కాషాయీకరణ చెందితే తప్పేంటీ?'' అని ఈ దేశ మాజీ ద్వితీయ పౌరుడు, తెలుగువాడు ఎంకయ్య నాయుడు ఒకనాడు ప్రశ్నించారు. మనం 21వ శతాబ్దంలో ఉన్నామా? లేదా సాధారణ శకానికి ముందున్న కాలంలో ఉన్నామా? అని అనుమాన పడాల్సివస్తోంది. ఇప్పుడు బాధ్యత ప్రతిపక్షాల మీద మాత్రమేకాదు, ప్రశ్నించగల సామర్థ్యం, స్థైర్యం గల సామాన్య పౌరుల మీద కూడా ఉంది. సామాన్య పౌరులు కూడా ప్రతిపక్షంలో ఉన్నట్లే – మనం హేతువాదుల, వైజ్ఞానికుల, మానవవాదుల రచనలు చదువుతూ స్ఫూర్తినిపొందుతూ, మునుముందుకు దూసుకుపోవాల్సి ఉంది!

సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

# వృత్యంతర శిక్షణ ఉపాధ్యాయులకు ఉపయోగమేనా?

దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని కొఠారి కమిషన్ వ్యాఖ్యానించింది. ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి. తరగతి గదిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకొని ఎప్పటికప్పుడు నవీకరణ చెందవలసిన ఆవశ్యకత ఉన్నది. బోధనలో సరికొత్త మెలకువలను, బోధనకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంతో పాటు నూతన వ్యూహాలకు పదును పెట్టడానికి గాను తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ(ఎస్సీఈఆర్టీ) నిత్యం ఉపాధ్యాయ లోకాన్ని సన్నద్ధం చేస్తున్నది. అందులో భాగంగానే పాఠశాలలు ప్రారంభం కావడానికి ముందే వేసవికాలంలో వృత్యంతర శిక్షణకు శ్రీకారం చుట్టింది. దీనికిగాను రాష్ట్ర, జిల్లా స్థాయిలలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణను అందిస్తున్నారు. పిల్లల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలు లేవని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలను తీసుకువస్తూనే వాటిని మరింతగా మెరుగుపరిచే క్రమంలో ఉపాధ్యాయునికి ఎదురయ్యే సవాళ్లకు ఈ వృత్యంతర శిక్షణ పరిష్కార మార్గాల ను ఏ మేరకు చూపెడుతుందో పరిశీలిద్దాం!




పిల్లల్లో అభ్యసన స్థాయి భేదాలు ఉండడం, ఆ అంతరాలను పూడ్చడానికి సరైన వ్యూహాలు కొరవడడం, దానికి తగ్గ సమయం కూడా లేకపోవడం వంటి లోపాలను గుర్తించిన పరిశోధన మండలి వాటిని సవరించడం కోసం ఈ వృత్యంతర శిక్షణకు పూనుకుంది. అభ్యసన సామర్థ్యాలను స్థాయిలవారీగా పెంపొందించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం. ఈ శిక్షణలో భాగంగా రూపొందించిన కరదీపిక ఉపాధ్యాయునికి మార్గదర్శిగా నిలుస్తుందని, తార్కిక ఆలోచనకు పదునుపెడుతున్నదని, పిల్లల అభ్యసనం లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి కొన్ని వ్యూహాలను అందించిందని, పాఠ్య పుస్తకాలకు అనుబంధంగా రూపొందించిన వర్క్ షీట్లలో ఉన్న కృత్యాలను ప్రాక్టీస్ చేయడంలో ఉపాధ్యాయునికి అనుసంధాన సాధనంగా ఉపయోగపడుతుందని, అంతేకాక ఉపాధ్యాయుడు క్షేత్ర స్థాయిలో అవసరానికి అనుగుణంగా నూతన వ్యూహాలను రచించడానికి సైతం దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పాఠ్యాంశాలలో అంతర్లీనంగా చోటుచేసుకున్న వివిధ సామర్థ్యాలను కరదీపిక ద్వారా తెలుసుకోవచ్చు. అట్లే మూసపద్ధతి బోధనకు స్వస్తిపలికి కనీస సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయుడు నిశిత పరిశీలన చేయడానికి దోహదపడుతుంది. బోధనలో చోటుచేసుకున్న విభిన్న భావనలలో ఏ భావన విద్యార్థికి అత్యంత ఉపయోగకరమో దానివైపు ఉపాధ్యాయుడు మొగ్గుచూపేలా చేస్తుంది. ఉదాహరణకు తెలుగు భాషా అభ్యసనంలో భాగంగా వివిధ ఉపగమ క్రమాలను ఏర్పర్చుకొని సరైన సమగ్ర ఉపగమనాన్ని నిర్మించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

ప్రాథమిక స్థాయి పిల్లలకు గట్టి పునాది వేయాలనే ఆశయంతో నూతన జాతీయ విద్యా విధానం2020 ద్వారా 'నిపుణ్ భారత్' కార్యక్రమం చేపట్ట డం జరిగింది. ఇందులో భాగంగా 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ' పేరుతో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో కనీస సామర్థ్యాల పెంపుతో పాటు అభ్యసన ఫలితాలు రాబట్టడానికి ప్రణాళికలు రూపొందించబడ్డాయి. పలు రాష్ట్రాలు వీటిని అనుసరిస్తూనే ఆయా రాష్ట్రాలకు అనుగుణంగా ప్రత్యేకంగా అదనంగా మరికొన్నింటిని జోడించుకుంటున్నాయి. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో గణితం, భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించడంతో పాటు ఇప్పుడు పరిసరాల విజ్ఞానాన్ని కూడా మూల్యాంకనం చేయనున్నారు. అంతే కాకుండా ఫౌండేషన్ లిటరసీ అండ న్యూమరసీకి కృత్రిమ మేధ ను జోడించి గణితంలో, భాషా పరిజ్ఞానంలో పిల్లల్లో మరింత ఆసక్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో సాంకేతిక సాధనాలు రూపకల్పన చేయబడ్డాయి. ఐటీ హబ్ గా ఆవిర్భావం చెందుతున్న తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో ఉందని, దక్షిణ భారతదేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా నిలిచిందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్) అనుసరించి దేశంలో తెలంగాణ రాష్ట్రం విద్యా ప్రగతి నివేదికలో అట్టడుగు స్థాయిలో ఉన్నప్పటికీ కరోనా తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాల నివేదికల్ని పరిశీలిస్తే గతంతో పోలిస్తే విద్యా ప్రగతి 6 శాతం వృద్ధి చెందినదని నివేదిక పేర్కొనడం విశ్లేషకు ల్ని సైతం ఆశ్చర్యపరిచింది. దీనికి ప్రధాన కారణం ఉపాధ్యాయులకు నిరంతరం అందిస్తున్న శిక్షణయే అని తేటతెల్లమైంది. కానీ కేవలం శిక్షణ ద్వారా మాత్రమే విద్యా ప్రగతిలో అనుకున్న స్థాయిని అందుకోలేమని, దానికి ప్రభుత్వం కూడా నిర్మాణాత్మక చేయూత అందించవలసి ఉన్నదని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

మరోపక్క బహుళ తరగతి బోధన, బహుళ స్థాయి బోధన ఒక సవాలుగా నిలుస్తున్నది. దీన్ని అధిగమించడానికి విద్యార్థులు తక్కువ నమోదు ఉన్న పాఠశాలలను సమీప పాఠశాలలో విలీనం చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు అనే కోణాన్ని ఆవిష్కరించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని విద్యాభిమానులు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014–15 బడ్జెట్ లో 10.89 శాతం నిధు లు విద్యకు కేటాయించారు. ఆ తరువాత ప్రతి సంవత్సరం ఆ కేటాయింపు తగ్గించుకుంటూ గత బడ్జెట్ నాటికి 7.6 శాతానికి కుదించబడింది. బడ్జెట్లో విద్యకు కేటాయింపు పెంచడం ద్వారా ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచవచ్చు. తద్వారా సమాజాన్ని భాగస్వామ్యం చేయవచ్చు. ప్రభుత్వ విద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలంటే బడ్జెట్ లో కనీసం 15శాతం నుంచి 20 శాతం వరకు కేటాయించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భాస్కర్ యలకంటి
విద్యా సామాజిక విశ్లేషకులు
8919464488

# శ్రామికుల ప్రయోజనాలు హరిస్తున్న ప్రభుత్వాలు

లేఖ

ఇటీవలికాలంలో కార్మికవర్గం తాము కష్టపడి సంపాదించిన అనేక ప్రయోజనాలను కోల్పోతున్నారు.. ప్రభుత్వ ఉద్యోగులు తమ హామీగా ఇచ్చిన పెన్షన్‌లో మార్పులు జరుగుతున్నాయి.. బిఎస్ ఎన్ఎల్ ఉద్యోగులు ఇప్పటికీ 2007 పే స్కేళ్ల ప్రకా రం, ఎచ్ ఎంటి ఉద్యోగులు 1997పే స్కేళ్ల ప్రకారం జీతం పొందుతున్నారు. పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఏడు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు/పెన్షనర్లకు రూ.983.02 కోట్లు బకాయి ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. కార్మికులు డిమాండ్ చేసే, కనీస నెలవారీ వేతనం రూ.26,000, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం కింద రోజుకు రూ.600 వేతనం అందించడం, ఇపిఎస్ కింద కనీస పెన్షన్‌ను నెలకు రూ.9000కి పెంచడం అమలు కావడం లేదు. కార్మిక వ్యయాన్ని తగ్గించడానికి కార్మికుల సంఖ్యను తగ్గించడం, తద్వారా వారికోసం ఖర్చు చేయాల్సిన మొత్తం తగ్గుతుంది. నేడు ప్రభుత్వరంగ సంస్థల్లో రెగ్యులర్ నియామకాలులేవు. ఫలితంగా, ప్రతి రంగంలోనూ శ్రామికులు తగ్గుతున్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ప్రచురించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం, నిరుద్యోగ భారతీయులలో 83% మంది యువతే. ప్రైవేట్ రంగానికే పరిమితం చేయబడిన క్యాజువల్, కాంట్రాక్ట్, రోజువారీ వేతనం, తాత్కాలిక, అవుట్ సోర్స్ ఉద్యోగులుగా నియమించడం ప్రభుత్వరంగానికి కూడా విస్తరించింది. ఫిక్సెడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ చట్టబద్ధం చేయబడింది. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద లక్షలాది మంది స్కీమ్ వర్కర్లుగా ఉన్నారు. వారిని కార్మికులుగా గుర్తించకపోవడం వలన, కనీస వేతనాలతో ఎటువంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో, బ్యాంక్‌లలో అప్రంటిస్ క్రింద నెల రూ.9,000 నుండి రూ. 15,000 పొందుతున్నారు. ఈ విధంగా శ్రామిక వర్గం ఎన్నో ప్రయోజనాలు కోల్పోతున్నది, ఎవరు బాధ్యత వహిస్తారు?

ఆళవందార్ వేణు మాధవ్
8686051752,

# ఆడంబరమేగానీ ఫలితాలివ్వని మోదీ విదేశీ యాత్రలు

2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రపంచ వేదికపై ప్రముఖంగా నిలపడానికి అనేక విదేశీ యాత్రలు చేశారు. 2025 నాటికి, ఆయన 73 దేశాలకు పర్యటనలు చేశారు. ఒక్క అమెరికానే 10సార్లకు పైగా సందర్శించారు. మొత్తంగా 151 సార్లు అనేక దేశాలు తిరిగి వచ్చారు. జపాన్, ఫ్రాన్స్, యూఏఈ వంటి దేశాలతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్ వంటి పొరుగు దేశాలను సైతం సందర్శించారు. ఈ యాత్రలు భారతదేశ ఆర్థిక, రక్షణ సంబంధాలను బలోపేతం చేయడంలో, అంతంత మాత్రంగానే లాభం చేకూర్చిందని విదేశాంగ నిపుణులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతి ప్రముఖ పట్టణాలలో వ్యాపార వేత్తలతో, రాజకీయ ప్రముఖులతో మీటింగులకు, హోర్డింగులు, విందులు దేశ ,విదేశాల్లో అనవసర ఆర్భాటపు ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా ఖర్చు పెట్టారు.సాధించిన ఫలితాలు తక్కువ, విశేష ప్రచారం కోసం ప్రజాధనం విచ్చలవిడిగా ఖర్చు పెట్టారు.

మనం ఆశించిన స్థాయిలో విదేశీ పరిశ్రమలు గానీ, పెట్టుబడులుగానీ రాలేదు .ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కలేదు.మొత్తంగా పెట్టిన ఖర్చులకు ,వనకూడిన ప్రయోజనాలకు బేరీజు వేసుకుంటే సమకూరిన లాభం పరిమితం. ఆర్భాటపు హంగామా గోదీ మీడియా హైపులు అపరిమితం.గతంలో ఎన్నడూ లేనంత దుబారా ఖర్చులు పెరిగాయి. ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పింది. ప్రపంచం అంతా తిరిగి దొరికిన చోటల్లా అప్పులు చేసారు. వ్యక్తి గత ప్రచారానికి శ్రీకారం చుట్టారు.తెచ్చిన రుణాలకు వడ్డీతో సహా వాయిదాల ప్రకారం చెల్లించటానికి తిరిగి అప్పులు చేసే పరిస్థితి ఏర్పడింది.భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 2014 వరకు గత 65 ఏళ్ళలో అందరు ప్రధాన మంత్రులు చేసిన అప్పుల కంటే మిన్నగా కేవలం 10ఏళ్ళలో 100 లక్షల కోట్లు అప్పు చేశారు.

అయితే, ఈ యాత్రల కోసం ఎంత ఖర్చు చేసినా , ఎన్ని దేశాలు తిరిగినా ప్రజలు ప్రశ్నించ లేదు.ఆశించిన ఫలితాలు రాకున్నా మీడియా ప్రచారం, సోషల్ మీడియా ప్రాపగాండా లో 'విశ్వ గురువు' అంటూ అనవసరపు, బూటకపూ ఇమేజీని క్రియేట్ చేశారు. ప్రజలు ఆయనపై ఆరాధనా భావంతో ఉన్నారు. ఆయన రూపొందించిన పథకాలు ఏవీ ఆచరణలో ఆశించిన ఫలితాలు రాకున్నా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడకున్నా.. మరింతగా దిగజారింది.రూపాయి విలువ అమెరికా డాలర్ తో పోలిస్తే దారుణంగా పడిపోయింది. పెట్రోల్,డీజిల్, ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. అయినా ప్రజలు మౌనంగా ఉండేలా ఆయన చుట్టూ ఉన్న యంత్రాంగం, పార్టీ కార్యకర్తలు , మోదీ మీడియా రక్షణ కవచంలా, అభేద్య దుర్గాన్ని నిర్మించారు. హిందూ మతోద్ధారకుడిగా గోదీ మీడియా ప్రాపగాండా పనిచేసింది. మోదీ ఇమేజ్‌ను నిర్మించడంలో మీడియా, సామాజిక మాధ్యమాల పాత్ర గురించి విమర్శనాత్మకంగా పరిశోధించాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాసం మోదీ విదేశాంగ విధానంలోని లోపాలను, దాని ప్రభావాన్ని సూక్ష్మంగా, సంక్షిప్తంగా విశ్లేషిస్తుంది.

మోదీ విదేశీ పర్యటనల వల్ల కొన్ని మంచి ఫలితాలు పరిమితంగా వచ్చాయి.ముఖ్యంగా 2015లో ఫ్రాన్స్‌తో రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం, జపాన్‌తో ఆసియాఆఫ్రికా గ్రోత్ కారిడార్ వంటివి ఈ యాత్రల ఫలితాలు. అయితే, ఈ యాత్రల ఖర్చు వివాదాస్పదంగా మారింది. X పోస్టుల ప్రకారం, 129 యాత్రలకు రూ. 2,0002,500 కోట్లు ఖర్చయ్యాయని అంచనా, అయితే అధికారిక లెక్కల ప్రకారం 202224 మధ్య 38 యాత్రలకు రూ. 258 కోట్లు ఖర్చయ్యాయి.

2025 ఏప్రిల్ 22న పహల్‌గామ్ ఉగ్రదాడితో మొదలైన భారత్‌పాకిస్తాన్ సంఘర్షణ (పరిమిత యుద్ధం) మోదీ దౌత్య శక్తిని పరీక్షించింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ సందర్భంలో ఇజ్రాయెల్ మాత్రమే భారత్‌కు స్పష్టమైన మద్దతు ఇచ్చింది. అమెరికా శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించి తానే ఇరు దేశాలను బెదిరించి రాజీ కుదిరించినట్లుగా, పదేపదే మోదీ చెప్పుకున్నారు. ఈ ప్రకటన నిజమేనని పాకిస్తాన్ చెప్పుకుంది. ట్రంప్ జోక్యం పై భారత్ ప్రధాన మంత్రి మోదీ నేటి వరకు అధికారికంగా ఖండించలేదు. తరువాత విదేశాంగ మంత్రి మెల్లగా దౌత్య భాష లో సన్నాయి నొక్కులు నొక్కాడు. పైగా ఈ యుద్ధ విషయంలో రష్యా, ఐరోపా దేశాలు తటస్థంగా ఉన్నాయి. జర్మనీ సానుభూతి తెలిపినప్పటికీ ఉపశమనాన్ని ప్రోత్సహించింది. ఈ సంక్షోభంలో మన దేశానికి అంతర్జాతీయ మద్దతు పరిమితం. పాకిస్తాన్ కు చైనా,టర్కీ బాహాటంగా మద్దతు పలికాయి. అమెరికా ఐఎంఎఫ్ ద్వారా తక్షణ ఆర్థిక సహాయం ఒక బిలియన్ డాలర్లు అడ్వాన్స్ గా ఒక ఉగ్రవాద పాకిస్తాన్ దేశానికి ఇప్పించింది. మోదీ విశ్వ ప్రయత్నం చేసినా ఐఎంఎఫ్ రుణాన్ని ఆపలేక పోవటం మోదీ దౌత్య పరంగా వైఫల్యం చెందడంగా భావించాలి. మొత్తంగా మోదీ దౌత్యం విజయాలపై అనేక ప్రశ్నలు లేవనెత్తింది. 2025 భారత్‌పాకిస్తాన్ యుద్ధం సమయంలో మనకు అంతర్జాతీయ మద్దతు లభించలేదనే చెప్పాలి.

మోదీ విదేశాంగ విధానంలో అనేక లోపాలు బాహాటంగా కనిపిస్తాయి. మొదట, వ్యక్తిగత దౌత్యంపై అతిగా ఆధారపడటం. 2015లో పాకిస్తాన్‌తో చర్చలు ఫలితం ఇవ్వలేదు, చైనాతో గల్వాన్ సంఘటన తర్వాత సంబంధాలు క్షీణించాయి. రెండవది, ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు బలహీనపడటం. పాకిస్తాన్‌ను ఒంటరి చేయడంపై దృష్టి సారించడంతో నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాలు చైనాతో సన్నిహిత మయ్యాయి. సార్క్ (SAARC)ని పటిష్ఠం చేయడంలో విఫలమవడం మరో లోపం. మూడవది, అంతర్జాతీయ సంబంధాలలో అస్థిరత. అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాలు కాస్త బలపడినప్పటికీ, రష్యాతో సంబంధాలు బలహీనపడ్డాయి. నాల్గవది, పాకిస్తాన్ తో పాక్షిక సంక్షోభ యుద్ధ సమయంలో అంతర్జాతీయ మద్దతు సేకరించడంలో విఫలం కావడం గమనార్హం.

గోదీ మీడియా మరియు వాట్సాప్ యూనివర్సిటీ అనే పదాలు మోదీ ఇమేజ్‌ను అతిశయోక్తులతో మానవాతీత శక్తిగా ఆకాశానికి ఎత్తుతూ ఫాల్స్ ఇమేజ్ ను చిత్రీకరించాయి. ఈ మాధ్యమాలు ఎంతగా ప్రచారం చేశాయీ అంటే. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ ఆపగలడనీ, అమెరికా, కెనడాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించ గలడని ... బీజేపీ,గోదీ మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. ఈ ప్రచారం తర్వాత మెల్లగా అధికారికంగా ఖండించబడింది. ఈ అతిశయోక్తులు దేశీయంగా మోదీకి మద్దతును పెంచినప్పటికీ, అంతర్జాతీయంగా భారత్‌కు విశ్వసనీయతను తగ్గిస్తాయి. 2023లో 'ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వే' ప్రకారం, మోదీ విదేశాంగ విధానంపై 37 శాతం మంది మాత్రమే మోదీ పై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి సందర్భంలో ప్రచారం, ముఖ్యంగా 2014కు ముందు భారత్ చాలా బలహీనంగా ఉందనే తప్పుడు ప్రచారం చేసింది.

చివరిగా, భారత్ నిజమైన ప్రపంచ శక్తిగా ఎదగాలంటే, మోదీ విదేశాంగ విధానం ఆడంబరం నుంచి ఫలితాల వైపు మళ్ళాలి. దేశీయ అవసరాలతో పాటు అంతర్జాతీయ లక్ష్యాలను సమతుల్యం చేయడం ద్వారా మోదీ భారత్‌కు, తనకూ మరింత గౌరవం తెచ్చుకోవచ్చు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## మావోయిస్టు తలపై రూ.5 లక్షల రివార్డ్
# జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో హతం

**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లోని లతేర్ జిల్లాలో సోమవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో నిషేధిత సిపిఐ మావోయిస్టు హతం అయ్యాడు. అతని తలపై 5 లక్షల నజరానా ఉన్నది. భద్రతా దళాలతో జరిగిన ఫైరింగ్‌లో అతను ప్రాణాలు కోల్పోయినట్లు సీనియర్ పోలీసు అధికారులు చెప్పారు. ఎరుపు దళానికి చెందిన మరో మావోయిస్టును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మౌతాద్ండ పోలీసు స్టేషన్ ఫరిధిలో ఉన్న దౌనా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ మావోయిస్టును మనిశ్ యాదవ్‌గా గుర్తించారు. అతన్ని పట్టిస్తే 5 లక్షలు ఇవ్వనున్నారు. తాజా ఆపరేషన్‌లో మావోయిస్టు కుందన్ ఖేర్వార్ అరెస్టు అయినట్లు డిఐజి వైఎస్ రమేశ్ తెలిపారు. రెండు రోజుల క్రితమే ఇద్దరు మావోయిస్టులు హతం అయ్యారు. వారిలో జెజెఎంపి అధినేత పప్పూ లొహ్రా ఉన్నాడు. అతని తలపై 19 లక్షల నజరానా ఉన్నది.

# అమెరికా జోక్యం లేదు

## పాక్ విజ్ఞప్తి మేరకే ఆపరేషన్ సిందూర్' ఆపేశాం

డిజిఎంఒ తప్ప ప్రభుత్వస్థాయిలో
వాళ్ళతో మేం మాట్లాడలేదు
పార్లమెంటరీ కమిటీకి జైశంకర్ వివరణ

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ చేసిన విజ్ఞప్తి మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను ఆపేశామని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ పార్లమెంటరీ కమిటీకి వివరణ ఇచ్చారు. పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ఉన్న ఉగ్రవాద కేంద్రాలపై దాడులు చేసిన తర్వాత మాత్రమే వాళ్ళ డిజిఎంఒ ద్వారా పాకిస్థాన్ ప్రభుత్వానికి ఈ దాడుల గురించి తెలిసిందని పార్లమెంటరీ కమిటీకి జైశంకర్ స్పష్టం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

పాకిస్థాన్ చేసిన విజ్ఞప్తి మేరకు, రెండు దేశాల డిజిఎంఓలు ద్వైపాక్షికంగా చర్చించి సైనిక చర్యను ఆపేయాలనే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కాల్పుల విరమణ గురించి, అమెరికా జోక్యం గురించి, పాకిస్థాన్‌తో తాను ఎప్పుడూ మాట్లాడలేదని విదేశీ వ్యవహారాలపై ఏర్పాటుచేసిన పార్లమెంటు సంప్రదింపుల కమిటీ సభ్యులకు జైశంకర్ సోమవారంనాడు న్యూఢిల్లీలో స్పష్టం చేశారు. పాకిస్థాన్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ స్వయంగా భారత డిజిఎంఒకు ఫోన్‌చేసి విజ్ఞప్తి చేసిన తర్వాత మాత్రమే 'ఆపరేషన్ సిందూర్' కాల్పుల విరమణ జరిగిందని అందువల్ల ఈ విషయంలో రెండు దేశాలమధ్యా అమెరికా జోక్యం, మధ్యవర్తిత్వ ప్రమేయం ఏమీ లేదని క్లారిటీ ఇచ్చారు.

పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీరు భూభాగంలో ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తున్న విషయాన్ని ముందుగానే ఆ దేశానికి భారత్ తెలియజేసిందంటూ విదేశాంగమంత్రి జైశంకర్‌ను లక్ష్యంగా చేసుకుని లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్‌నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్న తరుణంలో ఈ వివరణ కేంద్రమంత్రి నుండి వెలువడింది. రెండు దేశాలకు చెందిన డిజిఎంఓలు మాత్రమే మాట్లాడుకున్నారుతప్ప ప్రభుత్వస్థాయిలో ఆపరేషన్ సిందూర్ గురించి తానుగానీ, ఇతర నాయకులుగానీ ప్రత్యక్షంగా మాట్లాడుకోలేదని మంత్రి జైశంకర్ సంప్రదింపుల కమిటీకి పదే పదే వివరణ ఇచ్చారు. భారత ప్రభుత్వం తరపున ఏ ప్రతినిధీ కూడా పాకిస్థాన్ ప్రతినిధులతో ఈ విషయాల గురించి మాట్లాడలేదని, డిజిఎంఓల మధ్య మాత్రమే ఈ సంభాషణలు ద్వైపాక్షికంగా జరిగాయని చెప్పారు. పాకిస్థాన్‌తో మాట్లాడాలని అమెరికా తమకు విజ్ఞప్తి చేసిందని, ఉగ్రవాదం–సంభాషణలు రెండూ చేయి చేయి కలిసి ముందుకు వెళ్ళే ప్రశ్నే ఉండదని భారత్ చెప్పిందని సంప్రదింపుల కమిటీ సభ్యులకు జైశంకర్ తెలియజేశారు. కమిటీలో ఉన్న ఎంపీలు 'ఆపరేషన్ సిందూర్' గురించి, అమెరికా జోక్యం గురించి అనేక ప్రశ్నలు జైశంకర్‌పై సంధించారని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ''మీరు కాల్పులు జరిపితే భారతదేశం కూడా తిరిగి కాల్పులు జరుపుతుంది'' అని భారత డిజిఎంఒ పాకిస్థాన్‌కు ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా తెలియజేశారని సభ్యులకు జైశంకర్ చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ జరిపిన దాడులు పాకిస్థాన్ దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాయని ఎంపిలకు ఆయన చెప్పారు. పాకిస్థాన్ చేస్తున్న ఈ వ్యవహారాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఎంపీలు అందరూ సహకారం అందించాలని కోరినందువల్లనే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు బహుళపక్ష బృందాలను ప్రచారం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం పంపించిందని




జైశంకర్ కమిటీ సభ్యులకు చెప్పారు. కాగా ఈ సంప్రదింపుల కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి ప్రసంగించిన మంత్రి జైశంకర్ ఆ చిత్రాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ''ఆపరేషన్ సిందూర్''పై చర్చించాం, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నాగానీ, ఎట్టిపరిస్థితుల్లో సహించేదిలేదు, దీనికి సంబంధించిన ఒక బలమైన సందేశాన్ని సమైక్యంగా భారతదేశం పంపించవలసిన ఆవశ్యకత ఉంది'' అని మంత్రి ఎక్స్ పోస్టింగ్‌లో తెలిపారు. అదేవిధంగా విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా సంప్రదింపుల కమిటీ సమావేశంలో పాల్గొని ఎంపీల ప్రశ్నలకు స్పందించారు. పాకిస్థాన్‌ను, భారతదేశాన్ని అమెరికా ఎందుకని ఒకేగాటనకట్టి మాట్లాడుతోందని సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలు జైశంకర్‌ను ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ నిధుల కేటాయింపు విషయంలో సమావేశానికి భారత్ ఎందుకు దూరంగా ఉందని కూడా కాంగ్రెస్ ఎంపీలు జైశంకర్‌ను ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు, చైనాకు మధ్య స్నేహసంబంధాలు బాగా పెరగడంపట్ల కూడా కాంగ్రెస్‌పార్టీ ఎంపీలు ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు.


# మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

గవర్నర్ భల్లా క్షమాపణ చెప్పాలని డిమాండ్
ప్రదర్శనకారులపై బాష్పవాయు గోళాలు



**ఇంఫాల్ :** మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. గవర్నర్ అజయ్ కుమార్ భల్లా మణిపూర్‌కు తిరిగి రావడానికి ముందు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో జర్నలిస్టులతో ఉన్న ప్రభుత్వ బస్సుపై రాష్ట్రం పేరును తొలగించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు, మహిళలు ర్యాలీ చేపట్టకుండా భద్రతా దళాలు సోమవారం అడ్డుకున్నాయి. వారిని చెదరగొట్టడానికి బాష్ప వాయుగోళాలను ప్రయోగించాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది నిరసనకారులు గాయపడ్డారు. తిద్దిమ్ రోడ్ లోని క్వాకీథెల్ ప్రాంతంలో నిరసనకారులు గుమిగూడి రాజ్ భవన్ వైపు మూడు కిలోమీటర్ల దూరం ప్రదర్శన చేయాలని భావించారు. కానీ వారిని అక్కడి నుంచి ముందుకు సాగకుండా నిలువరించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అయితే విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఇంఫాల్ విమానాశ్రయం నుంచి కైసంపత్ వరకు ఆరు కిలోమీటర్ల మేర రాజ్ భవన్ కు 200 మీటర్ల దూరంలో మానవహారం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. 'మణిపూర్ గుర్తింపుపై చర్చనీయాంశం లేదు', 'మణిపూర్ ప్రజలకు గవర్నర్ క్షమాపణ చెప్పాలి' అనే సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శనకారులు పట్టుకున్నారు. ఇంఫాల్ విమానాశ్రయం నుంచి రాజ్ భవన్ వరకు టిడ్డిమ్ రోడ్డు వెంబడి అస్సాం రైఫిల్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో సహా పెద్ద సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు. గవర్నర్ భల్లా సోమవారం ఢిల్లీ నుంచి ఇంఫాల్‌కు చేరుకుంటారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని మోయిరాంగ్‌ఖోమ్, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కొనుంగ్ మామాంగ్‌తో సహా అనేక ప్రదేశాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. విష్ణుపూర్ జిల్లాలోని నింగ్‌థౌఖోంగ్, మోయిరాంగ్ ప్రాంతాలలో మానవహారం నిర్వహించారు. మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ ప్రారంభించిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు ఈ నిరసనలు కొనసాగింపు. మే 20న ఉఖ్రుల్ జిల్లాలోని శిరుయ్ లిల్లీ ఉత్సవానికి వెళుతున్న జర్నలిస్టులతో కూడిన ప్రభుత్వ బస్సు నుంచి రాష్ట్రం పేరును తొలగించడాన్ని నిరసిస్తూ మైతేయి గ్రూపు గత వారం మణిపూర్ అంతటా 48 గంటల సమ్మెను నిర్వహించింది. ఈ సంఘటన గ్వాల్తాబి ప్రాంతంలో జరిగింది. గవర్నర్ క్షమాపణ చెప్పాలని, ముగ్గురు ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం దాని కన్వీనర్ ఖురైజామ్ అథౌబా నేతత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బందం ఢిల్లీకి బయలుదేరి మంగళవారం హోం మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశమవుతుంది. ఈ సందర్భంగా అథౌబా విలేకరులతో మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్ కారణంగా కేంద్రం నుంచి మా లక్ష్యాలను సాధించడంలో ఆలస్యం చేశాము. దేశంలోని పశ్చిమ భాగంలో ఆపరేషన్ విజయవంతంగా ముగిసిన తరువాత, దేశం తూర్పు భాగంలో నార్కోటెర్రరిస్టులను ఎదుర్కోవడంలో కేంద్రం చర్యలను కోరుతున్నాము' అని అన్నారు. 'ఒక క్లిష్టమైన సమయంలో గ్వాల్తాబి సంఘటన జరిగింది. రాష్ట్ర చారిత్రక, సాంస్కతిక వారసత్వాన్ని అవమానించారు. గ్వాల్తాబి సంఘటన, మణిపూర్ సంక్షోభానికి సంబంధించిన ఇతర అజెండాకు సంబంధించిన అంశాలను మేము లేవనెత్తుతాము' అని అన్నారు.

# జడ్జి నోట్ల కట్టల వ్యవహారం నివేదిక బహిర్గతం చేయలేం: సుప్రీం



**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ 'నోట్ల కట్టల' వ్యవహారంలో సోమవారం కీలక మలుపు చోటు చేసుకుంది. కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో ఆయన అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా... మంటలార్పిన ఫైర్, పోలీస్ పోలీస్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం, ఆ వ్యవహారం బయటకు పొక్కడం సంచలనంగా మారింది. దీనిపై కోర్టు నియమించిన కమిటీ విచారణ జరిపి నివేదిక అందజేసింది. అయితే... అందులో విషయాను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు అందింది. అయితే సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఈ దరఖాస్తును తిరస్కరిస్తూ... ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఈ) కింద సమాచారం అందించలేమని స్పష్టం చేశారు. 2019 నాటి సంచలన తీర్పును న్యాయస్థానం ప్రస్తావించింది. సుభాష్ చంద్ర అగర్వాల్ కేసులో రాజ్యాంగ పరిధిలో గోప్యత హక్కు, సమాచార హక్కు ఈ రెండింటి సమతుల్యత అవసరమని కోర్టు వ్యాఖ్యానించింది. మార్చి 14వ తేదీన జడ్జి ఊళ్లో లేని సమయంలో బంగ్లాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని కాలిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో ఆయన్ని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే అలహాబాద్ బార్ అసోషియేషన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో... బదిలీ చేసినప్పటికీ విధులేవీ ఆయనకు అప్పగించలేదు. మార్చి 22వ తేదీన జడ్జి వర్మ నోట్ల కట్టల వ్యవహారంపై అంతర్గత విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 3వ తేదీన తుది నివేదిక రూపొందించగా... ఆ మరుసటి రోజు ఆనాడు సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నాకు నివేదిక అందజేసింది. దానిని సీజేఐ ఓ లేఖ ద్వారా రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి తెలిపారు.

# ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న పోలింగ్



**న్యూఢిల్లీ :** రెండు రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న ఎనిమిది రాజ్యసభ స్థానాలకు వచ్చే నెల 19న పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగియగానే అదేరోజు ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అసోంలో రెండు, తమిళనాడులో ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. అసోంలో రాజ్యసభ సభ్యులు రంజన్ దాస్, బీరేంద్ర ప్రసాద్ బైస్యల పదవీకాలం జూన్ 14న ముగియనుంది. అదేవిధంగా తమిళనాడులో ఆరుగురు సభ్యులు అన్బుమణి రామదాస్, ఎం షణ్ముగం, ఎన్ చంద్రశేగరన్, ఎం మహ్మద్ అబ్దుల్లా, పి విల్సన్, వైకో జూలై 24న పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన జూన్ 2న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. నామినేషన్‌ల దాఖలుకు జూన్ 9 వరకు గడువు ఇవ్వనున్నారు. జూన్ 10 నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. అభ్యర్థిత్వాన్ని వదులుకోవడానికి తుది గడువు జూన్ 12. జూన్ 19న పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 23తో ఈ రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

# మరో నీట్ స్టూడెంట్ ఆత్మహత్య..

ఒక్క నెలలో రెండో కేసు, కారణం అదేనా..

**న్యూఢిల్లీ :** దేశంలో రాజస్థాన్ కోటా నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చేందుకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ఉంది. ఇక్కడ కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయని అనేక మంది భావిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. గతంలో ఇదే విషయంలో సుప్రీంకోర్టు సైతం అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది. ఈ సంవత్సరం కోటాలో జరిగిన 14 ఆత్మహత్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ విషయాన్ని తేలికగా తీసుకోకూడదని, తీవ్రంగా పరిగణించాలని కూడా చెప్పింది. ఈ విషయంలో కోటా ఎస్పికి కూడా కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మరో 18 ఏళ్ల విదార్థిని సూసైడ్ చేసుకుంది. జమ్ముకశ్మీర్ నివాసి అయిన విద్యార్థిని జీషాన్ నీట్ కోసం ప్రిపేర్ అయ్యేందుకు నెల రోజుల క్రితం కోటాకు వచ్చారని మహావీర్ నగర్ పోలీస్ స్టేషన్ అధికారి రమేష్ కవియ తెలిపారు. ఆ విద్యార్థిని మహావీర్ నగర్ ప్రతాప్ కూడలి వెనుక అద్దె ఇంట్లో ఉండేది. ఈ క్రమంలోనే అద్దె ఇంట్లోని ఒక గదిలో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పోలీసులు ఆ విద్యార్థిని గురించి, ఆమె పరిచయస్తులు, స్నేహితుల గురించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ విద్యార్థిని చివరగా జమ్ముకశ్మీర్‌లో బుర్హాన్ అనే వ్యక్తితో మాట్లాడుతున్నట్లు చెప్పారు. మాట్లాడుతూనే ఆ విద్యార్థిని తన గదికి వెళ్లిందన్నారు.

ఆ క్రమంలో బుర్హాన్ తన ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి, కోటాలో తనకు తెలిసిన ఒక అమ్మాయికి సమాచారం ఇచ్చి, జీషాన్ దగ్గరకు వెళ్ళమని అడిగినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ పరిచయస్థురాలైన అమ్మాయి ఆమె ఇంటికి చేరుకునేసరికి, గది గేటు లోపలి నుంచి మూసి ఉంది. ఆ తరువాత, సమీప ప్రాంతాల వారికి విషయం తెలిపి గది డోర్ కట్టర్‌తో కత్తిరించగా, విద్యార్థిని లోపల ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆ సమయంలో ఆత్మహత్య చేసుకున్న గదిలో ఉరిని నిరోధించే ఫ్యాన్స్ లేవని పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో పోలీసులకు ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఈ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరణాల కట్టడి కోసం..**

అయితే కోటాలో ఫ్యాన్ సూసైడ్ మరణాలను నిరోధించేందుకు ఆ ప్రాంతాల్లోని హాస్టళ్లు సహా విద్యార్థులకు అద్దెకు ఇచ్చే గదుల్లో స్ప్రింగ్‌తో వేలాడే ఫ్యాన్లను అమర్చాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. వాటిని ఉపయోగించడం వల్ల ఫ్యాన్ సూసైడ్ మారణాలను అరికట్టవచ్చని తెలిపింది. కానీ ఈ విధానాన్ని అక్కడి వారు పాటించకపోవడం కూడా వారి మరణాలకు మరింత అవకాశాలు పెరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతోపాటు గతంలో నీట్ కోచింగ్ సమయంలో తక్కువ మార్కులు వచ్చిన వారిపై కూడా ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న కేసులు వెలుగులోకి వచ్చాయి.

## గంగూలీ సోదరుడి కుటుంబానికి
# తృటిలో తప్పిన ప్రమాదం

**పూరీ:** మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ సోదరుడు స్నేహాశీష్ కుటుంబానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఒడిశాలోని పూరీ తీరంలో వారు ప్రయాణిస్తున్న స్పీడ్‌బోటు అకస్మాత్తుగా తిరగబడింది. అప్రమత్తమైన లైఫ్ గార్డ్స్ వెంటనే రంగంలోకి దిగి వారిని రక్షించారు. స్నేహాశీష్, అతడి భార్య అర్పిత పూరీ బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బోటులో సరిపడా ప్రయాణికులు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అర్పిత నిర్వాహకులపై మండిపడ్డారు. 'సముద్రంలో అప్పటికే అలల తీవ్రత ఎక్కువగా ఉంది. సాధారణంగా ఒక్కో స్పీడ్‌బోటులో 10 మంది ప్రయాణికులు ఉండాలి. కానీ ఇక్కడ ఎక్కువ డబ్బులకు ఆశపడి కేవలం ముగ్గురు, నలుగురిని మాత్రమే ఎక్కించుకుంటున్నారు. బోటు తేలికగా ఉండటంతో భారీ అలకు తిరగబడింది' అని ఆమె తెలిపారు. లైఫ్ గార్డ్స్ లేకపోయి ఉంటే తాము ప్రాణాలతో ఉండేవాళ్లం కాదని అర్పిత ఆవేదన వ్యక్తం చేశారు. బోట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కాగా... సముద్రం నుంచి వీరిని రక్షిస్తున్న దశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## పాక్‌తో గూఢచర్యం..
# సిఆర్‌పిఎఫ్ జవాన్ అరెస్టు

**న్యూఢిల్లీ :** దేశానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తున్న సిఆర్‌పిఎఫ్ జవాను ఒకరిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) అరెస్టు చేసింది. నిందితుడిని మోతీ రామ్ జాట్‌గా గుర్తించింది. మోతీరామ్ జాట్ 2023 నుంచి జాతీయ భద్రతకు సంబంధించిన క్లాసిఫైడ్ సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తూ గూఢచర్యం చేస్తున్నట్టు ఎన్ఐఎ ఒక ప్రకటనలో తెలిపింది. పిఐఒల నుంచి వివిధ మార్గాల ద్వారా అతను నిధులు అందుకుంటున్నట్టు కూడా గుర్తించామని పేర్కొం ది. మోతీరామ్ జాట్‌ను ఢిల్లీలో అరెస్టు చేసి ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. దేశ రక్షణలో బలగాల పాత్ర కీలకమైనదని, దేశ భద్రతను పణంగా పెట్టి గూఢచర్యానికి పాల్పడటం తీవ్రం గా పరిగణించాల్సిన వ్యవహారమని కోర్టు ఈ సం దర్భంగా పేర్కొంది. జూన్ 6 వరకూ నిందితుడిని ఎన్ఐఎ కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశించింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత బలగాలు పాక్, పిఒకెలోని ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి దా డి చేయడం, అనంతరం పాక్ బలగాలు ప్రతిదాడులకు దిగడంతో భారత్ ఆ దాడులను తీవ్రంగా తిప్పికొట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశంలోని అనుమానాస్పద గూఢచారులపై చర్యలకు తీసుకోవాలని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే పాక్ కోసం గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను ఇటీవల అరెస్టు చేశారు. ఈనెలలోనే పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ నుంచి గూఢచర్యం ఆరోపణలపై 12 మందిని అరెస్టు చేశారు.

**యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ..!**






పాకిస్తాన్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతిని పోలీసులు హిసార్ కోర్టుకు తరలించారు. సివిల్ జడ్జి సునీల్ కుమార్ కోర్టులో జ్యోతి మల్హోత్రాను హాజరుపరుచగా.. న్యాయమూర్తి ఆమెకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఆమెను హిసార్ సెంట్రల్ జైలు నంబర్2లో ఉంచనున్నారు. విచారణ సమయంలో కోర్టు లోపల గేట్లు మూసివేశారు. భారీ పోలీసు బలగాలను మోహరించారు. జ్యోతిని గతంలో ఐదు రోజుల రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా గడువు ముగిసిన నేపథ్యంలో కోర్టులో హాజరుపరిచారు. ఇదిలా ఉండగా.. జ్యోతి మొబైల్ కాల్ వివరాలు తొలగించినట్లుగా పోలీసులకు నివేదిక అందింది. అయితే, ల్యాప్ టాప్ నుంచి తొలగించిన డేటా కోసం ఫోరెన్సిక్‌కు పంపగా.. నివేదిక ఇంకా అందలేదని అధికార వర్గాలు తెలిపాయి.

# ఉగ్రవాదుల కేంద్రం పాక్: ఆజాద్



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్‌పై విషం కక్కుతున్న పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు వివిధ పార్టీల ఎంపిల నాయకత్వంలోని బందాలు ప్రపంచదేశాలకు వెళ్లాయి. బిజెపి నేత బైజయంత్ పాండా నేతత్వంలోని బందం బహ్రెయిన్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా బంద సభ్యుల్లో ఒకరైన జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తంతో పోల్చితే పాకిస్థాన్‌లోనే అత్యధిక సంఖ్యలో ఉగ్రవాదులున్నారని విమర్శించారు. బహ్రెయిన్ వివిధ మతాల సమ్మేళనమని, ప్రజల్లో ఎటువంటి విభేదాలు లేవని అన్నారు. ఇది ఓ మినీ ఇండియాలా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అఖిలపక్ష బందంలో ఉన్న తామంతా వేర్వేరు పార్టీలకు చెందినవారిమైనా... ఐక్యంగా ప్రపంచ దేశాల ముందుకు వచ్చామన్నారు. పాక్ మతపరమైన భావజాలంతో ఏర్పడిన దేశమని, అయినా అక్కడి వారిలో ఐక్యత లోపించిందని విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ సహా ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు కొనసాగించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ కషి చేస్తున్నారని అన్నారు. పాక్ అధినేతలతో శాంతి చర్చలు జరపడానికి అనేకసార్లు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై అక్కడి నేతలకు వివరిస్తూ... ఆపరేషన్ సిందూర్‌లో భారత్ కేవలం ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసిందని, సాధరణ ప్రజలకు, సైనికులకు ఎటువంటి నష్టం కలిగించలేదన్నారు. అయినప్పటికీ పాక్... భారత సరిహద్దు ప్రాంత పౌరులపై దాడులకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# దారుణ హత్యాచారాలు


కర్ణాటకలో బాలిక, మధ్యప్రదేశ్‌లో మహిళపై ఘాతుకం



**బెంగళూరు/భోపాల్:** దేశంలో బాలికలు, మహిళలపై వరుస హత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా కర్నాటకలోని రామనగరలో మైనర్ బధిర మూగ బాలికపై, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఖాండ్వాలో 45 ఏళ్ల ఇద్దరు పిల్లల తల్లికి సంబంధించి రెండు వేర్వేరు దారుణ హత్యాచార ఘటనలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ముఖ్యంగా అణగారిన వర్గాల మహిళల భద్రతపై తీవ్ర నిరసనలు, ప్రశ్నలు తలెత్తాయి. మే 12న కర్నాటకలోని రామనగరలోని రైల్వే ట్రాక్‌ల సమీపంలో 14 ఏళ్ల ఖుషీ అనే గిరిజన బాలిక మృతదేహం లభించిందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. భద్రాపుర హక్కీ పిక్కీ కాలనీలో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అదృశ్యమైంది. ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రంతా వెతికారు. కానీ బాలిక జాడ తెలియలేదు. మరుసటి రోజు ఉదయం ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. దీంతో గ్రామంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఖుషీని కిడ్నాప్ చేసి, లైంగికంగా వేధించి, హత్య చేశారని గ్రామస్తులు ఆరోపించారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నలుగురు నుంచి ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. 'బాలిక తలపై గాయాల గుర్తులు ఉన్నాయి. ఇది చాలా అనుమానాస్పద హత్య కేసు। అని భద్రపుర గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అన్నారు. 'పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో మేము జోక్యం చేసుకోము. ప్రతీకారం, అక్రమ సంబంధం, అత్యాచారం లేదా మరేదైనా అయినా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనివ్వండి. న్యాయం జరిగేలా చూడటం మా విధి' అని ఆయన తెలిపారు. బాలిక కుటుంబానికి సామాజిక సంక్షేమ శాఖ నుంచి రూ.4,12,500, గ్రామ పంచాయతీ నుంచి రూ.50 వేల చెక్కులను పరిహారంగా అందజేశారు. కాగా, ప్రాథమిక దర్యాప్తులో మతదేహంపై ఎటువంటి గాయాలు కనిపించలేదని రామనగర ఎస్పీ శ్రీనివాస్ గౌడ తెలిపారు. ఆ బాలిక బెంగళూరు అర్బన్ జిల్లాలోని ఒక పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. వేసవి సెలవుల కోసం తన స్వగ్రామానికి తిరిగి వచ్చింది. గ్రామంలో జరిగిన ఒక పుట్టిన రోజు వేడుకలో ఆమె కనిపించలేదని ఫిర్యాదు అందింది. బాలిక మతదేహాన్ని కుటుంబానికి అప్పగించే ముందు రాజరాజేశ్వరి వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. రామనగర ఎస్పీ ఆర్.శ్రీనివాస్ గౌడ, డివైఎస్పీ శ్రీనివాస్, బిడాడి పిఐ శంకర్ నాయక్ నేతత్వంలో మూడు దర్యాప్తు బందాలను ఏర్పాటు చేశారు.

**ఖాండ్వాలో గిరిజన మహిళపై హత్యాచారం**

మధ్య ప్రదేశ్‌కు చెందిన ఖాండ్వా జిల్లా ఖల్వాలోని రోష్ని చౌకి ప్రాంతంలో మే 24న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పొరుగువారి ఇంట్లో ఒక గిరిజన మహిళ అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. ఆ మహిళ మరణించిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హరి పాల్వి, సునీల్ ధుర్వే అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.




ఇద్దరూ ఆ మహిళకు పరిచయస్తులు, ఒకే గ్రామ నివాసితులు. వారు ఆమెపై సామూహిక అత్యాచారం చేసినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 'ఖండ్వా జిల్లా ఆసుపత్రిలో ఫోరెన్సిక్ నిపుణుల నిఘాలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. నివేదికలో మరిన్ని వివరాలు వెల్లడవుతాయి' అని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. 'నిందితుడు మహిళను హింసించి ఆమె ప్రైవేట్ భాగాలను దెబ్బతీశాడు' అని డీఐజీ సిద్ధార్థ్ బహుగుణ అన్నారు. ఆ మహిళ శుక్రవారం రాత్రి ఒక వివాహంలో పాల్గొని... ఆ తర్వాత సమీపంలోని బంధువును దింపడానికి నిందితులలో ఒకరితో వెళ్లింది. తరువాత ఆమె హరి ఇంట్లో రక్తస్రావంతో తీవ్ర విషమ పరిస్థితిలో కనిపించింది. ఏఎస్పీ రఘువంశీ తెలిపిన వివరాల ప్రకారం... వారు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఆమెకు అధిక రక్తస్రావం అవుతున్నప్పటికీ ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. మధ్యాహ్నం 1:302 గంటల ప్రాంతంలో ఆమె మరణించింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మతదేహాన్ని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం ఆసుపత్రికి తరలించారు. అయితే మహిళ పేగు బయటకు రావడంతో తీవ్రంగా గాయపడిందని, శరీరంపై లాగడం, గీతలు కూడా కనిపించాయని మరొక వార్తా సంస్థ కథనం పేర్కొంది. అదనపు ఎస్పీ రాజేష్ రఘువంశీ మాట్లాడుతూ 'ప్రాథమిక పోస్ట్‌మార్టం నివేదికలో ప్రైవేట్ భాగాలపై తీవ్రమైన అంతర్గత గాయం ఉన్నట్లు నిర్ధారించబడింది. దీని ఆధారంగా, కూలీగా పనిచేసే అదే గ్రామానికి చెందిన హరి పాల్వి (40), సునీల్ కోర్కు (30) పై సామూహిక అత్యాచారం, హత్య కేసు నమోదు చేశాము' అని తెలిపారు. ఇదిలాఉండగా, చనిపోయే ముందు, ఆ మహిళ కొద్దిసేపు స్పృహ తిరిగి వచ్చి ఇద్దరు నిందితుల పేర్లను ప్రస్తావించినట్లు బాధిత మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. 'నాకు ఏదో భయంకరమైన సంఘటన జరిగింది. నేను బ్రతకలేను. సునీల్, హరి ఇలా చేశారు' అని పేర్కొందన్నారు.

## పెండింగ్ పింఛన్లు మంజూరు చేయాలి



ప్రజాపక్షం/బొమ్మలరామారం : పెండింగ్‌లో ఉన్న వృద్ధాప్య వికలాంగుల ఒంటరి మహిళల పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం అన్నారు. సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకి పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలో భాగంగా వృద్ధాప్య పెన్షన్ రూ.4000, వికలాంగుల పెన్షన్ రూ.6000 వెంటనే మంజూరు చేసి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు ఏనగళ్ల రాజప్ప, మండల కమిటీ సభ్యులు ధీరావత్ విట్టల్ నాయక్, కూర సత్యనారాయణ, లక్ష్మయ్య, మైసయ్య, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మధుసూదన్‌రెడ్డికి సిపిఐ నివాళులు



ప్రజాపక్షం/మునుగోడు: కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేదిరే మధుసూదన్ రెడ్డి మృతి చెందగా సోమవారం జరిగిన దశదిన కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై మధుసుధన్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళిలు అరిపించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచందం, బొల్గూరి నరసింహ,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, బి.లాలు,మండల కార్యదర్శి చాపల శ్రీను,ఉప్పు నూతల రమేష్, బెల్లం శివయ్య పాల్గొన్నారు.



## హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ డిమాండ్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: సివిల్ సప్లై హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా సమయంలో హమాలీ కార్మికులు తమ ప్రాణాలను ఫణంగాపెట్టి ప్రజా పంపిణీ వ్యవస్థను ఆపకుండా బియ్యం పంపిణీ చేశారని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల కోట బియ్యాన్ని ఒకే నెలలో ప్రజలకు ఇవ్వాలన్న అధికారుల అదేశాలు పాటిస్తూ ఎండకాలం కూడా పనిచేశారని అన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి నెలకు 26వేల రూపాయల వేతనం ఇవ్వాలని, ప్రమాదబీమా 10 లక్షల రూపాయలు చెల్లించాలని, 60 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికుడికి 5వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్లగొపు మల్లయ్య, బెల్లంకొండ రామ్మూర్తి, బాణావతి సైదులు, పండగ వెంకన్న, జక్కుల మల్లయ్య, పొనుగోతు గోపి, ఎర్ర బాలాజీ, చక్రాల వెంకన్న, లకావతు కృష్ణ, వీరేశం, శివ పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్ల పట్టాలు అందించాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని తాళ్లగడ్డలోగల పేదలందరికి ప్రభుత్వం ఇండ్ల పట్టాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం తాళ్లగడ్డలో మహాసభ ఎస్‌కె. షమీం అధ్యక్షతన జరగగా ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. నిరుపేదలు రోజువారి కూలి చేసుకోని జీవనం సాగిస్తున్న సందర్భంలో తక్కువ రేట్లకే తాళ్లగడ్డలో ఇండ్ల స్థలాలు వస్తున్నాయని ఆనాడు చాలా మంది పేదలు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకోని జీవనం సాగిస్తున్నారని కాని చెరువు శిఖం కింద అట్టి ఇండ్లు ఉన్నాయని తొలగించాలని అధికారులు ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని అనాప్ప. అదికారులు అక్కడ ఉంటున్న ప్రజల స్థితిగతులను పునరాలోచన చేసి కబ్జాలో ఉనన వారికి భేషరతుగా ఇండ్ల పట్టాలు అందించి ఆదుకోవాలని అన్నారు. అదేవిధంగా తాళ్లగడ్డలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. కొంత మంది వ్యక్తిగత స్వలాభాల కోసం అమాయక ప్రజలను బలి చేస్తున్నారని అన్నారు. సీపీఐ పార్టీ పేదల ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాల చేసిన చరిత్ర ఉందని అన్నారు. కార్యక్రమంలో భారతజాతీయ మహిళా సమైక్య నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబోతు పద్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజమ్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ముత్తు లింగం, సులోచన, వనిత, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యంతో చదివితే ఏదైనా సాధించవచ్చు

### శ్రీజను అభినందించిన జిల్లా ఎస్‌పి నర్సింహ



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని సూర్యాపేట జిల్లా ఎస్‌పి నర్సింహ్ అన్నారు. పదవ తరగతి అనంతరం నిర్వహించే రాష్ట్రస్థాయి పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన నూతన్‌కల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీజను సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో అభినందించారు. విద్యార్థులు పాఠశాల దశనుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదవాలన్నారు. 10వ తరగతి తర్వాత ఎంచుకునే లక్ష్యం విద్యార్థులను ఉన్నతమైన గమ్యం వైపు నడిపిస్తుందని, ఇష్టమైన రంగంలో రాణించడానికి మంచి భవిష్యత్‌కు పునాది వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, విద్యార్థిని తండ్రి మధుసూదన్ రావు, స్నేహితులు, పోలీసులు పాల్గొన్నారు.

**వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత వారసులదే**
**విస్మరించినట్లు ఫిర్యాదులు వస్తే చట్టపరంగా చర్యలు తప్పవు**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూర్యాపేట జిల్లా ఎస్‌పి నర్సింహ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు. ఫిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు అదేశించారు.

## సేంద్రీయ ఎరువుల వాడకంతో పెరగనున్న భూసారం

ప్రజాపక్షం /హాలియా: సేంద్రీయ ఎరువుల వాడకం మూలంగా భూసారాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సరిత అన్నారు. సోమవారం కొత్తపల్లి గ్రామంలో గల రైతు వేదిక లో మద్రాస్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ సంఘోష్టి పీఎం ప్రణామ్ పథకంలో భాగంగా సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాడడం వలన భూసారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే కృత్రిమ రసాయన ఎరువుల వాడకాన్ని దశలవారీగా తగ్గించుకోవాలని సూచించారు. మన పూర్వీకులు ఆచరించిన సాంప్రదాయ సేంద్రియ ఎరువులను వాడితే భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ నెల 31వరకు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్రాస్ ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సభ్యులు మిర్యాలగూడ రామారావు, ఏఈఓ నాగయ్య, రైతులు, బ్రహ్మానంద రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రఘుపతి రెడ్డి, కోటిరెడ్డి, చింతరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొడ టౌన్: భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర ముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.సోమవారం ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన లైసెన్స్ సర్వేయర్ల ధ్రువపత్రాల పరిశీలన ,సామగ్రి పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ నెల 26 నుండి సుమారు 50 పనిదినాలు లైసెన్స్ సర్వేయర్లకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వివిధ సందర్భాలలో నిర్వహించే సర్వే సమయంలో సర్వేయర్ల పాత్ర మరువలేనిదని అన్నారు. భూములకు సంబంధించి సర్వేయర్లు వివిధ రకాల సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే ,ఎఫ్ లైన్ సర్వే వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు సంబంధించిగ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అలాగే అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లది కీలక పాత్ర అని అన్నారు. అందువల్ల సర్వేయర్లు శిక్షణకు హాజరై జాగ్రత్తగా అన్ని అంశాలను క్షుణ్ణంగా విని అర్థం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 150 మంది లైసెన్స్ సర్వేయర్ల కు సర్వే సామాగ్రిని పంపిణీ చేశారు.కాగా జిల్లాలో లైసెన్స్ సర్వేయర్లకి మీ సేవ ద్వారా 819 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి విడతన సోమవారం 409 మంది ధ్రువపత్రాలు పరిశీలించడం జరిగింది. 2 వ విడత ఆగస్టులో మరో 410 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. లైసెన్స్ సర్వేయర్లకు మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఇంచార్జ్ ఏ డి సుజాత,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ హాజరయ్యారు.

### ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాపక్షం/యాదాద్రి : ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నా రు. సోమవారం భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొదటి రోజు శిక్షణ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమానికి 198 మంది సర్వేయర్లు పాల్గొంటున్నారని, వీరిని మొత్తం 10 బ్యాచ్‌లుగా చేసి రెండు బ్యాచిలుగా థియరీకి, 8 బ్యాచిలు క్షేత్ర స్థాయిగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిక్షణా కార్యక్రమం 50 రోజుల పని దినాలు జరుగుతాయన్నారు. అనంతరం సర్వేకు సంబంధించిన మెటీరియల్ ను శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి వేణుగోపాల్ రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.





## స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నారాయణ అమిత్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఐఏఎస్ అధికారి నారాయణ అమిత్ కు స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ గా బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించారు.కాగా సెలవు నుండి తిరిగి వచ్చిన రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సోమవారం రెవిన్యూ అదనపు కలెక్టర్ గా విధులలో చేరారు. ఇప్పటివరకు రెవెన్యూ అదనపు కలెక్టర్ గా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ లు ఇంచార్జి బాధ్యతల నుండి వైదొలగారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.


# యుద్ధ ప్రాతిపదికన పిల్లాయిపల్లి కాల్వపనులు

### పనుల పురోగతి పరిశీలనలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: యుద్ధ ప్రాతిపదికన పిల్లాయిపల్లి కాల్వ మరమ్మతుల పనులు పూర్తి చేసి జులై ఫస్ట్ నాటికి రైతుల వ్యవసాయానికి నీళ్లు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, విద్యుత్తు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన సోమవారం పిలాయిపల్లి కాలువను పెద్దగూడెం చానల్ నుండి జగత్పల్లి, నారాయణగిరి వరకు కాలి నడకల నడిచి స్వయంగా పరిశీలించారు. కాలువ పనులలో మరమ్మత్తు పనులలో కాలువ వెడల్పు లోతు కల్వర్టలు నిర్మాణం కాంక్రీట్ నిర్మాణాలను ఎక్కడెక్కడ చేపట్టాలో ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువల వెంట ఉన్న రైతులు పడుతున్న ఇబ్బందులను నష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ మోటార్లు ట్రాన్స్ఫార్మర్లను తొలగించి నాట్లు మొదలయ్యేసరికి మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే రేయింబవళ్లు అధిక జెసిబి లతో నెల రోజుల కష్టపడి పనిచేసే రైతులకు సాగు నీరు అందించి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలోని పిలాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాలువలకు రూ 500కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఘనత అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ డిఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ మనోహర్, విద్యుత్ అధికారి ఏడి పద్మ, ఏఈ శ్రీనివాస్, ఇతర శాఖల ఉన్నతాధికారులు డిసిసి వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కుండల తయారీ శిక్షణ కేంద్రానికి స్థలాన్ని కేటాయించాలని వినతి



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కుండల తయారీ శిక్షణా కేంద్రానికి స్థలాన్ని కేటాయించాలని కుమ్మరి సంఘం సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో కులవృత్తిపై ఆధారపడి సుమారు 150 పైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని కుండలా తయారీలో శిక్షణ ఇచ్చేందుకు మండల కేంద్రంలో ఉన్న కందకం భూమిని కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే కుమ్మరి వాము ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని ప్రస్తుతం ఉన్న యువతకు కుండల తయారీ శిక్షణ ఇచ్చేందుకు ఈ స్థలాన్ని కేటాయించాలని కోరారు. గతంలోనే ఈ స్థలాన్ని కుమ్మరి వాములు ఏర్పాటు చేసుకునేలా గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దయచేసి తమ కులవృత్తిని అభివృద్ధి చేసుకునేందుకు పెద్ద మనసుతో ఈ స్థలానికి కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో కుమ్మరి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు అంజయ్య, కుమ్మరి సంఘం అధ్యక్షులు చిలువేరు నరసింహ, సైదులు, మురళి అంజయ్య, సోమయ్య ఉన్నారు.

## 281 మంది అభ్యర్థులకు శిక్షణ

### గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: లైసెన్సు సర్వేయర్లతో భూవివాదాలు పరిష్కారమవడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైసెన్సు సర్వేయర్ల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి భూమి హక్కుల రికార్డు చట్టం, 2025 ను అమలులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. భూమి యజమానులైన రైతులకు మెరుగైన సేవలను అందించే ప్రణాళికల్లో భాగంగా లైసెన్సు పొందిన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. భూ భారతి చట్టం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితర వాటిలో తప్పనిసరిగా సర్వే చేసి మ్యాప్ జత చేయాల్సి ఉంటుందని, దీని కోసం లైసెన్సు సర్వేయర్లను ఎంపిక చేసి వారికి ప్రభుత్వం శిక్షణ అందిస్తుందని తెలిపారు. జిల్లాలోని లైసెన్సు, సర్వేయర్లకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు శాఖ ద్వారా మే 26 నుండి 50 రోజుల పాటు 281 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్సు ఏడీ రామ్ చందర్ ఉన్నారు.

## ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

### సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు నూనె వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/డిండి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు నూనె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని కామేపల్లి సిపిఐ గ్రామశాఖ సమావేశం తోటపల్లి నాగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు నూనె వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని తేమ శాతం, తరుగు, లారీలకు వెయిటింగ్ చార్జీలను రైతుల దగ్గర, ఐకేపి కొనుగోలు కేంద్రాల యాజమాన్యం బస్తాకు రెండు, మూడు కేజీల తరుగు తిస్తున్నారు. ఆ నిబంధన లేకుండా రైతులకు న్యాయం చేయాలని, దళారీలకు ప్రోత్సహిస్తున్న కొనుగోలు కేంద్రాలను భవిష్యత్తులో మనుగడ లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తూ, ఇండ్లు ఇవ్వాలని, రాజీవ్ యువ వికాసం రుణాలకు సివిల్ స్కోర్ ను ఎత్తివేసి, అర్హులైన వారందరికి రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు మంజూరు చేయాలని, నిర్మాణ రంగ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీ కనీస వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జూన్ 10వ తేదిన ఖానాపూర్‌లో జరగబోయే సిపిఐ డిండి మండల 15వ మహాసభను జయప్రదం చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి తోటపల్లి నాగయ్య, సహాయ కార్యదర్శి గ్యార రామస్వామి, లక్ష్మయ్య, సైదులు, రాధ, వెంకటయ్య, విష్ణు, ఆలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 79 దరఖాస్తులు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: తెలంగాణ అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు శాఖల వారిగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తుకు ఖచ్చితమైన సమాదానం తెలపాలని అదేశించారు. రాజీవ్ యువ వికాసం సూచనలు అనుసరించి జిల్లాస్థాయి కమిటి సమావేశాలను అధికారులు నిర్వహించాలని సూచించారు. మండలానికి కేటాయించిన ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రోజు వారిగా, వారం వారిగా, పక్షం రోజుల వారిగా నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ అదేశించారు. వర్షకాలం వస్తున్నందున స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా పంచాయతీ అధికారులు అలాగే గ్రామీణాభివృద్ధి అధికారులు సమన్వయం చేసుకుంటూ వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజవాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబంధించి 41 దరఖాస్తులు , జిల్లా సంక్షేమ అధికారికి ఐదు దరఖాస్తులు, మున్సిపల్ కమిషనర్లకు ఐదు దరఖాస్తులు, ఎంపీడీవో లకు నాలుగు, మిగిలిన 24 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయని మొత్తం 79 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో వివి అప్పారావు, డబ్ల్యూవో నర్సింహరావు, సిపివో కిషన్, డిఈవో అశోక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానంద రాణి, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, సుపారీటెండెంట్లు శ్రీనివాసరాజు, శ్రీలతరెడ్డి, వినోద్‌కుమార్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులను నిండాముంచిన కాంగ్రెస్

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట(అత్మకూర్(ఎస్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండాముంచిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. 60 రోజులవుతున్నా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయక పోవడం దారుణమన్నారు. సోమవారం సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్ ఎస్ మండలం ఏపూరు గ్రామం ఐకెపి కేంద్రంలో తడిసి మొలకెత్తిన ధాన్యంను మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దొంగలు పడ్డారని, ఎవరికి దొరికింది వారు దోచు కు తింటున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడంలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదలుకొని మంత్రులందరూ దోపిడిదారులేనని, ఎవరికి వారు పోటీపడి దోచుకుంటున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మొలకలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు చేతిలో రేవంత్‌రెడ్డి కీలుబొమ్మ : ఎపి సిఎం చంద్రబాబునాయుడు చేతిలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి కీలుబొమ్మ అని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఎపి ప్రభుత్వం నదుల్లోని నీటిని మళ్లించి దోపిడి చేస్తున్నా వీరు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి కేసుల భయంతో మోడి కాలు మొక్కే పనిలో ఉన్నారని అన్నారు. తెలంగాణ సంపద ఆంధ్రకు దోచిపెట్టే కుట్ర జరుగుతుందన్నారు. కృష్ణ జలాల దోపిడి అయిపోయిందని, తనకచర్ల తో గోదావరి జలాల దోపిడికి మరోకుట్ర జరుగుతుందని వాపోయారు.



## ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ వెంకటాపూర్(రామప్ప):** ఈతకు వెళ్లి ఓ వ్యక్తి మరణించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వి వరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన నాయిని శ్రీకాంత్(27) శివునికుంట సమీపంలో ఉన్న ర్యాంపులో ఈ తకు వెళ్లి మృతి చెందారు. స్థానిక ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామానికి చెందిన నాయిని శ్రీకాంత్ మద్యం సేవించి గ్రామంలో ఉన్న ఒక ర్యాంపులో ఈతకు వెళ్లగా ఈ క్రమంలో తోటి స్నేహితు



లతో ఈ తకు వెళ్లగా మద్యం సేవించిన అతను ర్యాంపులో దూకి ఈత కొడుతున్న క్ర మంలో మునిగి చనిపోయాడు. స్థానికులు చూసి పోలి సులకు సమాచారం ఇవ్వగా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం దొర క గా ములుగు ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించి దహన సంస్కా రాలు నిర్వహించారు. మృతుడికి భార్య, పిల్లలు, చెల్లి ఉన్నారు.

## మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌ను పరామర్శించిన కెటిఆర్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోమవారం పరామర్శించారు. సత్యవతిరాథోడ్ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాలని, త్వరగా కోలుకుని తిరిగి ప్రజా క్షేత్రంలో ప్రజలకు సేవలు అందించాలని కెటి ఆర్ కోరారు. ఆయన వెంట మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఉన్నారు.



## మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/నర్సంపేట:** మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని.. మొదటి ప్రాధాన్యతగా భావించి అనేక కార్యక్రమాలు చేపడు తున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. దుగ్గొండి మండ ల మహిళా సమాఖ్య సమావేశం మండల కేంద్రంలోని మహిళా భవనంలో నిర్వహించగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలకు రూ. 12 కోట్ల బ్యాంకు రుణాల చెక్కును మహిళా సంఘాల బా ధ్యులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ మొదటి ప్రాధాన్యతగా భావించి అనేక కార్యక్రమా లు చేపడుతు న్నట్లు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంతో పావలా వడ్డీతో రుణాలు అం దించడం ప్రారంభించి మహిళల ఆర్థికాభివృద్ధికి నాంది పలికిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. త్వరలో మహిళా సంఘాలచే పె ట్రోలు బంక్ ఏ ర్పాటుచేయనున్నట్లు తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధికిఉపయోగించుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు.

## రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేడ్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణ రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీలోని 11, 15 వార్డులు వేశాలపల్లి, కాకతీయ కాలనీలల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబే ద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేశారు. రెండు కాలనీల ల్లో నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చే యించారు.యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ వి లువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిప్పాల రా జేందర్, చల్లూరి మధు, అంబాల శ్రీనివాస్, తోట సంతోష్, ఆకుల మహేం దర్, మాజీ కౌన్సిలర్లు ముంజాల రవీందర్ గౌడ్, సిరుప అనిల్, దాట్ల శ్రీని వాస్, నాయకులు తోట రంజిత్, రజినీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

## పదేండ్ల సమస్యకు..
## పది నిషాల్లో పరిష్కారం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ పశ్చిమనియోజకవర్గం కాజీపేటలోని 47వ డివిజన్ కడిపికొండ ఫ్లయ్ఓవర్ బ్రిడ్జ్ సమీపంలోని ఎలక్ట్రికల్ లోకా షెడ్ వద్ద గల రైల్వే ట్రాక్ కిందినుండి ఉన్న కల్వర్టును శుభ్రపరిచె కార్యక్ర మాన్ని సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంబించా రు. కల్వర్టులో కూరుకుపోయిన చెత్త వల్ల వర్షాకాలంలొ నీరు నిలిచి బూడి దిగడ్డ, బాబుజినగర్, డిజిల్ కాలని, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలు ముని గిపోయి అయా ప్రాంతాల్లో నివసించె వారి ఇండ్లల్లోకి నీరుచేరి ప్రజలు ఇబ్బందులకు గురి అయ్యేవారు. కొద్దివానకే కాజీపేట రైల్వే స్టేషన్ మూని గిపొయేది దానిద్వారా నీరు బయటికివచ్చి రొడ్లన్ని జలమయమై చిరు వ్యా పారస్తులు, వాహనదారులు ఇబ్బందులపాలైయ్యేవారు.రానున్న వానకాలం దృష్ట్యా మల్లి ఇలాంటి సమస్య తలెత్తకూడదని పశ్చిమ నియోజకవర్గ ఎ మ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రైల్వే అధికారులతో కలిసి ఈఎల్ఎస్ వద్ద గల కల్వర్టుని పరిశీలించి తక్షణమే తగు చర్యలు చేపట్టాలని సంబదిత జీడ బ్ల్యూఎంసీ, ఎంహెచ్ వో,మునిసిపల్ ఇంజనీరింగ్ అదికారులకు అదేశాలు జారి చేశారు. రైల్వే, మునిసిపల్ ఇంజనీరింగ్ అదికారులు, జీడబ్ల్యూఎంసీ సిబ్బందితో పాటు స్థానిక కార్పోరేటర్లు,మాజి కార్పొరేటర్లు,బ్లాక్ కాంగ్రేస్ అద్యక్షులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథకాలు పోయి.. అందాల పోటీలా?

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో పథకాలు పోయి అందాల పోటీలు వచ్చాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం జనగామలోని క్యాంప్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సంరద్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు కోట్ల మేయింటనెన్స్ బిల్లులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యమైన పరిస్థితి తెలంగాణ లో ఉందన్నారు. సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసింది రాష్ట్రం లోనే అత్యధికంగా జనగామ నియోజకవర్గం అన్నారు. లబ్ధిదారులు సకా లంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు బ్యాంక్ ఖాతాలో జమ చేసుకోవాలన్నారు. వైద్యం విషయంలో ప్రభుత్వ హాస్పటల్ కాకుండా నీలిమ హాస్పిటల్ సేవలు వినియోగించుకుంటున్నారని, సంవత్సరానికి 50వేల మందికి వైద్యం అందించడం జరుగుతుందన్నారు. రోజుకి 300 నుండి 350 మంది నీలిమ హాస్పటల్‌లోకు వెళ్తున్నారని ప్రతి నెలకు 5వేల నుండి 6వేల మంది వైద్యం పొందుతున్నారన్నారు. రేషన్ కార్డు ఉంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఇబ్బంది పడు తున్న వారందరికి ఏడాదిన్నరగా ఆర్థికంగా చితికిపోకుండా నా ప్రయత్నం చేస్తున్నానన్నారు. 82 మందికి 20లక్షల 46వేల 500 రూపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యక ర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశం



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** ప్రజలకు అ త్యాధునిక వైద్య సేవలను అందించేందుకు నిర్మి స్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ని ర్మాణాభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కా ర్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలసి కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆస్పత్రి ప్రాంగణంలోని స మావేశపు హాలులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అ ధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీ క్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడు తూ ఉత్తర తెలంగాణ ప్రజల వైద్య అవసరాల కో సం నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను వేగవంతంగా పూర్తిచేసి అందుబా టులోకి తేవాలని అన్నారు. దేశంలోనే అత్యదిక నిధులతో మెరుగైన వైద్య సేవలు, ఆధునిక సదు పాయాలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి పనుల ను నిర్దేశిత గడువు నాటికి పూర్తి చేయాలన్నారు. ఉత్తర తెలంగాణకు తలమానికంగా జిల్లాల ప్రజ లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ని ర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయించా లనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉ న్నారని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. వరంగల్‌లో నిర్మి స్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐకానిక్ హా స్పిటల్ అని పేర్కొన్నారు. అనంతరం సూపర్ స్పె షాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అం డ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంతకు ముందుహైదరాబాద్ నుండి వరంగల్ ఎన్ఐటి అ తిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన రామకృష్ణారావుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్, హనుమకొండ, జిల్లా ల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పూల మొక్కలను అందించి స్వాగతం పలి కారు. ఈ సమీక్షలో వరంగల్, హన్మకొండ జి ల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, డైరె క్టర్ ఆఫ్ మెడిక ల్ హెల్త్ నరేంద్ర కుమార్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ ఈ నాగేంద్ర,ఎల్ అండ్ టి ఏరియా మేనేజర్ సెంకట్ రెడ్డి, కెఎంసి ప్రిన్సిపాల్ రాంకుమార్ రెడ్డి, ఎం జిఎం సూపరింటెండెంట్ కిషోర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట జిల్లా కేంద్రం అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మానుకోట జిల్లా కేంద్రం అభివృ ద్ధికి కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అ న్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రూ.1కోటి10లక్షల వ్యయంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అటకెక్కిన జంక్షన్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ జంక్షన్, వైఎస్ఆర్ జంక్షన కరవి రోడ్ జంక్షన్‌లను అభివృద్ధి చేసి మానుకోటను సుందరీకరిస్తానని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజ యసారథి, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయసారథిరెడ్డి బాణాసంచా కాల్చి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ ఇది సిపిఐ ఆధ్వర్యంలో సుదీర్ఘపోరాటం ఫలితంగా జరుగుతున్న అభివృద్ధి పను లని అన్నారు. ఎన్నికల ముందు చివరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ఇచ్చిన హామీని నెరవేర్చి నిధులు కేటాయించి నందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మూడు కోట్ల ప్రాంతంలోని ఇంటి యజమానులు, సిపిఐ బృదం ఎమ్మెల్యేక ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి స్వాగతం పలి కారు. ఎమ్మెల్యే సిపిఐ నాయకులు, స్థానికులతో కలిసి కురవి రోడ్డులో రో డ్డుపై టీ సేవించారు. 36,22వార్డుల్లో రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు కేటా యించాలని అజయ్‌సారథిరెడ్డి కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పద్మం ప్రవీణ్, నిమ్మల శ్రీను, కోడి శ్రీను, పోతురాజు, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి ,వీరవెల్లిరవి,ఎండి ఫాతిమా,శంతన్‌రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 40 ఫిర్యాదులు

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధా న్యతనిస్తూ ఫిర్యాదులను సత్వర మే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూ చించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యా దులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్య లను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్‌జి, జి సంపత్‌రావులకు వి న్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కా గా ఫిర్యా దులను పెండింగ్‌లో పెట్టకుండా ఎ ప్పటిక ప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యల ను స త్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారు లకు సూచించారు. వివిధ జిల్లా స్థాయి అధి కారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పర్య వేక్ష కులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల కెటా యిపులో వాస్తవంగా విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకే ఇంది రమ్మ ఇండ్లు కెటాయించాలని సిపిఐ పార్టి జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, సిపిఐ పార్టి మండల కార్యదర్శి కావటి యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపి డిఒ కార్యాలయాల ఎదుట సిపిఐ పార్టి మండల కార్యదర్శి యాద గిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పాల్గొని అర్హులైన పేదలకే ఇంది రమ్మ ఇండ్లు కెటాయించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించి ఎంపిడిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా సిపిఐ పార్టి జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, సిపిఐ పార్టి మండల కార్యదర్శి కావటి యాదగిరి మాట్లాడుతూ గత ప్ర భుత్వం అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కెటాయింపులో విఫలమైందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ వెంటనే స్పందించి అర్హు లైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కెటాయించాలని వారు



డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ పార్టి ఆధ్వర్యంలో ఇండ్లులే ని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంచడం జరుగుతుంద ని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్ర జలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ పార్టి మండల సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేశం, సిపిఐ నాయకులు దానియేలు, దావీదు, వెంకటయ్య, సుధాకర్, కవిత, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రానున్న వర్షాకాలం... అధికారులు అప్రమత్తం

హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రానున్న వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్ట రేట్‌లోని మినీ కాన్ఫరె న్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో వరద ముప్పు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చ ర్యలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ, ఆర్ అండ్‌బి, తదితర శాఖల అధికారులు రానున్న వర్షాకాలంలో ఆయా శాఖల తరపున తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడు తూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో ముంపు ప్రాంతాలను అధి కారులు ముందస్తుగా గుర్తించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో తీసు కోవలసిన చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. రోడ్లు తెగిపోయే ప్రాంతాలను ఆ శాఖ అధికారులు ముందస్తుగానే గుర్తించాలన్నారు. గ్రామీణ, అర్బ న్ ప్రాంతాలలో వర్షపు నీరు కారణంగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారే ప్రాంతాలను గు ర్తించాలన్నారు. చెరువులు, వాగుల స్థితిని ఎప్పటికప్పుడు శాఖ అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. వాగులు పారే ప్రాంతా లను అధికారులు గుర్తించాలని, వాటిని సంబంధిత మండలాల తహసీల్దా రులు పర్యవేక్షించాలన్నారు. చెరువుల కట్టలు బలోపేతంగా ఉండేటట్టు ఆ శాఖ అ ధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు.ఈ సందర్భం గా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రేటర్ వ రంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కంట్రోల్ రూ మ్ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డిసిపి సలీమా, ఇన్చార్జి కలెక్టర్ వై వి గణే ష్, మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, డిఎఒ రవీందర్ సింగ్, డిపిఓ లక్ష్మి రమా కాంత్, డిఎంహెచ్ఓ అప్పయ్య, ఆర్డిఓ కే నారాయణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ ప్రభుత్వ హాస్పిటల్‌కు త్వరలో సిటి స్కాన్

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ జిల్లా హాస్పటల్‌కు త్వరలో సిటి స్కానింగ్ కొత్త మిషన్ రానుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. సిటి స్కాన్ ఇన్ స్టాలేషన్ కోసం టిఎస్ఐఎండిసి అనుమతి ఇచ్చింద న్నారు. సోమవారం ఆయనొక ప్రటన చేస్తూ ఈఆర్‌బి ఐఎస్ కంపెనీకి సంబందించిన కొత్త సిటి స్కాన్ మంజూరు అయినప్పటికీ పాత స్కాన్ మిషన్ ఎలా పడితే అలా తొలగించి పక్కన పెట్టడం వలన హాస్పటల్‌లో ఉన్న వారికి రేడి యేషన్ ఇబ్బందులు ఎదురయ్యాయని, ఇన్ని రోజులు కొత్త మిషన్ ఇస్టాలేషన్ చేయలేదన్నారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ కబమిటీ హాస్పటల్‌ను సంద ర్శించి కొత్త మిషన్ ఏర్పాటుకు సంబందించిన అంశాలపై పరిశీలించి పాత మిషన్ జాగ్రత్తగా ఎలాంటి రేడియేషన్ ఇబ్బందులు తలెత్తకుండా తొలగించా లని టిఎస్ఎంఐడిసికి రిపోర్టు ఇచ్చిన తరువాత గత వారం మిషన్ గొలగించి కొత్త మిషన్ ఇన్‌స్టాల్ చేసేందుకు అనుమతి లభించిందన్నారు. ఈ ప్రక్రియ సోమవారం నుండి మొదలయైందని తెలిపారు. 15 రోజుల్లో పూర్తి చేసి ప్రజ లకు కొత్త సిటి స్కానింగ్ మిషన్ అందుబాటులోకి రానుందన్నారు.

## ముంపు నివారణకు పటిష్ఠ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి:** రానున్న వర్షాకాలంలో ముంపు నివార ణకు సంబంధిత శాఖల అధికారులు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. స్థానిక కలెక్ట రేట్లోని సమావేశపు హాలులో సోమవారం అన్ని శాఖల అధికారులతో రా నున్న వర్షాకాలంలో వరదల ముంపు నివారణకు తీసుకోవలసిన సంసిద్ధత చర్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణిలతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాల సమయంలో సంబం ధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరదలు వంటి ప్రకృతి వైప రీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధి కారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముంపునకు గు రయ్యే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంత ప్రజలను సుర క్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తిం చాలన్నారు. ఆ ప్రదేశాలలో ప్రజలను ఉంచేందుకు తాత్కాలిక షెడ్లు, త్రాగు నీరు, టాయిలెట్లు, వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాల కారణంగా కూలిపోయే శిథిలావస్థలో ఉన్న భవనాలు, బ్రిడ్జి లు, కల్వర్టులు, కాజ్ వే లను గుర్తించి, ముందుగానే మరమ్మత్తులు చేయించాలన్నారు. వర్ష కాల సమయంలో వాటి కారణంగా ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా ముందుగానే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నదులు, కాల్వలు, చెరువులు గట్లను పరిశీలించి బలహీనం చోట్ల పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వరదల సమయంలో గండ్లు పడిన ప్రదేశాలను పరి శీలించి, అవసరమైన చోట పటిష్టం చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమ యంలో కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని, రోడ్లు తెగిపోయే ప్రాంతాలను ఆ శాఖ అధికారులు ముందస్తుగానే గుర్తించాలన్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలో వర్షపు నీ రు కారణంగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారే ప్రాంతాలను గుర్తించాల



న్నారు. చెరువులు, వాగుల స్థితిని ఎప్పటికప్పుడు శాఖ అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. వాగులు పారే ప్రాంతాలను అధికారులు గుర్తించా లని, వాటిని సంబంధిత మండలాల తహసీల్దారులు పర్యవేక్షించాలన్నారు. వరదల సమయంలో విద్యుత్ స్థంబాల కారణంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు ముందస్తుగానే సంసిద్ధత చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి జెడ్పి సిఇఒ రామ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అను రాధ, డిఆర్డిఓ కౌసల్యాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాంబశివరావు, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు .

## పుష్కరాల్లో పులకించిన భక్తులు

- భక్తుల తాకిడికి కిటకిటలాడిన సరస్వతి ఘాట్
- త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన ప్రముఖులు
- చివరి రోజూ అదే జోరు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సరస్వతి పుష్కరాలకు 12వ రోజు భక్తులతో త్రివేణి సంగమం భక్తులతో కిటకిటలాడు తుంది. 12వ రోజు చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సరస్వతి నదిలో పు ణ్యస్నానాలు ఆచ రించి కాళేశ్వర ముక్తేశ్వరున్ని దర్శించుకుంటు న్నారు. ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ బాపు సోమవారం పుష్కర స్నానం ఆచరించిశ్రీకాళేశ్వరముక్తే శ్వరస్వా మినిదర్శనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సంపద, ఆరోగ్యం, వృద్ధి, పాడిపంటల శుభఫలితాల కో సం 12 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన హోమాలు పూర్ణాహుతితో ముగిశాయని రాష్ట్ర దేవా దాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ అన్నారు. సోమవారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆల



యంలో జరిగిన ఈ మహా పర్వదినంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, డైరెక్టర్ వెంకటరావు, ఈఓ మహేష్ పూర్ణాహుతి కార్యక్రమంలో పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ 12 హో మాలు ప్రజల ఆర్థిక, శారీరక శ్రేయస్సు,వ్యవసాయోత్పత్తి అభివృద్ధికి శుభపరిణామాలు కలగాలని ఆకాంక్షతో నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ తెలి పారు. వేదపండితులు శాస్త్రకంగా పూర్ణాహుతి సందర్భంగా శాంతి, ఐశ్వర్యం, సమృద్ధిని కోరుతూ విశేష పూజలు చేశారని తెలిపారు.ఈ కార్య క్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు చేశారు.

## గ్రామ సభను వ్యతిరేకించిన గ్రామస్థులు

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం జగ్గారంలో సీతారామ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణం కోసం చేపట్టనున్న 43.2 ఎకరాల భూసేకరణ కోసం ఏర్పాటు చేసిన పీసా గ్రామసభ ఎలాంటి తీర్మానం లేకుండానే అర్థాంతరంగా నిలిచిపోయింది. పంచాయితీ పరిధిలోని 5 గ్రామాలకు చెందిన గ్రామస్థులు గతంలో కోల్పోయిన భూములకు ఇప్పటివరకు ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందలేదు. మరో సారి ప్రభుత్వ అధికారుల మాటలు నమ్మి మోసపోయేందుకు సిద్దంగా లేమని గ్రామస్థులు




తేల్చిచెప్పారు.

## ఎంపి కార్యాలయంలో చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన చెక్కులను ఖమ్మం ఎంపి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. వివిధ అనారోగ్యాలతో చికిత్స పొంది ఆర్థికంగా ఆదుకునేందుకు ఖమ్మం ఎంపి రామసహయం రఘురాంరెడ్డి సిఫారసుతో లబ్దిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం గట్టయ్య సెంటర్‌లోని ఎంపి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలోని సారధినగర్‌కు చెందిన తంగెళ్లపల్లి కాంతమ్మకు రూ. 31వేలు, ముదిగొండ మండలం చిరుమర్రికి చెందిన గాలి నాగమ్మకు రూ. 11వేలు, ఎర్రుపాలెం మండలం ఇనగాలికి చెందిన వేమిరెడ్డి జయమ్మకు రూ. 20వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కొప్పుల చంద్రశేఖర్ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తుందన్నారు.



## మే 28న జాబ్‌మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 28న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న బుధవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ ఖమ్మం నందు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్ సెంటర్ మేనేజర్, ఈఆర్‌వో, ఎల్‌పివో సంబంధిత 20 ఖాళీల ఉద్యోగాలకు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ అర్హత గల పురుష అభ్యర్థులు, శ్రీరామ్ చిట్స్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ సంబంధిత 50 ఖాళీల ఉద్యోగాలకు 20 నుంచి 35 ఏళ్ల వయస్సు, డిగ్రీ అర్హత గల పురుష అభ్యర్థులు అర్హులని ఇట్టి ఉద్యోగాలు ఖమ్మంనందు ఉన్నాయని ఎంపికైన వారికి వేతనం రూ. 15వేల నుంచి రూ. 20వేల వరకు ఉంటుందన్నారు. మొత్తం 70 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

## నాలుగో రోజు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/ములకలపల్లి :** తాళ్లపాయ రాచన్నగూడెం గ్రామ పంచాయితీలలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్దిదారులకు ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు పట్టాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ములకలపల్లి మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, ఎంపీడీవో రేవతి, గ్రామ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచు కారం సుధీర్ కుమార్, కీసరి సమ్మయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఓదార్చిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం జయలక్ష్మి పురం గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన నగరకంటి నాగరాజు (38), బొల్లిపోగు కృష్ణ కుమార్ (13)ల మృతదేహాలను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిలో ఉంచగా విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ సోమవారం ప్రభుత్వం ఆసుపత్రికి చేరుకుని నాగరాజు, కృష్ణల మృతదేహాలను సందర్శించి, నివాళ్ళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఓదార్చారు.అనంతరం గ్రామ పెద్దలను ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పింగుల సామ్యేల్, ఐ.శ్రీను, జీవన్ తదితరులున్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** అందిస్తున్న లైసెన్స్ సర్వేయర్ల శిక్షణను అంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం యూనివర్సిటి ఆఫ్ మైనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన లైసెన్స్ సర్వేయర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూ సర్వే చేసేందుకు లైసెన్సు సర్వేయర్లుగా ఎంపికైన 426 మంది అభ్యర్థులకు ఈ రోజు నుండి శిక్షణ ఇస్తున్నామన్నారు. కొత్త భూ రికార్డుల చట్టాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులకు మొత్తం 50 రోజుల పనిదినాల్లో శిక్షణ ఇవ్వనున్నామని, రెండు బ్యాచ్‌లుగా విభజించి ఉదయం థియరీ, మధ్యాహ్నం నుండి ప్రాక్టికల్ తరగతులు ఉంటాయన్నారు. హాజరైన విద్యార్థతల అసలైన ధృవపత్రాలను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ చేఉల మీదుగా అభ్యర్థులకు సర్వే గొలుసులు, క్రాస్‌స్టాప్, క్యాలిక్యులేటర్, స్కేల్, పెన్సిల్, నోట్‌బుక్‌తో పాటు స్టడీమెటీరియల్ అందించారు. శిక్షణ పూర్తయిన అనంతరం శిక్షణ పొందిన వారికి సర్వేయర్లుగా లైసెన్సులు జారీ చేస్తామని చెప్పారు. ఈఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనింగ్ కాలేజీ ఏడి శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్ డి శ్రీనివాస్, మైనింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జూన్‌లో మూడు నెలల రేషన్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** రానున్న వానా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని జూన్ నెలలో ఆగస్టు నెల వరకు చౌకదుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వచ్చే నెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ ఇవ్వనున్నారు. తగిన ఏర్పాట్లు చేసుకోవాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 442 దుకాణాల్లో అన్నపూర్ణ కార్డులు 04,అత్యోందయ కార్డులు 18,880, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు 2,76,762 కార్డులు కలిపి మొత్తంగా 2,95,646 కార్డులు ఉండగా, ఈ కార్డుదారులందరికీ మూడు నెలల పాటు రేషన్ బియ్యాన్ని జూన్‌లో అందించనున్నారు.

# ఆన్‌లైన్ నేరస్తుల అరెస్ట్



ట్రేడింగ్ పేరుతో కోటి రూపాయలు స్వాహ్

నిందితులను పట్టుకున్న సైబర్ పోలీసులు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** అన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశచూపి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బురిడికోట్టించి కోటి రూపాయల పైచిలుకు నగదు స్వాహచేసిన సైబర్ నేరస్తులను ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు ఆరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ ఆర్ వి ఫణిందర్ సోమవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోనకల్లు మండలం రాయన్నపేటకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి విజయవాడకు చెందిన షేక్ సుభాని అనే వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని తమ వలన కొందరు లాభపడ్డారని నమ్మబలికాడు. వాట్సప్, ట్రేడింగ్‌కు సంబంధించిన లింకులు పంపుతామని వాటిలో పెట్టుబడులు పెట్టి లబ్ధిపొందవచ్చని చెప్పడంతో వారిమాటలు నమ్మిన బాధితుడు వారు పంపిన లింక్‌లను ఓపెన్‌చేసి తొలుత తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టి లాభాం పొందాడు. దీంతో ఎక్కువ మొత్తంలో ట్రేడింగ్ చేయటం మొదలు పెట్టాడు. అలా దశల వారిగా రూ.1.62 కోట్ల రూపాయలు పెట్టుబడిపెట్టాడు. రోజులు గడవటంతో ఒక్కసారిగా లింక్ పనిచేయకపోవడంతో మోస పోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు నగదు బదిలీ అయిన బ్యాంక్ ఖాతాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన షేక్ సుభాని దిగా గుర్తించి సిబ్బందితో అక్కడికి చేరుకుని సుభానిని అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. అతనితో పాటు అతనికి సహకరించిన అదే ప్రాంతానికి చెందిన దాసరి సునీల్‌కుమార్, సుదలగుంట్ల సాయికృష్ణలను అరెస్ట్ చేసి ఖమ్మం సైబర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. నిందితులను పట్టుకోవటంలో కిలకంగా వ్యవహరించిన సైబర్ క్రైం ఇన్స్‌పెకర్ యాసీన్ అలీ, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్ స్టేషన్ సిబ్బందిని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఈ సందర్భంగా అభినందించారు.

# మమ్ముల్ని ఆదుకోండి...

## ఓ తల్లి కన్నీటి ఆవేదన...

28ఏళ్లుగా దివ్యాంగ కుమారున్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తల్లి

ఉండటానికి గుడైనా కల్పించాలని వినతి

**ప్రజాపక్షం/ మధిర :** మమ్ముల్ని ఆదుకోండి అంటూ ఓ తల్లి కన్నీటి పర్యంతమవుతున్న విషాద సంఘటన ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పుట్టకతోనే కాళ్లు, చేతులు చచ్చుబడి వికలాండిగా పుట్టిన కొడుకును ఓ తల్లి దాదాపు 28ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఒక పక్క కొడుకుని చూసుకుంటూనే కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుంది. ఇటీవల కాలంలో ప్రభుత్వ పథకాలు కూడా అందకపోవడంతో జీవనం భారంగా మారింది. ఆ మహిళ వికలాంగుడైన కొడుకుతో ప్రభుత్వ సాయం కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి అధికారులకు విన్నవించినా తమ గోడును ఎవరూ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. మధిర పట్టణం ఎంప్లాయిస్ కాలనీకి చెందిన ముత్తారపు చిరంజీవి, శారద దంపతులకు దివ్యాంగ కుమారుడు శ్రీనివాస్(28), కుమార్తె శివాని ఉన్నారు. శారదా భర్త చిరంజీవి అద్దెకు ఆటోను తీసుకుని నడుపడుతున్నాడు. అయితే ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో ఆటోకి కిరాయిలు లేక కుటుంబ భారం మరింత కష్టంగా మారింది. తమ కుమార్తె పిజి చదువుతుందని, తనకు ఫీజు కట్టే స్థితిలో కూడా లేమని శారద విలపించింది. వికలాంగుడైన కొడుక్కు వచ్చే ఫెన్షన్ రూ.4వేలు డైపర్లకు కూడా సరిపోవటంలేదని వాపోయింది. అంతేగాక 30ఏళ్లుగా వారు ఉండటానికి కనీసం సొంత ఇల్లు కూడా లేదని, అద్దె ఇంట్లోనే ఉంటున్నామని, అద్దె కట్టడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. కుమారుడిని బాగు చేసుకోవడం కోసం హైద్రాబాద్, విజయవాడ అనేక హాస్పటల్స్ తిరిగినా ఫలితం దక్కలేదని తెలిపింది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే భట్టివిక్రమార్క స్పందించి ప్రభుత్వం తరుపున కనీసం మాకు ఉండటానికి గుడైనా కల్పించాలని, అలాగే వికలాండైన కుమారిడికి నెల ఖర్చులు ఇచ్చేవిధంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటుంది.

## బ్రిడ్జి నిర్మాణంలో బయటపడుతున్న నాణ్యతా లోపాలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువపై నిర్మించినటువంటి బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపాలు ఒకటొకటిగా బయటపడుతున్నాయి. గత కొంతకాలం క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివిధ శాఖల మంత్రులతో కలిసి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వపై ట్రైల్ రన్‌ను నిర్వహించారు. ఆ సమయంలో నిర్మించి ఉన్నటువంటి బ్రిడ్జి కింద భాగంలో చాలా వరకు వరద కోతకు గురి అయింది. ఇది ఇలా ఉండగా రానున్న రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ కాలువలో వరద నీరు ఎక్కువగా పోటేత్తే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో బ్రిడ్జి నిర్మాణంలో లోపాల వలన పిల్లర్ కింది భాగంలో ఉన్నటువంటి కాంక్రీట్ కొట్టుకుపోతే పిచ్చి ఉంటుందా కొట్టుకుపోతుందా అనేటువంటి అపోహలు గ్రామ ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నటువంటి లోపాలను సరి చేస్తే రాబోయే నష్టాన్ని అరికట్టడానికి వీలుంటుందని, ఏం కాదులే అని వదిలేస్తే ఇప్పటికే ఈ కాలవ నిర్మాణంలో శ్లోపులు కొట్టుకుపోయి పుడిపోయి లక్షల రూపాయల ప్రజాధనం నీటి పాలవుతుందని, దీనిపై అంచనా వేయడానికి కూడా ఇప్పటి వరకు అధికారులు స్పందించలేదు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో వరద నీటికి పోసిన శ్లోకులు బ్రిడ్జిలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు స్పందించి వీటిపై తగిన చర్యలు తీసుకొని జరిగే నష్టాన్ని నివారించే దిశగా పనులు చేపట్టాలని నాణ్యత లేకుండా నిర్మించి ప్రజాధనం దుర్వినియోగం చేసినటువంటి కాంట్రాక్టర్లపై కేసులు పెట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణికిలోవచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి ఆయాశాఖల అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం మాట్లాడుతూ అధికారుల మీద నమ్మకంతో పలు ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాకా వచ్చిన సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో దరఖాస్తులు సమర్పిస్తుంటారని, వారి నమ్మకాన్ని ఒమ్ముచేయరాదన్నారు. ప్రజలకు సేవలు అందించేందుకే ప్రభుత్వాధికారులు ఉన్నదనే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో విస్మరించరాదని అన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పకుండా రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. పరిష్కారానికి నోటుకోని వాటిపై సమగ్ర, సవివరణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని వారు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన బి. సీతమ్మ, షేక్ రజియాసుల్తానా, ఎన్. సావిత్రి తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు రెండవ లిస్టులోకి వెళ్లాయని పంచాయతీ కార్యదర్శి చెబుతున్నారని తమకు మొదటి దశలోనే ఇండ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. వేంసూరు మండలం కుంచపర్తి గ్రామానికి చెందిన కర్ణి దుర్గ తాను పూరి గుడిసెలో ఉంటున్నానని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. బోనకల్ మండలం తుతుకుంట్ల గ్రామానికి చెందిన పి. రాంబాబు గ్రామంలో ఉపాధి పనుల్లో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డారని విచారణ జరిపించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. తల్లాడ మండలం బాలపేట గ్రామానికి చెందిన జి. వీరయ్య తాను 2008 నుంచి గ్రామంలో ఉపాధి హామీ పథకం క్రింద సీనియర్ మేట్‌గా పని చేస్తున్నానని తనకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, సన్యాసయ్య, జిల్లా అధికారులు,అరుణ పాల్గొన్నారు.

# పట్టణంలో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే డా.మట్టా

నర్సింగ్ కళాశాల, అంబేద్కర్ భవన నిర్మాణ పనుల పరిశీలన

మాతా, శిశు ఆరోగ్యం కేంద్రం తనిఖీ

బాలింతలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ సోమవారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట నూతనంగా నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ, అంబేద్కర్ భవనం, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, పనుల్లో నాణ్యతను పరిశీలించారు. పనులు ఎంత వరకు జరిగాయి, ఎన్ని రోజులలో పూర్తవుతాయి తదితర విషయాలను సదరు కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నిర్మాణ పనుల్లో పలు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ఆయా భవనాలు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ కు సూచించారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లోని మాత శిశు వార్డ్ ను పరిశీలించి, ఆసుపత్రి లోని బాలింతలు,



పుట్టిన బిడ్డల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకోవటమే కాకుండా, ఒక డాక్టర్ గా రోగులను పరిక్షించి పలు ఆరోగ్య సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ డెంట్ ని కలుసుకుని ఆసుపత్రిలోని రోగుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రజలు ఆరోగ్య విషయంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తం గా ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహల ఆధ్వర్యంలో పేదల వైద్యం, ఆరోగ్యం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అందిపుచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, నాయకులు చల్లగుళ్ళ నర్సింహరావు, కమల్ పాషా, పింగుల సామ్యూల్, ఐ.శ్రీను, జీవన్ , ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైద్యురాలు వసుమతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## ఆపరేషన్ సిందూర్ విజయవంతం పట్ల వైరాలో తిరంగా ర్యాలీ



**ప్రజాపక్షం/వై రాః** వైరాలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల భారత సైన్యానికి మద్దతుగా వైరాలో శివాలయం వద్ద నుండి బస్టాండ్ వరకు జరిగిన తిరంగ ర్యాలీలో అన్ని వార్గల ప్రజలు పాల్గొన్నారు. జాతీయ జెండాను చేత పట్టుకొని భారతమాతకి జై అంటూ నిర్వహించిన తిరంగా ర్యాలీకి బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు హాజరయ్యారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. భారత సైన్యానికి మనందరం అండగా నివాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణ నందు జాతీయ గీతాన్ని ఆలపించి ర్యాలీ ముగించారు. ఈ తిరంగా ర్యాలీలో వైరా లయన్స్‌క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ వాసవి క్లబ్ సభ్యులు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అబాసుపాలవుతున్న కార్పోరేషన్ పాలన

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో కొందరి సిబ్బంది తీరు మొత్తం పాలనను అబాసుపాలు చేస్తుంది. గతంలో ఎన్నడులేని రీతిలో పాలనపై విమర్శలు వినవస్తున్నాయి. అధికారులు కొటరీగా ఏర్పడి మేయర్, కమిషనర్ ఆదేశాలను పట్టించుకోకుండా కార్యాలయాన్ని వివాదాల నిలయంగా మార్చారని ఎవరు ఏ నిర్ణయం చేసినా దాని గురించి వీరికి అక్కరలేదని వీరు చెప్పిందే అమలవుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కార్పోరేషన్ సిబ్బంది మొత్తం పాలన వ్యవహారాలను లీక్ చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని సహచర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పోరేషన్ ఉద్యోగులు కుల, మత ప్రాంతీయ వాదాలతో విడిపోయి కార్యాలయ పనుల గురించి పట్టించుకోవడం లేదన్న వాదన వినపడుతుంది. అవినీతి తారాస్థాయికి చేరిందని అనుమతులు కొందరిని సంతృప్తి పరిస్తేనే వస్తున్నాయని, నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. మేయర్, కమిషనర్ సిబ్బందిపై పట్టు కోల్పోయారా ఎందుకీ ఈ పరిస్థితి అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. విజిలెన్స్ విచారణలు, సిబ్బంది మధ్య ఆరోపణలు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అపరిమిత అధికారాలు వీటన్నింటిపై కమిషనర్ మేయర్ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. కార్పోరేషన్ సిబ్బంది కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జరిగిన కార్పోరేషన్ సాధారణ సమావేశంలో ఒక కార్పోరేటర్ మాట్లాడుతూ అంతా అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. డివిజన్‌లో ప్రజలకు సమాధానం చెప్పుకోలేని స్థితి ఏర్పడింది. ఖమ్మం మున్సిపాలిటీగా ఉన్నప్పుడు కానీ, గత పాలక వర్గ హయాంలో కానీ ఈ పరిస్థితి లేదు. దీనిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్పోరేషన్‌కు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులను పర్యవేక్షిస్తున్నారు. మౌలిక వసతుల కల్పనలో జాప్యానికి తావివ్వడం లేదు. మేయర్, కమిషనర్ పనితీరుపైన వ్యక్తిగత ఆరోపణలు లేవు. తలను తోక ఆడించినట్లు ఒకరిద్దరు అధికారులు వారికి అనుకూలమైన సిబ్బంది మొత్తం పాలనను అబాసుపాలు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారు అన్నది అర్థం కావడం లేదని ఓ కార్పోరేషన్ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిజాయితీగా తమ పని తాము చేసుకుని పోయే అధికారులు, ఉద్యోగులు సైతం భయపడుతున్నారు. కార్పోరేషన్‌లో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. కాసులు లేనిదే ఏ పని కావడం లేదన్న భావన ప్రజల్లో బలపడుతుంది. కార్పోరేషన్ పాలన గాడి తప్పడానికి కారణమైన వారిపై తగు చర్యలు తీసుకుంటే తప్ప పాలన గాడిన పడదు. ఆ చర్యలు ఎప్పుడు తీసుకుంటారో మరి.



# యువతరంగం

ఫోకస్

## పిహెచ్‌డి డ్రాపౌట్.. ఫారెస్ట్ సర్వీస్ టాపర్!



అనివార్య కారణాల వల్ల పిహెచ్‌డి పూర్తి చేయలేకపోయినప్పటికీ, పట్టుదలతో కృషి చేసి ఇండియన్ ఫారెస్ట్ సిర్వీస్ పరీక్షలో టాపర్‌గా నిలిచిన కనికా అనభ్ స్ఫూర్తిదాయక ప్రయాణం ఎంతో మంది యువతీయువకులకు మార్గదర్శకం చేస్తుంది. రాంచీకి చెందిన కనిక మూడు ప్రయత్నాల తర్వాత ఈ పరీక్షలో ఆల్ ఇండియా నంబర్ వన్ ర్యాంక్ తెచ్చుకోవడం విశేషం. జీవశాస్త్రంలో నేపథ్యం, కుటుంబ సభ్యుల మద్దతుతో ఆమె అనుకున్నది సాధించింది. తన విజయానికి వ్యూహాత్మక ప్రణాళిక, మార్గదర్శకత్వం, స్థితిస్థాపకత కారణమని ఆమె పేర్కొంది. 2021లో తన డాక్టరల్ అధ్యయనాలను విడిచిపెట్టిన కనిక, తెలివైన తయారీ పద్ధతులను స్వీకరించి, ఎదురుదెబ్బలను అధిగమించి భారత దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక పరీక్షలలో ఒకదానిలో అగ్రస్థానంలో నిలిచింది. అంతకు ముందు ఈ ప్రయత్నాల్లోనూ మూడు పర్యాయాలు విఫలమైంది. భారతదేశంలోని అత్యంత కఠినమైన పోటీ పరీక్షలలో ఒకటైన ఈ ఫారెస్ట్ సర్వీస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఛేదించాలన్న పట్టుదలకు, వ్యూహాత్మక తయారీ జత కలవడంతో, కనిక లక్ష్యం నెరవేరింది. ఆమె ఎంచుకున్న ఐచ్ఛిక సబ్జెక్టులు జువాలజీ, ఫారెస్ట్రీ. తన విద్యా నేపథ్యంతో ఫారెస్ట్ సర్వీస్ సాంకేతిక స్వభావంతో దగ్గరి సంబంధం కలిగి ఉండడం కొంత లాభించిందని కనిక అంటున్నది. మొదట్లో ప్రిలిమ్స్‌పై దృష్టి సారించడం, తరువాత మెయిన్స్‌కు మారడం, పరీక్ష తేదీకి దగ్గరగా ప్రిలిమ్స్‌ను తీవ్రంగా సవరించడం వంటి అంశాలు ఆమె విజయానికి మార్గాలయ్యాయి. ఆమె ఆన్‌లైన్ కోర్సులు, టాపర్ నోట్స్ ద్వారా కేవలం ఆరు వారాల్లోనే ఫారెస్ట్రీలో ప్రావీణ్యం సంపాదించడం విశేషం. ఇది రొటీన్ లెర్నింగ్ కంటే స్మార్ట్ వర్క్ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేసింది. దినచర్య, సోషల్ మీడియా, మానసిక దృఢత్వాన్ని సమతుల్యం చేయడం కనిక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఆమె తన దినచర్యలో, కనికా సాధారణంగా రోజుకు 8 నుండి 9 గంటలు చదువుకునేది. ఉదయాన్నే చదువుకు దూరంగా ఉంటూ సిఎస్‌ఎటి వంటి తనకు సంక్లిష్టంగా తోచిన విభాగాలపై ఎక్కువ సమయం కేటాయించేది. కీలకమైన సన్నాహక దశలలో పరధ్యానాన్ని నివారించడానికి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను తాత్కాలికంగా నిలిపివేసింది. తాను ఎదుర్కొన్న ప్రతి వైఫల్యం తర్వాత, సందేహాల క్షణాలు తలెత్తుతాయని, కానీ తాను ఎప్పుడూ నిష్క్రమించాలని తీవ్రంగా ఆలోచించలేదని కనిక అంటున్నది. లక్ష్యాల పట్ల స్పష్టత, స్థిరత్వం, స్థితిస్థాపకత అనేవి గంటల తరబడి అధ్యయనం చేయడం కంటే ముఖ్యమైనవని కనిక అభిప్రాయం. ఆ విషయాన్ని ఆమె తన విజయంతో నిరూపించింది.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## స్వయం ఉపాధికి కెవిఐసి హనీ మిషన్






యువతకు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించుకునే మార్గాల్లో భాగంగా తేనెటీగల పెంపకాన్ని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కెవిఐసి) ప్రోత్సహిస్తున్నది. ఇందుకు కోసం హనీ మిషన్‌ను నిర్వహిస్తున్నది. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2017–18లో కెవిఐసి ప్రారంభించిన తేనె మిషన్, గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో స్వయం ఉపాధిని సృష్టించడానికి తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. లబ్ధిదారులకు తేనెటీగల పెట్టెలు, కాలనీలు, టూల్‌కిట్లు అందుతాయి. శిక్షణ లభిస్తుంది. 2025 నాటికి కెవిఐసి 2.29 లక్షలకు పైగా తేనెటీగల పెట్టెలను పంపిణీ చేసింది. దీని వల్ల 20,000 మెట్రిక్ టన్నుల తేనె ఉత్పత్తి అయింది. తేనెటీగల పెంపకం దారులకు రూ.325 కోట్ల ఆదాయం లభించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో, కెవిఐసి కింద తేనె ఎగుమతులు రూ.25 కోట్లకు చేరుకున్నాయి. తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించడానికి ఇతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి. సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి కోసం నిధి పథకం (ఎస్ఎఫ్‌యుఆర్‌టిఐ), జాతీయ తేనెటీగల పెంపకం మరియు తేనె మిషన్ (ఎన్‌బిహెచ్ఎం) సాంప్రదాయ తేనెటీగల పెంపకందారులకు సమూహాలను ఏర్పాటు చేయడం ద్వారా మద్దతునిస్తున్నాయి. అదే విధంగా స్థిరమైన ఉపాధి కోసం శిక్షణ, ఆధునిక యంత్రాలను అందిస్తున్నాయి. ఈ పథకం గ్రామీణ యువతకు ఎంతో ఉపయోగకరం

## చదువా కీలకమే..



విద్య లేకపోయినా ఫలానా వ్యక్తులు ఫలానా రంగంలో అత్యుత్తమ శిఖరాలకు చేరుకున్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలనీ ఎన్నో హితోక్తులు వింటునే ఉంటాం. కానీ, అది సులభసాధ్యం కాదన్నది వాస్తవం. కోట్లాది మందిలో అలాంటి అరుదైన వ్యక్తులు పదుల సంఖ్యలో మాత్రమే ఉంటారు. మిగతా వారంతా జీవితంలో ఎదగాలంటే చదువుపై దృష్టిపెట్టక తప్పదు. విద్య అనేది మన జీవితంలో అత్యంత కీలకమైన అంశం. అది వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం మాత్రమే కాకుండా, మన లక్ష్యాలను సాధించేందుకు మార్గాన్ని కూడా చూపిస్తుంది. చదువు పట్ల దృఢనిశ్చయం లేకపోతే, మనం కలలు కనుకున్న వాటిని నిజంగా సాకారం చేసుకోవడం కష్టం. ఒక లక్ష్యాన్ని సాధించడానికి మనస్సులో నిదానమైన స్థిరత్వం, ఓర్పు, పట్టుదల ఉండటం జీవితంలో అత్యవసరం. ఇది కేవలం కొంతకాలం కోసం మాత్రమే కాకుండా నిరంతరం కొనసాగించే ప్రయత్నం. చదువులో ధృఢనిశ్చయం అంటే ప్రతి రోజూ కష్టాలను ఎదుర్కొని, ఆ లక్ష్యాన్ని సాధించాలన్న భావనతో నిరంతరం చదవడం అనే ప్రేరణను కలిగిస్తుంది. జీవితంలో ఏ రంగంలో అయినా విజయం సాధించాలంటే చాలా కష్టాలు వస్తాయి. అలాంటి సమయంలో పట్టుదలతో ఉండటం అవసరం. విద్య ద్వారా ఇలాంటి సమస్యల నుంచి బయటపడవచ్చు. చదువుకోవడానికి అనేక సమస్యలు ఎదురవుతాయి. అయితే వాటిని జయించేందుకు ధైర్యం, ఓర్పు కావాలి. ఓర్పుతో చదవడం ద్వారా మన ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సమస్యలను తట్టుకోగల సామర్థ్యం వస్తుంది. విద్యార్థిగా కష్టపడటం వల్ల ఇతరులు మన పనితీరును గౌరవిస్తారు. విద్యాభ్యాసంలో మనం ఆలోచనా శక్తి పెంపొందించి, తగిన నిర్ణయాలు తీసుకోగలుగుతాం. ప్రపంచంలో అనేక మంది స్ఫూర్తిదాయక వ్యక్తులు ఎంతో కష్టపడి చదువుకున్నారు. ఉదాహరణకు.. అబ్రాహం లింకన్ చిన్నపుట్టిన తర్వాత పేదరికాన్ని అధిగమించి, చట్టబద్ధమైన నాయకుడయ్యారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చిన్నప్పటి ఆర్థిక ఇబ్బందుల మధ్య నుండి ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తగా ఎదిగారు. తన జీవితంలో ఎన్నో అడ్డంకులు ఎదురైనప్పటికీ మలాలా యూసఫ్ జయ్ చదువును కొనసాగించింది. విద్యా హక్కు కోసం పోరాటం చేసింది.

## వృద్ధాప్యంలో హుషారుగా..




వృద్ధాప్యం జీవితం చివర దశ కాదు, అది మరో జీవనారంభం. ఇది అనుభవంతో, ఆత్మవిశ్వాసంతో, శాంతితో నిండిన దశ. ఈ దశను నిస్సారంగా గడిపే బదులు, చైతన్యంగా, ప్రభావవంతంగా గడపడం అవసరం. కుటుంబాలు, సమాజం వృద్ధుల అవసరాలు గుర్తించాలి. అలాగే వృద్ధులు కూడా తమలో స్ఫూర్తిని చిగురింపజేసుకుంటూ జీవితాన్ని విలువైనదిగా మార్చుకోవాలి. ఎందుకంటే వారు నడిచిన బాటలోనే వచ్చే తరాలకు మార్గం. వృద్ధాప్యం అనేది మానవ జీవితంలో సహజమైన దశగా గుర్తించాలి. ఏదో ఒక వ్యాపకాన్ని సృష్టించుకొని, ఉత్సాహంగా, ఉల్లాసంగా గడపాలి. ఇది పౌష్టికత తగ్గే, శక్తి మాంద్యం వచ్చే దశే అయినప్పటికీ, అనుభవాల పండుగ మిగిలే దశ కూడా. మన సమాజంలో వృద్ధులు అనుభవం, బుద్ధి, సాంప్రదాయాల నిలయంగా పరిగణిస్తారు. అయితే ఆధునిక జీవన శైలి, కుటుంబ వ్యవస్థ మార్పులు వృద్ధులను ఒంటరితనానికి, నిరాశకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, వృద్ధులు జీవితాన్ని మరొక కోణంలో చూసే అవకాశం ఉంది. వ్యక్తిగత స్థాయిలో, కుటుంబ స్థాయిలో, సమాజ స్థాయిలో వారు చేయగల పనులు అనేకం ఉన్నాయి. వృద్ధాప్యంలో అంతర్ముఖత వైపు పయనం అత్యవసరం. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, జీవితం పట్ల ప్రశాంత దృక్పథాన్ని ఏర్పరిచేందుకు దోహదపడుతుంది. మనస్సును స్థిరపరచడం, మానసిక శాంతిని పొందడం కూడా అవసరమే. ఆరోగ్యమే ఆద్యమువృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణ అత్యవసరం. శక్తి తగ్గినా, వ్యాయామం, జీవన శైలి మార్పులు శరీరాన్ని చురుకుగా ఉంచుతాయి.

**తేలికపాటి వ్యాయామాలు:** ఉదయన డక, యోగా, శ్వాస నియంత్రణ.

**సంకలిత ఆహార విధానం:** తక్కువ కొవ్వు, తక్కువ ఉప్పు, అధిక ఫైబర్ ఫుడ్.

**తరచూ వైద్య పరీక్షలు:** షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ వంటివి ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి. వీలుంటే ఆర్థిక భద్రత కోసం ఆరోగ్య బీమా తీసుకోవాలి. సానుకూల దృష్టికోణంశారీరక దృఢతతో పాటు మానసిక ఆరోగ్యం కూడా కీలకం. వృద్ధులు ఒంటరితనానికి లోనవకుండా చురుకుగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**పుస్తకాలు చదవడం:** కథలు, నవలలు, చరిత్ర, ధార్మిక గ్రంథాలు.

క్రాస్‌వర్డ్స్, పజిల్స్: మేధస్సు పదిలంగా ఉంచడంలో సహాయపడతాయి. విచారణాత్మక ఆలోచనలు అవసరం. ఆనందాన్ని పెంచే క్రియాశీలత పెరగాలి. సంగీతం ఉత్తమం. వృద్ధులు తమ లోని కళా వైభవాన్ని వెలికి తీయవచ్చు. ఇది వారి వ్యక్తిత్వాన్ని నిలిపే మార్గం కూడా అవుతుంది. చిత్రలేఖనం, శిల్పకళలు తదితరాలు భావాల వ్యక్తీకరణకు రంగురంగుల మార్గాలు. మనస్సుకు ఉల్లాసం కోసం నాటకరంగం, కథా రచన, అనుభవాన్ని కథలుగా మార్చడం, క్రాఫ్ట్, అల్లికలు వంటి రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలి. వృద్ధులు తమ సమాజంలో దోహదపడే మార్గాలు అనేకం ఉన్నాయి. వృద్ధాశ్రమాల్లో సాయ, సేవ, సహకారం వంటి పనులు మనసుకు ఊరటనిస్తాయి. బాలల ఆసరా కేంద్రాల్లో పాఠాల బోధన, విద్యా సేవ, స్వచ్ఛంద సంస్థల్లో భాగస్వామ్యం తదితరాలు కూడా వృద్ధులను మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచుతాయి. సమూహ చైతన్యాన్ని పెంచడం కూడా అందులో భాగమే. వృద్ధులు కుటుంబానికి మూలస్థంభం లాంటి వారు. వారు అనుభవాలతో, చింతనతో మార్గనిర్దేశం చేయగలరు. పిల్లలకు నీతిపాఠాలు, కథల ద్వారా పిల్లలను సన్మార్గం నడిపించగలరు. ఇంటి వంశవృక్షం, జీవిత విశేషాల రికార్డు, యువతకి సలహాలు ఇవ్వడం, జీవితపాఠాలు నేర్పడం, ఆర్థిక నిపుణత పరిచయం చేయడం వంటి ఎన్నో పనులు వృద్ధుల ముందు ఉన్నాయి. డిజిటల్ ప్రపంచంలో అడుగులు వేయడం తప్పనిసరి. ప్రపంచం డిజిటల్ వైపు పరుగులు తీయగా, వృద్ధులు కూడా ఆ మార్గంలో చేరాలి. స్మార్ట్‌ఫోన్ వాడకం నేర్చుకోవాలి. వీడియో కాల్స్ ద్వారా కుటుంబంతో సంబంధాలు పెంచుకోవాలి. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా మిత్రులతో కలవాలి. ఆన్‌లైన్ క్లాసులు, వెబ్‌నార్లు నిర్వహించాలి. కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవాలి. బ్లాగులు, వాయిస్ మెమోలు, వీడియోలు వంటి మార్గాల్లో రచనలు చేయవచ్చు. గతం పట్ల కృతజ్ఞతాభావం ప్రదర్శించాలి. కుటుంబ సభ్యులకు సరైనగా ఆస్తి పంచడం, పనికి వచ్చే పెట్టుబడులు పెట్టడం కూడా అవసరమే. మొత్తం మీద వృద్ధులు వయసు గురించిగాక, ఇతరత్రా అంశాలపై దృష్టి కేంద్రీకరించడం అత్యవసరం.

# సమాజానికి కమ్యూనిస్టులు అవసరం

నిరంకుశపాలనకు వ్యతిరేకంగా ఎర్రజెండా పార్టీలన్నీ ఏకమవ్వాలి

మావోయిస్టులతో కేంద్రం శాంతిచర్చలు జలపాలి

మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సమాజానికి కమ్యూనిస్టుల అవసరం చాలా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో కూనంనేని సాంబశివరావు విలేకరులతో మాట్లాడారు. మతోన్మాద బిజెపి దేశంలో నిరంకుశ పాలన కొనసాగిస్తుందని, దీనిని నిలువరించేందుకు ఎర్రజెండా పార్టీలన్నీ ఒక తాటిపైకి వచ్చి ప్రజాపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసి ప్రజలను, మావోయిస్టులను చట్ట విరుద్ధంగా హత్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ హత్యలన్నీ బిజెపి ప్రభుత్వం చేసిన హత్యలేనన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ, కేంద్రం ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమన్నారు. వామపక్ష భావజాలాన్ని, మావోయిస్టులను అంతం చేయడం లక్ష్యంగా బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం, ప్రధాని మోదీ, అమిత్‌షాలు ఆపరేషన్ కగార్ చేపట్టి విచ్చలవిడిగా మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని ఆయన కుటుంబసభ్యులకు అందజేయాలని కోరారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి బిజెపి భయపడుతుందన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి గూడెంలో వందేళ్ల సిపిఐ చరిత్రను, అమరుల త్యాగాలను, పోరాట ఘట్టాలను గుర్తు చేస్తూ అమరుల ఆశయాల ఆదర్శంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈనెల ఆగస్టు 8 నుండి 11వరకు మేడ్చల్‌లో సిపిఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, సెప్టెంబర్ 18 నుండి 23 వరకు చండీగఢ్‌లో జాతీయ మహాసభలు జరుగుతాయని కూనంనేని తెలిపారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యుడు కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సెంటర్లను తరలించొద్దు

అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అద్దె భవనాలలో నడుపుతున్న అంగన్‌వాడీ సెంటర్లను ప్రాథమిక పాఠశాలకు తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, అంగన్‌వాడీ టీచర్స్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రజిత డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు అనుబంధంగా పరిమిత సంఖ్యలోనే అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని, దానికి మూడు రెట్లు సెంటర్లు అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. మౌలిక వసతులు లేని ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మార్చడం ద్వారా గర్భిణీలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న శుక్రవారం సభలతో పోషకాహారం ఖర్చులు తమ మీదే భారం పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తామన్న రెండు లక్షల వరకు గల పెన్షన్, వయోభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆసరా పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ విషయాలపై అనేక సార్లు సంబంధిత మంత్రి, ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎ.రజిత, జిల్లా నాయకులు విజయ, పద్మ, సంధ్య, నిర్మల, కవిత, రాజాదేవి, అరుణ, రాజమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# దేశసంపద, ప్రజాధనాన్ని పెట్టుబడిదారులకు పంచుతున్న మోదీ




సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి :** లక్షల కోట్ల రూపాయల దేశసంపదను, ప్రజాధనాన్ని మోదీ పెట్టుబడిదారులకు అప్పనంగా పంచి పెడుతున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా పిఎపల్లి మండల సిపిఐ 15వ మహాసభ సోమవారం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఐదుశాతం జనాభా కలిగిన కార్పొరేట్ పెట్టుబడుదారులు, బడా వ్యాపారుల సంపద 70 శాతం పెరగగా, పేద, మధ్యతరగతి వర్గం నుండి వచ్చిన 50 శాతం మందికి సంపదలో కేవలం మూడు శాతం పెరుగుతుందన్నారు. పేదలను మరింత పేదలుగా, ధనవంతులను మరింత ధనవంతులుగా చేసే కుట్రలో భాగంగానే అసమానతలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ విధానాలతో కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ట స్థాయికి చేరాయన్నారు. 2023లో కేంద్రంలోని పాలకులు కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిందన్నారు. కార్మికులు మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు పాలసీదారులుగా ఉన్న ఎల్ఐసి వాటాలను అమ్మేందుకు మోదీ ప్రభుత్వం తెగ తాపత్రయం పడుతుందన్నారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధర, చట్టబద్ధత కల్పించాలని, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకురావాలని, అన్ని బ్యాంకింగ్ సంస్థల నుంచి ఒకేసారి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతు చట్టాల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నూనె కాంతారావు అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, మండల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్, అలుగుబెల్లి భాస్కర్‌రెడ్డి, యాద ఆంజనేయులు, మల్లచారి, మునవత్ మోహన్, లోకసాని నారాయణరెడ్డి, ఎం.చిన్న, అంజం రాజు, బ్రహ్మచారి, రాచమల్ల గోవిందరాజు, వెంకటయ్య, మునావత్ రాంజీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

మావోయిస్టులను చంపితే నక్సలిజం పోతుందనేది భ్రమే

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దేశంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధమవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందన్నారు. ఆ క్రమంలోనే అటవీ, ఖనిజ సంపద కోసం నక్సలిజాన్ని మార్చి 2026 నాటికి అంతం చేస్తామని బీష్మించిందన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల మధ్య శాంతి చర్చలు జరిగి పరిష్కార మార్గాలు దొరికాయన్నారు. ఒక వ్యవస్థ కోసం ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని చెప్పినప్పటికీ ఆపరేషన్ కగార్ పేరుతో నక్సల్స్‌ను ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నక్సలిజం మూలాలను చర్చించి పరిష్కరించకుండా ఎన్‌కౌంటర్‌ల పేరుతో హత్య లు చేయడం సరికాదన్నారు. అనారోగ్యంతో హాస్పిటల్‌కు వెళ్లిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావును కాల్చి చంపడం దురదృష్టకరమన్నారు. చట్టరీత్యా కోర్టులు, జైలుకు పంపించకుండా ఎదురుకాల్పుల పేరుతో కేంద్రప్రభుత్వం హత్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఐ ఉద్యమాలకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతో అతికొద్ది కాలంలోనే వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. దేశంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధమయ్యేందుకు భవిష్యత్ కార్యచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ఈ యేడాది గల్లీ నుంచి ఢిల్లీ వరకు మహాసభల సంవత్సరంగా మారిందన్నారు. ఈనెల 27, 28 తేదీలలో కరీంనగర్‌లో రెండు రోజుల పాటు సిపిఐ జిల్లా మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేటి సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్‌లు హాజరు కానునట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాలను దిశానిర్దేశం చేసే విధంగా మహాసభలుంటాయని, మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సృజన్ కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ, జిల్లా కార్యదర్శి మచ్చరమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బామండ్లపల్లి యుగేంధర్, బోనగిరి మహేందర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న విద్యాధికారులు

చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ ధర్నా

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యానికి జిల్లా విద్యాధికారులు కొమ్ముకాస్తున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం ఆరోపించారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులోని నేషనల్ మార్ట్ వెనకాల శ్రీచైతన్య (సిబిఎస్ఇ) పేరుతో విద్యాశాఖ నుండి అనుమతి లేకుండా బిల్డింగ్ పూర్తి కాక ముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ నగరంలో శ్రీచైతన్య విద్యాసంస్థకు విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతి లేకుండా బిల్డింగ్ పూర్తి కాక ముందే సిబిఎస్ఇ పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. లక్ష రూపాయల నుండి 1.50 వరకు ఫీజు వసూలు చేయటం జరుగుతుందన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా యాజమాన్యానికి కొమ్ముస్తున్నారని విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే విద్యాశాఖాధికారులు స్పందించి శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యంపై కేసు నమోదు చేసి ఆ బిల్డింగ్ సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించకపోతే జిల్లా విద్యాధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా నాయకులు కుషాల్, కార్తీక్, నవీన్, కృష్ణ, ప్రదీప్, మహిపాల్, లక్ష్మ ణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఇల్లందకుంట సిపిఐ మండల కార్యదర్శిగా రత్నాకర్ గౌడ్



**ప్రజాపక్షం/జమ్మికుంట:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శిగా మల్యాల గ్రామానికి చెందిన మాదారపు రత్నాకర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఈ మేరకు ఆదివారం సిపిఐ మండల మహాసభ ఇల్లందకుంట మండల పరిధిలోని మల్యాలలో జరిగిన మండల సభ సమావేశంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మర్రి వెంకటస్వామి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు అందుబాటులో ఉండి, నిరంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పోరాటం చేస్తానని అన్నారు. రత్నాకర్ నియామకం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఏరులై పారుతున్న మద్యం, పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల కార్మిక వాడల్లో మద్యం ఏరులై పారుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. సోమవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో రాత్రి అయితే మెడికల్ షాపులో మెడిసిన్ దొరుకుతాయో లేవో కానీ కార్మిక వాడల్లో బెల్ట్ షాపుల్లో మద్యం ఏ సమయమైనా దొరకడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని ఎద్దేవ చేశారు. కార్మిక వాడల్లో కూలీనాలీ చేసుకుని బ్రతికుతున్న కార్మికులు ఆ డబ్బంతా తీసుకెళ్లి బెల్ట్ షాపుల్లో దారబోస్తూ మద్యానికి బానిసై కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయని, యువకులు మద్యం మత్తులో పడి తన చదువును లక్ష్యాన్ని కోల్పోవడం జరుగుతుందన్నారు. సిరిసిల్ల పట్టణంలో 15 నుండి 20 బెల్ట్ షాపులు ఎక్సైజ్ పోలీస్ శాఖ కనుసన్నల్లో నడుస్తున్నాయని నెలనెలా వారికి కమిషన్లు అందుతున్నాయని దీని వల్ల యువకులు మద్యానికి బానిసలై కుటుంబాలను చిన్న భిన్నం చేసు కుంటూ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. బెల్ట్ షాపులు చట్టానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ కూడా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పట్టించుకోకపోవడంలో గల మతలాబు ఏమిటో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ చెప్పాల్సి ఉందని అన్నారు. బెల్ట్ షాపుల పైన వెంటనే చర్యలు తీసుకోకపోతే వైన్ షాప్ యజమానులు ఎక్సైజ్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, దీనిపైన కమ్యూనిస్టు పార్టీ జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేయటానికి పూనుకుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సోమనాగరాజు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:** మండలం సోమన్ పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం రోజున జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల కలెక్టర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాల్లో ఉన్నటువంటి ధాన్యము, తడిసినటు వంటి ధాన్యము ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు వెంటనే తరలించాలని కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లర్లకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతిరోజు మిల్లులకు పంపాలని రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. కొనుగోలు సెంటర్లలో ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వేగ వంతంగా పూర్తి చేయాలని అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అన్నారు. సెంటర్ ఇంచార్జ్ అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, డి ఎం జితేంద్ర ప్రసాద్, జగిత్యాల రూరల్ తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చందుర్తిలో మహిళ దారుణ హత్య



**ప్రజాపక్షం/చందుర్తి:** మండల కేంద్రానికి చెందిన బొల్లు మల్లవ్వ(50) అను మహిళ దారుణ హత్యకు గురైన ఘటన చందుర్తి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు బొల్లు మల్లవ్వ కుటుంబానికి తన సమీప బంధువులతో గత కొన్ని సంవత్సరాలుగా భూ వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో మృతురాలి సమీప బంధువులలోని యువకుడు ఆమేను పదునైన కత్తితో నరికి హత్య చేశాడని అన్నారు. సదరు యువకుడు గంజాయి మత్తుకు బానిసై గతంలో ఒక హత్య చేసి జువైనల్ హోంకి వెళ్ళి వచ్చాడని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వెంకటేశ్వర్లు , ఎస్ఐ అంజయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకుని రాజన్నపేటకు చెందిన ఓమహిళ మృతి చెందిన విషయం అందరిని కలిచివేసింది.ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రాజన్నపేటకు చెందిన మహిళ తన పుట్టింటికి బిడ్డలతో మాచారెడ్డికి కలిసివెళ్ళింది.అక్కడ నుండి తన స్వగ్రామంకు తన తండ్రి ఎక్సెల్ బండిపై లచ్చపేటకు తీసుకెళుతుండగా మూలమలుపు రోడ్డు ఉంది.అక్కడ నుండి అపాచి బండి వాహనం ఎదురెదురుగా ఢీకొట్టికున్న సంఘటనలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.భర్త విదేశంలో ఉన్నాడు.విషయం తెలుసుకున్న మాజి ఎంపీటీసీ నమిటికొండ శ్రీనివాస్ వెంటనే సంఘటన స్థలానికి వెళ్ళారు.కాగా భాదిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాజన్నపేట వాసులు కోరుతున్నారు.

# 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం/మంథని:** 3వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్ ను మహిళా సంఘాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ లో 2.90కోట్ల నిధులతో పీఎం కుసుమ్ కార్యక్రమం క్రింద చేపట్టనున్న సోలార్ ప్రాజెక్టు మంజూరి పత్రాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కరీంనగర్ డిసిసిబి చైర్మన్ కే. రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రారంభించిన పిఎం కుసుమ్ పథకాన్ని రైతులకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అనుకూలంగా ఉండేలా రాష్ట్రంలోనే మొదటిసారిగా మన జిల్లాలో 4చోట్ల సోలార్ ప్రాజెక్టు మంజూరు చేసుకున్నామని, దీనికి కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పిఏసిఎస్ మంథని, పిఎసిఎస్ అప్పన్నపేట, పిఏసిఎస్ కాల్వ శ్రీరాంపూర్, పిఎసిఎస్ ధర్మారం, పిఏసిఎస్ చొప్పదండి పరిధిలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం కరీంనగర్ సహకార బ్యాంకు నుంచి 3 కోట్ల రూపాయల రుణం మంజూరు చేసినందుకు సంబంధిత అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం వ్యవసాయ సహకారసంఘాలకు సోలార్ ప్రాజెక్టు ద్వారా 50 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్న ప్యాక్స్ ద్వారా సంవత్సరానికి 7300 కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పెట్రోల్ పంప్, రైస్ మిల్ వంటి వివిధ వాణిజ్య వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు కృషి జరుగుతోందని అన్నారు. జిల్లాలో ఉన్న 131 పిఏసిఎస్ లలో కూడా పీఎం కుసుమ్ క్రింద సోలార్ ప్రాజెక్టు విస్తరించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాలను తీరుస్తూ మహిళా సంఘాలు, వ్యవసాయ సహకార సంఘాలకు ఆదాయ వనరులు సృష్టిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ ఎక్కడ కూడా కోతలు విధించడం లేదని, 200యూనిట్ల వరకు ఉచితంగా పేదలకు సరఫరా చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి సంవత్సరం కనీసం 50 నుంచి 70లక్షల వరకు ఆదాయం వస్తుందని ప్యాక్స్ వద్ద నిధులు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డిఓ సురేష్, ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కారుదే

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/చొప్పదండి:** బిఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో ఒక్క డబుల్ బెడ్‌రూం, ఒక్క రేషన్ కార్డు సైతం ఇవ్వలేదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. నేడు చొప్పదండి పట్టణానికి 110, మండలంలో 474 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. మండలంలో మూడు వేల పైచిలుకు కొత్త రేషన్ కార్డులను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ మేరకు చొప్పదండి పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులు, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఏ పథకం ఎక్కడా ఆగలేదన్నారు. పెన్షన్లు, కళ్యాణలక్ష్మి ఇతర సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హులు ఇంకా ఉంటే వారికి కూడా కేటాయిస్తామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు సంతోషంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులు ఫేక్ ప్రచారాలతో ముందుకు వస్తారని, వారిని ప్రజలు నిలదీయాలని కోరారు. మరోసారి ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రత్యేక అదికారి శ్రీనివాస్, నవీన్ కుమార్, ఎంపిడివో వేణుగోపాల్‌రావు, నాగరాజు, మహేష్, రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ భూంరెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలో మెరిట్‌కు తిలోదకాలు

ఎఐవైఎఫ్ వినతి



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** జిల్లాలోని వారధి ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు మెరిట్ ప్రాతిపదికన కాకుండా డబ్బులు దండుకుని రిక్రూట్‌మెంట్ చేశారని, అందులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ వారధిపేర కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉద్యోగుల దందా నడుస్తున్నా సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. గత పది సంవత్సరాల క్రిత వారధి కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా ఇప్పుడు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. లక్ష కొట్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం పట్టు అన్న చందంగా వారధి సొసైటీ తయారైందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సి ఉండగా అన్నీ తానై చక్రం తిప్పుతున్న సంబంధిత రిటైర్డ్ అధికారి ఆంజనేయులు తన దగ్గర కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించడం జరిగిందన్నారు. ఈ ఘటనపై పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మెడికల్ కళాశాల నిర్వహణకై గతేడాది అక్టోబర్, నవంబర్‌లో మరో ఉద్యోగాలకై నోటిఫికేషన జారీ చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఎందుకు రిక్రూట్‌మెంట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా మంత్రి పొన్నం ప్రభాకర్ కల్పించుకుని వారధిలో జరిగిన ఉద్యోగాల అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు లింగంపల్లి రాజు, శ్రావణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను బెదిరిస్తే ఉత్పత్తి రాదు



గని మేనేజర్‌కు ఎఐటియుసి నాయకుల వినతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సింగరేణి యాజమాన్యం తమ సంస్థాగత అవసరాల నిమిత్తం అండర్ గ్రౌండ్ ఉద్యోగులను ఉపరితల పనులకు వినియోగించుకుంటున్న వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్ చెల్లించడం లేదని, వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. సోమవారం జిడికె వన్ ఇంక్లైన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణిలో సర్ఫేస్ ఐరన్ బొగ్గు బంకర్ నిర్మాణం, ప్యాచ్ వెల్డింగ్ మరియు ఇతరత్రా ఉపరితల పనులను ఏరియా వర్క్ షాప్ లేదా ఉపరితల ఉద్యోగులతో చేయిస్తున్నారని, కాని ఈ మధ్యకాలంలో జిడికె 1వ ఇంక్లైన్‌లో యాజమాన్యం అండర్ గ్రౌండ్ ఉద్యోగులను ఒత్తిడి చేసి సంస్థాగత అవసరాలు అంటూ సర్ఫేస్‌లోని పనులను చేయించుకుంటూ, అండర్ గ్రౌండ్ భత్యాన్ని యాజమాన్యం చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. నేషనల్ కోల్ వేజు అగ్రిమెంట్ 11,అధ్యాయం 4,10 ప్రకారంగా బొగ్గు గనుల చట్టం 1952 మార్గదర్శకాలతో రూపొందించబడిన నియమాలు మరియు నిబంధనలలో నిర్వచించిన విధంగా అండర్ గ్రౌండ్ ఉద్యోగులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్‌ను చెల్లించాలని ఉందని ఆయన పేర్కొన్నారు. సేవా ఒప్పందాల పెరుతోగాని, బూచితోగాని భంగం కలిగించరాదని, పొందుచున్న, ఆచరణలో ఉన్న హక్కులను కాలరాయవద్దని ఉందని ఆయన అన్నారు. కంపెనీ నియమావళి ప్రకారం కార్మికులకు విధులు నిర్వహించే విధంగా అధికారులు మసులుకోవాలని, కార్మికులను బెదిరిస్తే ఉత్పత్తి రాదని, కార్మికుల కృషి తోనే ఉత్పత్తి పెరుగుతుందనే విషయం అధికారులు తెలుసుకోవాలని ఆయన సూచించారు. కార్మికుల వల్లే కంపెనీ కి లాభాలు వస్తున్నాయని, అధికారులు బెదిరిస్తే ఉత్పత్తి రాదని ఆయన సూచించారు. కార్మికుల ను ఉత్పత్తి కోసం బెదిరింపు దోరణిని అధికారులు మానుకోవాలని ఆయన సూచించారు. లేకుంటే ఏఐటియుసి ఆద్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, శ్రీనివాస్, నాయకులు కలవేణి రాజేష్, నందిని నరేశ్, శంకరయ్య , నగేష్, కొప్పుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'కౌన్ జీతేగా'క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభించిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎల్ఎండి కాలనీలో నిర్వహింపబడుతున్న 'కౌన్ జీతేగా మానకొండూర్ నియోజకవర్గం కప్' క్రికెట్ టోర్నమెంట్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. మాదకద్రవ్యాల వాడం నియంత్రణకై మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అతిధులు క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేసి క్రీడా స్పూర్తిని పెంపొందించాలని సూచించారు.

## జూన్ 2 నాటికి భూ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:**జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన ఎలిగేడులో జూన్ రెండు నాటికి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం ఎలిగేడు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అనంతరం మాట్లాడుతూ నూతన ఆర్ఓఆర్ చట్టం భూభారతి అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలిగేడు మండలం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకుని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి నూతన ఆర్ఓఆర్ చట్టం, భూ భారతి ప్రకారం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ 2 నాటికి పైలెట్ మండలంలో ఉన్న భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని, మన పరిధిలో ఉన్న సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఎలిగేడు తహసిల్దార్ యాకన్న, అధికారులు, పాల్గొన్నారు.

## సన్నవడ్లను కొనేది ఎప్పుడు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి :** ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని చెప్పారని ఆచరణలో కొనేవారే లేరని తక్షణమే సన్నవడ్లను కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసినట్లు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణ మాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, తడిసిన వడ్లను సైతం కొనుగోలు చేయాలని కోరారు. జిల్లెల్ల గ్రామానికి చెందిన ఐదుగురి రైతులకు చెందిన 400క్వింటాల్ల సన్నవడ్ల లోడ్‌తో సిబిఎం రైస్ మిల్లుకు వెళితే మిల్లు యాజమాన్యం రైతులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ధాన్యాన్ని కొనేది లేదని దించుకోకుండా, ఎవరికి చెబుతారో చెప్పండని బెదిరిస్తున్నారని జిల్లా కలెక్టర్కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కల్లాల వద్దకు వచ్చిన ప్రతి గింజను కొనాల్సిందేనని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేణు, శంకర్, రాజు, నర్సింములు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## 32వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థిని గెలిపించండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎల్బీనగర్ 32 వ డివిజన్ నాల్గవ మహాసభ ఎల్బీనగర్ ఆ శాఖ కార్యదర్శి మార్కపురి సూర్య అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా మాజీ క్యార్యదర్శి గౌతమ్ గోవర్ధన్ నగర కార్యదర్శి కే కనకరాజ్ హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో 100 సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీ అని తెలిపారు. 1925 డిసెంబర్ 26న జన్మించిన కమ్యూనిస్టు పార్టీ ఆనాడు స్వతంత్ర పోరాటంలో తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో 4000 మంది యువ కమ్యూనిస్టులను కోల్పోయి పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఎలాంటి అధికారం లేకున్నా గత వంద సంవత్సరాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కార్మిక కర్షక మహిళా యువజన విద్యార్థి వర్గాలకు పోరాటమే మార్గం చూపిన కమ్యూనిజం అజరామరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగర్ ను నిలిపివేసి మావోయిస్టు లతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య మడికొండ ఓదమ్మ రేణిగుంట్ల ప్రీతం శనిగరపు చంద్రశేఖర్ జీవుల లక్ష్మీ నారాయణ 40మంది డివిజన్ సిపిఐ సభ్యులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, రాజు, జూల మోహన్, మొండి విప్లవ గేయాల ఆలపించారు.

## ప్రజలను నమ్మించి మోసం చేసింది కాంగ్రెస్ సర్కారే

ఇచ్చిన మాట తప్పారు.. ఇచ్చేటివి ఎగ్గొట్టారు

చౌడాలమ్మ దయతో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** ప్రజలను నమ్మించి మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని.. ఇచ్చిన మాట తప్పినారని.. ఇచ్చేటివి బంద్ చేసినారని మాజీ మం త్రి హరీష్‌రావు అన్నారు. కాళేశ్వర జలాలతో రెండు పంటలు పండుతున్నాయన్నారన్నారు. చౌదలమ్మ దయతో మీ అందరి దీవేనతో బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని..అన్ని బాగుచేసుకుంటామని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా పుల్లూరు గ్రామంలో చౌడలమ్మవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీమంత్రి హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. పుల్లురు గ్రామం అంటనే పుల్లూరు బండ జాతర గుర్తు వస్తుందని, జాతర వలే చౌడాలమ్మ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందన్నారు. చాల సంతోషమని, చౌడాలమ్మ దయతో ఈ ప్రాంతమంత సుబీక్షంగా ఉండాలన్నారు. బండ మీద సిసి రోడ్డు, విద్యుత్ దీపాలు, వాటర్ ట్యాంక్, ఆలయ అభివృద్ధి, ఫంక్షన్‌హాల్, పుల్లురు గ్రామం నుండి గుట్ట వరకు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదవ సంఘం కమ్యూనిట్ భవనాలు, గొర్రెల షెడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదవులకు దుర్గమ్మ గుడి, చౌడలమ్మ గుడి,రజకులకు మడేల్ అయ్యాగుడి ఇక్కటే కట్టుకోవటం జరిగిందన్నారు. గొర్రెల షెడ్లకు బిఆర్ఎస్ ప్రభుత్వం 10 లక్షలు మంజూరు చేస్తే కాంగ్రెస్ సర్కార్ అడబ్బులను రద్దు చేసినట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి హరీష్‌రావును ఘనంగా సన్మానించారు. చౌడలమ్మ జాతరకు ఎంఎల్ఏ హరీష్‌రావు లక్ష రూపాయలు విరాళంగా ప్రకటించారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గూడురు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగురుపీఠంలోని శ్రీదత్తాత్రెయమహాస్వామి, శ్రీషిరిడిసాయిబాబా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం జూన్ 2వ తేది నుంచి ఉండడంతో శ్రీగురుపీఠం ఛైర్మన్ శివకుమార్‌గౌడ్ సోమవారం శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, నర్సాపూర్ ఆత్మకమిటి మాజీ ఛైర్మన్ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## ప్రజావాణికి 106 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్,జెడ్‌పి సిఇఒసాయగౌడ్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్,డిపిఒ శ్రీనివాస్, ఎసిపిలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి జన్నారం ప్రెస్ క్లబ్ సంతాపం



**ప్రజాపక్షం/ జన్నారం:**అనారోగ్యంతో మృతి చెందిన మందమర్రి సీనియర్ జర్నలిస్టు ఎండి మునీర్ మృతికి జన్నారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు నిమిషాలు మౌనం పాటించి మునీర్ మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య మాట్లాడుతూ మునీర్ సీనియర్ పాత్రికేయుడని, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అని, ఆయన మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి క్రీడాకారులను అధికారికంగా సన్మానించాలి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలలో సింగరేణి క్రీడాకారులను యాజమాన్యం అధికారికంగా సన్మానించాలని ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి. జనప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, సంస్థ 2024, 25 సంవత్సరానికి చెందిన 11 ఏరియాల నుంచి 58 మంది కార్మికులు జాతీయ స్థాయిలో క్రీడా, కళా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించి సింగరేణికి పేరు తెచ్చారని తెలిపారు. వీరిని జూన్ 2, 2025న జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అధికారికంగా సన్మానించాలని డిమాండ్ చేశారు.మెడల్స్ సాధించిన వారికి ఇటీవల యాజమాన్యం నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించినప్పటికీ, అధికారిక గౌరవం కూడా అవసరమని యాజమాన్యాన్ని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్రావు, పలువురు బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.


## బాల్యంలో వ్యాయామం, ఆటలు ఆనందానికి దారి

ఎఎస్‌పి చిత్తరంజన్



**ప్రజాపక్షం/వాంకిడి :**బాల్యంలోనే వ్యాయామం, ఆటలతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవనం సాగేందుకు పిల్లలు అలవాటు పడాలని ఆసిఫాబాద్ డివిజన్ ఎఎస్‌పి చిత్తరంజన్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కిడ్స్ జోన్‌ను సోమవారం ఎఎస్‌పి చిత్తరంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి చిత్తరంజన్ మాట్లాడుతూ పోలీస్ క్వార్టర్స్‌లో నివసించే చిన్నారులు, స్థానిక విద్యార్థులు ఈ కిడ్స్ జోన్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. ఆటలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. ఈ కార్యక్రమంలో వాంకిడి సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ ప్రశాంత్, కెరమెరి ఎస్‌ఐ మధుకర్, వాంకిడి ఎఎస్‌ఐ పోశెట్టి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు శ్రీ చైతన్య విద్యార్థిని ఎంపిక



**ప్రజాపక్షం/ మంచిర్యాల:**రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని ఇ. అనుకీర్తన ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు. మే 25న మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో స్థానాలు పొందారు. అండర్ 12 బాలికల విభాగంలో ఇ. అనుకీర్తన లాంగ్ జంప్, 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించింది. అండర్ 10 బాలికల విభాగంలో ఆమె సోదరి సహస్రి జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం పొందింది. అలాగే, అండర్ 8 బాలుర విభాగంలో ఐ. సాయి ని హాల్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో జోనల్ పిఇటి, పిఇటిలు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నా రు.

# క్షేత్రస్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ నస్పూర్:**ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నర్వాయిపేట గ్రామానికి చెందిన జాడిశంకర్ మండలంలోని మెట్పల్లి శివారులో తనకు గల పట్టా భూమి వేరొకరి పేరిట చూపుతోందని, సవరించి తన పేరిట మార్పు చేసి పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన బోయిన రవీందర్, నెన్నెల మండలం మెట్పల్లి గ్రామానికి చెందిన దుగుట రాజేశ్వరి తమ ప్రాంతంలో మీసేవ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మీసేవా కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామపంచాయతీ నాయక్ గూడెంకు చెందిన మంగ శారద తనకు గ్రామ శివారులో ఉన్న భూమి రాళ్లవాగు ఎడమ కాలువలో పోయిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం కొండపేట గ్రామానికి చెందిన అలం మహేందర్ తనకు ఇందిర సౌర గిరి జల వికా సం పథకం క్రింద బోరు, మోటార్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 32 దరఖాస్తులు వచ్చాయని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

మండల వ్యవసాయ అధికారిణి కె. సుష్మ

**ప్రజాపక్షం/తాండూర్:**మండలంలోని వ్యవసాయ భూమి ఉన్న రైతులందరూ విశిష్ట సంఖ్యను తప్పకుండా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కె. సుష్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి వ్యక్తికి ఆధార్ సంఖ్య ఉన్నట్లుగానే, భూమి ఉన్న ప్రతి రైతుకు 11 నెంబర్ల విశిష్ట సంఖ్య అవసరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం చేపట్టే వివిధ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం ఈ విశిష్ట సంఖ్య ఎంతో కీలకం కానుందని, అందుకే రైతులు తప్పనిసరిగా ఈ విశిష్ట సంఖ్యను పొందాలని ఆమె సూచించారు. మండలంలోని కొత్తపల్లి రైతు వేదిక వద్ద మంగళవారం ఉదయం నుండి ఈ విశిష్ట గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ జరుగుతుందని, ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ రిజిస్ట్రేషన్ కొరకు రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ లింక్ మొబైల్ నెంబర్ వ్యవసాయ అధికారులకు అందజేయాలని సూచించారు. దీని ద్వారా ప్రతి రైతు మొబైల్‌కు 3 ఓటిపిలు వస్తాయని, ఆ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారికి అందిస్తే 11 అంకెలతో కూడిన రైతు విశిష్ట సంఖ్య అందజేస్తారని తెలిపారు. ఈ విశిష్ట సంఖ్య ఉంటేనే కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం కిసాన్, సమ్మాన్ నిధి, ఫసల్ భీమా యోజన వంటి పథకాలు పొందడానికి అవకాశం ఉంటుందని, సంఖ్య నమోదు కాకపోతే కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులు పొందే అవకాశం ఉండదని ఆమె స్పష్టం చేశారు. అలాగే, ఈ విశిష్ట సంఖ్య నమోదుకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఎలాంటి సంబంధం ఉండదని, ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలకే వర్తిస్తుందని రైతులకు ఆమె సూచించారు.

## భూ భారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన చట్టం భూ భారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమైక్య భవన్లో లైసెన్సు సర్వేయర్లు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ వ్యక్తికి ఆధార్‌లాగా భూమికి భూదార్ ఉందని , భూమిలోని ప్రతి కమతానికి మ్యాప్ కీలకం కావడంతో సర్వేయర్లు చాలా అవసరం అన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేయర్ పని కీలకమని ,భూమి క్రయ విక్రయాల్లో భూ బదిలాయింపుల్లో రిజిస్ట్రేషన్ ,మ్యూటేషన్, సరిహద్దుల నిర్ణయంలో మ్యాపుల తయారీలో సర్వేయర్ల కీలక భూమిక అన్నారు. జిల్లా వ్యాప్తంగా 298 మంది లైసెన్స్ సర్వేర్ల కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 166 మందిని మొదటి దశలో శిక్షణ కార్యక్రమం అందిస్తున్నామన్నారు. మిగతా 132 మందిని రెండవ దశలో వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సర్వేయర్లు ఈ 50 రోజుల శిక్షణ కార్యక్రమంలో సాంప్రదాయ నూతన టెక్నాలజీ సర్వేలను నేర్చుకోవాలన్నారు. రైతుల సమస్యలపై మీకు ముఖ్యమైన భాద్యతలు నిర్వర్తించబోతున్నారని వాటిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి సర్వే ల్యాండ్ రికార్డు ఐనేష్, సంబంధిత అధికారులు లైసెన్స్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'షి టీమ్స్'తో మహిళలకు భద్రత, భరోసా

షి టీమ్ ఇన్‌చార్జి సిఐ నరేష్



**ప్రజాపక్షం /మంచిర్యాల:**మహిళలు, బాలికలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే రామగుండం షి టీమ్ నంబర్ 6303923700 లేదా డయల్ 100 కు ఫిర్యాదు చేయాలని మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇంచార్జ్ సిఐ నరేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్‌పి ఉన్నత పాఠశాల (బాలికల)లో నిర్వహించిన టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో షిటీమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షి టీమ్స్ ఏర్పాటయ్యాయని, రామగుండం సిపి ఆదేశాల మేరకు షి టీమ్‌లు నిత్యం సేవలు అందిస్తున్నాయని చెప్పారు. షి టీమ్‌ల పని విధానం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, ఈవ్ టీజింగ్, టి సేఫ్ యాప్, సైబర్ నేరాలు, దయల్ 100 ప్రాముఖ్యత తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారని తెలిపారు. షి టీమ్స్ ప్రత్యేకంగా విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో సివిల్ డ్రస్‌లో నిఘా పెట్టి నేరాల నివారణకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ ఎస్‌ఐ ఉషారాణి, కానిస్టేబుళ్లు , ట్రైనింగ్ కోఆర్డినేటర్ , క్వాలిటీ కోఆర్డినేటర్, టీచర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష జరిపారు. జూన్ 2న పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టిల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారిగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమావేశంలో డి ఆర్‌డిఒ సాయగౌడ్, ఆర్‌డిఒ రాజేంద్రకుమార్, ఎసిపి లు రాజా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కలెక్టరేట్ ఎఒ ప్రశాం త్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్యాల సాధనకు ముందస్తు ప్రణాళికలు



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :**వార్షిక లక్ష్యాలను సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కార్పొరేట్ జిఎం మనోహర్, ఏరియా జిఎం ఎం. శ్రీనివాస్ సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కె 7 గనిలో సోమవారం లక్ష్య సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేట్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) మనోహర్, శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆర్‌కె 7, ఆర్‌కె న్యూటెక్ గనులను ప్రత్యక్షంగా పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్‌కె 7 గనిలో నెలవారీ లక్ష్యం 30 వేల టన్నులు, వార్షిక లక్ష్యం 3.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు ముందే కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆర్‌కె న్యూటెక్ గనిలో నెలవారీ 13,500 టన్నులు, వార్షికంగా 1.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని తప్పక సాధించాలని అధికారులను ఆదేశించారు. ఉత్పత్తితోపాటు భద్రత, ఉత్పాదకత రెండింటినీ పెంచేందుకు సమతూల ప్రణాళికలు అవసరమని తెలిపారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని బాటమ్ ఆష్ వినియోగాన్ని పెంచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు తగిన విధంగా పనులను నియమించి, ఉత్పత్తిలో భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. ఉత్పత్తి వ్యయాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి, అధికారి సంస్థ పురోగతిలో భాగస్వాములవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కె 7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఆర్‌కె న్యూటెక్ గని మేనేజర్ స్వామి రాజు, ఆర్‌కె 7 మేనేజర్ జె. తిరుపతి, ఐఇడి ఎస్‌ఇ కిరణ్ కుమార్, గనుల సర్వేయర్లు సిహెచ్. తిరుపతి, రవి పాల్గొన్నారు.

## కూలీలకు రూ. 600 కూలీ, 200 పనిదినాలు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:**కూలీల వేతన బకాయిలు వి డుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలని, రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, 2 0 0 రోజుల పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసా య కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా క న్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. సో మవారం కాగజ్ నగర్ మండలం సరసాల గ్రామ ంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జాబ్ కార్డులు, భా ర్యాభర్తలకు పనిముట్లు ఇవ్వాలని, పని దగ్గర త్రాగునీ రు, నీడ, మెడికల్ కిట్టు సౌకర్యాలు కల్పించాలని అ న్నా రు. సమ్మర్ అలవెన్సులు, రవాణా ఖర్చులు ఇవ్వాల ని, ఆన్లైన్ చెల్లింపుల విధానం రద్దు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. వాచర్లను గుర్తించాలని, ఏడాది పొడవునా పని కల్పించాలని, ప్రమాదాలు జరిగితే రూ. 10 లక్షల ఎక్స్ గ్రే షియా ఇవ్వాలని, పని లేకపోతే నిరుద్యోగ భృతి చె ల్లి ంచాలని కోరారు. పలు డిమాండ్లతో ఈ నెల 30న కలెక్టరేట్ ముందు జరిగే మహాధర్నాను విజయవంతం చే యాలని ఆయన పిలుపునిచ్చారు.ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం..



**ప్రజాపక్షం/బైంసా :**బైంసా మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో తెల్లవారుజామున బైంసా రూరల సర్కిల్ ఇన్స్పెక్టర్ నైలు ఆధ్వర్యంలో సర్కిల్ అధికారులు సిబ్బంది తో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి గ్రామంలో తనిఖీలు నిర్వహించి తగిన ధ్రువ పత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలను 3 త్రిచక్ర వాహనాలను సీజ్ చేయటం జరిగింది.అవినాష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఆదేశవాలతో నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజల రక్షణ,భద్రత పోలీస్ బాధ్యత అని,కాలనీలో కొత్త వ్యక్తులు,నేరస్తులు,షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.నిర్మల్ పోలీసు..మీ పోలీస్..లో భాగంగా మీ గ్రామంలో ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన లేదా రవాణా చేసిన మాకు 8712659599 కి సమాచారము ఇవ్వాలని,అట్టివారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని సూచించారు.గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు. కాలనీ లో మరింత స్వీయ రక్షణ కొరకు సిసి,కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని,భద్రతా పరమైన అంశాల లోసిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

# బెల్లంపల్లి పట్టణ సమగ్రాభివృద్ధికి అధిక నిధులు

బెల్లంపల్లి సిపిఐ మహాసభ డిమాండ్

నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :**పట్టణంలోని బాసెట్టి గంగారం భవన్‌లో సోమవారం సిపిఐ 21వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి అడేపు రాజమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆడేపు రాజమౌళిని పట్టణ కార్యదర్శిగా, బొల్లం తిలక్ అంబేద్కర్‌ను సహాయ కార్యదర్శిగా, మంతెన రమేష్‌ను కోశాధికారిగా ఎన్నిక చేసినట్లు రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బెల్లంపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. మున్సిపల్ ప్రతి వార్డులో రోడ్లు మెరుగుపరచి అంబులెన్స్ వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని, రోజు పరిశుభ్రత పాటించాలని, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో వాహనాల కొనుగోలు, కాంట్రాక్టు కార్మికుల నియామకం, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 170 పిపి ల్యాండ్‌లో నివసిస్తున్న వారికి జిఒ నెంబర్లు 58, 59 ప్రకారం పట్టాలు ఇవ్వాలని, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారందరికీ కార్డులు మంజూరు చేయాలని కోరారు. మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా గోదావరి నీటిని ప్రతి రోజు అందించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే కేటాయించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల నేమ్ ప్లేట్‌లు, సర్టిఫికెట్ల వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. రెండో వార్డులోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద, గ్రౌండ్ బస్తీ వాడల్లో సిసి రోడ్లు నిర్మించాలని, కన్నాల బస్తీ సమీపంలో వైకుంఠ ధామం నిర్మించాలని, బస్సు డిపో, ప్రభుత్వ కళాశాల నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు నియమించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. కన్నాల ప్రాంతంలో జరుగుతున్న భూకబ్జాలను అరికట్టేందుకు ప్రత్యేక కమిషనర్‌ను నియమించి ప్రభుత్వ, సింగరేణి భూములను పరిరక్షించాలని పేర్కొన్నారు. పట్టణ పరిసరాల్లో చిన్నతరహా లేదా భారీ పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలని, బొగ్గు నిక్షేపాల ఆధారంగా మీథేన్ గ్యాస్ పరిశ్రమ, సర్వే అయిన చాఫ్ట్ 1, 2, 3, 4 బొగ్గు గనులను ప్రారంభించాలని తీర్మానించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ మహాసభలో జిల్లా సమితి సభ్యులు , పట్టణ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# క్రీడ

## టీమిండియా రిజర్వ్ ఓపెనర్ వీడ్కోలు..



దేశవాళీ క్రికెట్‌లో మరో క్రికెటర్ శకం ముగిసింది. విధ్వంసక ఆటగాడిగా పేరొందిన గుజరాత్ మాజీ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ వీడ్కోలు పలికారు. భారత ఏ జట్టుకు సైతం సారథిగా వ్యవహరించిన ప్రియాంక్.. అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నానని వెల్లడించాడు. ఈ విషయాన్ని గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ సోమవారం అధికారికంగా తెలిపింది. 35 ఏళ్ల ప్రియాంక్ గుజరాత్ క్రికెట్‌కు విశేష సేవలు అందించాడు. 17 ఏళ్ల పాటు నిలకడగా రాణించాడని అతడిని కొనియాడింది జీసీఏ. 'కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ప్రియాంక్ ఇండియా ఏ కెప్టెన్‌గానూ రాణించాడు. అతడు ఒక రన్ మెషిన్. 17 ఏళ్ల అతడు దేశవాళీలో గుజరాత్ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. సారథిగానూ తన ముద్రవేశాడు. అద్భుతమైన కెరీర్ సాగించిన ప్రియాంక్‌కు మా అసోసియేషన్ తరఫున అభినందనలు. మే 26న ఈ డాషింగ్ బ్యాటర్ అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు' అని గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

### దేశవాళీ 'రన్ మెషిన్' రికార్డులు ఇవే..!

ఓపెనింగ్ బ్యాటర్ అయిన ప్రియాంక్ 2021లో టీమిండియాకు ఎంపికయ్యాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌కు ఓపెనర్ రోహిత్ శర్మకు ప్రత్యామ్నాయంగా అతడిని జట్టులోకి తీసుకున్నారు సెలెక్టర్లు. బెంగాల్ ఆటగాడు అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి రిజర్వ్ ఓపెనర్‌గా ప్రియాంక్‌ను ఎంపికయ్యాడు. అయితే.. తుది జట్టులో మాత్రం చోటు దక్కలేదు. ప్రియాంక్ తన సుదీర్ఘ కెరీర్‌లో 127 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 2016-17 రంజీ సీజన్‌లో అతడు ప్రత్యర్థులకు తన ఉగ్రరూపం చూపించాడు. ఆ సీజన్లో రెచ్చిపోయి ఆడిన ఈ రైట్ హ్యాండర్ అజేయ త్రిపుల్ సెంచరీ(314 నాటౌట్)తో గర్జించాడు. భీకర ఫామ్‌లో ఉన్న అతడు ఆ ఎడిషన్లో ఏకంగా 1,310 రన్స్ కొట్టాడు. అతడి మెరుపులతో గుజరాత్ ఆ సీజన్‌లో విజేతగా నిలిచింది. 2012-13లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పాటు 2015-16లో విజయ్ హజారే ట్రోఫీ గెలుపొందిన జట్టులో కూడా ప్రియాంక్ సభ్యుడు. ఆసాంతం దంచికొట్టడమే మంత్రగా ఆడిన ఈ చిచ్చరపిడుగు డొమెస్టిక్‌లో 29 సెంచరీలు, 34 అర్ధ శతకాలు బాదేశాడు. 97 లిస్ట్ ఏ మ్యాచుల్లో 8 సెంచరీలతో కలిపి 3,672 రన్స్ కొట్టాడు. 59 టీ20లు ఆడిన ప్రియాంక్ 28.71 సగటుతో 1,522 పరుగులు సాధించాడు.

## తేజస్వినికి స్వర్ణం..

### 11 పతకాలతో అగ్రస్థానంలో భారత్



ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత షూటర్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. పోటీ పడి మరీ పోడియం మీద మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తున్నారు. సోమవారం కూడా భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో తేజస్విని పసిడితో మెరిసింది. ఎనిమిది పోటీ పడగా.. ఐదు షూట్ల తర్వాత ఆమె 31 పాయింట్లు సాధించి బంగారు పతకాన్ని కొల్లగొట్టింది. దాంతో, పతకాల పట్టికలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో తేజస్విని 575 పాయింట్లతో 4వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో గురి తప్పకుండా గన్ పేల్చిన తను స్వర్ణంతో భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసింది. అయితే.. క్వాలిఫయర్‌లో అగ్రస్థానంలో నిలిచిన చైనా షూటర్ టవోటవో ఝూవో ఐదో స్థానంతో నిరాశపరిచింది.

అయితే.. ఇదే విభాగంలో పోటీ పడిన భారత అమ్మాయిలు రియా శిరీష్ థట్టే, నామ్య కపూర్, వివాన్షి వరుసగా 15, 18, 24వ స్థానంతో సరిపెట్టుకున్నారు. తేజస్విని తర్వాతి స్థానంలో నిలిచిన బెలారస్ అమ్మాయి అలీనా నెస్టెరోవిచ్ వెండి పతకం గెలవగా.. హంగేరీ షూటర్ మిరియం జాకో కాంస్యంతో మురిసింది. మొత్తంగా చూస్తే.. భారత బృందం మూడు స్వర్ణాలు, నాలుగు రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 11 మెడల్స్‌తో అగ్రస్థానంతో కొనసాగుతోంది.

### అడ్రియాన్‌కు డబుల్



ఈ టోర్నీలో మే 23న శుక్రవారం యువ షూటర్ అడ్రియాన్ కర్మాకర్ కాంస్యంతో గర్జించాడు. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లోకి కంచు మోత మోగించిన రెండో మెడల్ ఖాతాలో వేసుకున్నాడు. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీ పడుతున్న ఈ కుర్ర షూటర్ గురువారం 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో రజత పతకం గెలుపొందిన విషయం తెలిసిందే.

## మెరిసిన ముంబై బ్యాటర్లు..

ఐపిఎల్ పాయింట్ల పట్టికలో టాప్2 బెర్త్‌ను కన్ఫామ్ చేసుకునేందుకు జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ బ్యాటర్లు సమష్టిగా రాణించారు. మరోవైపు భారీ హిట్టర్లను కలిగి ఉన్న ముంబైను పంజాబ్ బౌలర్లు ఓ మోస్తరు స్కోరుకే పరిమితం చేయగలిగారు. సూర్యకుమార్ యాదవ్ (57) మరోసారి అర్ధశతకం సాధించడంతో ముంబై ఫైటింగ్ టోటల్ సాధించగలిగింది. జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు టాప్2 బెర్త్‌ను కన్ఫామ్ చేసుకుంటుంది.

టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. స్లోగా ఉన్న పిచ్‌పై పరుగులు చేసేందుకు ముంబై బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు.

ఓపెనర్లు రోహిత్ శర్మ (24), రికెల్టన్ (21) తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలోనే వికెట్లు పడిపోవడంతో ముంబై పరుగుల వేగం తగ్గింది. అయితే మరోసారి సూర్యకుమార్ యాదవ్ అర్ధశతకం సాధించాడు. ఈ సీజన్‌లో ఐదో హాఫ్ సెంచరీ చేశాడు. ముంబై భారీ స్కోరులో కీలక పాత్ర పోషించాడు.

చివర్లో నమన్ ధీర్ (20) వేగంగా పరుగులు చేశాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది.

పంజాబ్ బౌలర్లలో యన్‌సెన్, వైశాఖ్ విజయ్ కుమార్ రెండేసి వికెట్లు పడగొట్టారు. హర్‌ప్రీత్ బ్రార్ ఒక్క వికెట్ తీశాడు. చివరి ఓవర్ బౌలింగ్ చేసిన అర్ష్‌దీప్ కేవలం మూడు పరుగులు



మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. మరి, బుమ్రా, ట్రెంట్ బౌల్ట్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కొని పంజాబ్ ఈ స్కోరును ఏలా ఛేజ్ చేస్తుందో చూడాలి.

# రీల్

## పవన్ సినిమాలు ఆపే దమ్ము ధైర్యం ఎవ్వరికీ లేదు

### థియేటర్ల బంద్ వివాదంపై టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు



సినిమా థియేటర్ల బంద్ గొడవతో ఏపీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదనపై ఒక్కొక్కరు స్పదింస్తున్నారు ఈ వ్యవహారంపై మొదట అల్లు అరవింద్ స్పదించగా, తాజాగా సోమవారం ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవెలప్ మెంట్ చైర్మన్ దిల్ రాజు స్పదించారు. థియేటర్ల బంద్ కేవలం మీడియా సృష్టి మాత్రమేనని దిల్ రాజు చెప్పుకొచ్చారు. ఇటీవల జరిగిన పరిణామాలను పూసగుచ్చినట్టు దిల్ రాజు మీడియాకు వివరించారు. తన ముప్పై ఏళ్ళ సినిమా జీవితంలో ఎప్పుడు థియేటర్లు బంద్ పెట్టిన దాఖలాలు లేవని అన్నారు. జూన్ ఒకటవ తేదీన థియేటర్లు బంద్ పెట్టాలని ఎగ్జిబిటర్లు కొందరు వాడినప్పుడు తాను వద్దన్నానని , చివరికి తన నిర్ణయాన్ని ఏకీభవించని కొందరు ఛాంబర్ కు లేఖ రాశారని అన్నారు. ఈ లేఖ సారాంశం వేరేలా ఉంటె మీడియాలో కథనాలు ఇంకోలా రావడం వల్ల ఏపీ ఉప ముఖ్యమంత్రికి తప్పుడు సమాచారం వెళ్లిందని వివరించారు. ఈ తప్పుడు సమాచారాన్ని ఫిలిం ఛాంబర్ ఖండించకపోవడం వల్లే వివాదం మరింతగా ముదిరిందని అన్నారు. ఈనేపథ్యంలో తనపై కొంతమంది వ్యక్తిగతంగా కూడా విమర్శలు చేశారని చెప్పారు. నైజాంలో 370 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉంటె అందులో 30 మాత్రమే తనకున్నాయన్నారు. ఏషియన్ సురేష్ కంపెనీలకు 90 థియేటర్లు ఉన్నట్టు వెల్లడించారు. సుమారు 250 థియేటర్లను వాటి యజమానులు నడుపుతున్నారని చెప్పారు. అయితే సుమారు 50కు పైగా థియేటర్లను ఫంక్షన్ హాల్స్ గా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఆ నలుగురు అంటూ తప్పుడు ప్రచారం చెయ్యడం, వ్యక్తిగతంగా దాడికి దిగడం సరైంది కాదని అన్నారు. ఆ నలుగురిలో నేను లేనని స్పష్టం చేశారు. కేవలం కొరోనా సమయంలో తప్ప థియేటర్లు బంద్ ఎప్పుడు జరగలేదని చెప్పారు నిర్మాతలు అప్పట్లో యాభై ఆరు రోజుల్ పాటు షూటింగ్ బంద్ పెట్టుకున్న ఏమి సాధించలేకపోయామని దిల్ రాజు స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ సినిమాలను ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదని దిల్ రాజు అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న వివాదానికి ఈస్ట్ గోదావరి డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ కారణమని చెప్పారు. పవన్ కళ్యాణ్ పెద్దన్న లాంటి వారని, ఆయన తిడితే పడతామన్నారు. థియేటర్ల బంద్ విషయంలో సమన్వయ లోపం కారణంగానే పవన్ కళ్యాణ్ పరిశ్రమపై ఆగ్రహం వ్యక్తం చేశారని దిల్ రాజు అభిప్రాయపడ్డారు. ఎగ్జిబిటర్ల కోరిక న్యాయమైనదేనని అంగీకరించారు. పొరుగు రాష్ట్రాల్లో పర్సంటేజి విధానంలోనే సినిమా ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మాట్లాడుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వంలో భయపడుతూ వెళ్లిన సినిమా పెద్దలు అక్కడ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పక్కింటికి వెళ్ళివచ్చినంత ఈజీగా ప్రభుత్వం దగ్గరికి వెళ్లి టికెట్ ధరలు పెంచుకునే పరిస్థితి వచ్చిందని, ఈ పరిస్థితికి కారణం ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణే అని అన్నారు. పవన్ కళ్యాణ్ స్పందించినట్టుగా పరిశ్రమలో ఐక్యత లోపించడానికి ఫిలిం ఛాంబర్ తీరే కారణమన్నారు. సినిమా పరిశ్రమకు రెండు ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉన్నాయన్నారు.



## బాలయ్యతో గోపీచంద్ మలినేని?

బాలయ్య బాబు ప్రస్తుతం వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ వంటి చిత్రాలతో వరుస హిట్లు అందుకుని ఫుల్ ఫామ్ లో ఉన్నారు. ప్రస్తుతం బోయపాటి శ్రీనుతో 'అఖండ2' సినిమా చేస్తున్నాడు. ఇప్పుడు, గోపీచంద్ మలినేని, బాలయ్యతో మరో మూవీ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే, గోపీచంద్, బాలయ్యకు కథ చెప్పినట్లు తెలుస్తోంది. ఆ కథ కూడా బాలయ్యకు నచ్చినట్టు తెలుస్తోంది. త్వరలోనే, ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఎలాగూ, జూన్ 10న బాలయ్య బర్త్ డే ఉంది. కాబట్టి, ఆ రోజు ఈ మూవీని ప్రకటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. గోపీచంద్ రీసెంట్ గా సన్నీ డియోల్ తో మంచి హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. 'అఖండ 2' తర్వాత బాలయ్య బాబు సినిమా ఉండే అవకాశం ఉంది. ఈ సినిమాను కూడా మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లే నిర్మించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇక బోయపాటి దర్శకత్వంలో బాలయ్య చేస్తున్న అఖండ 2 షూటింగ్ ప్రస్తుతం జార్జియాలో నడుస్తోంది.

## రుద్రుడిగా ప్రభాస్

### మంచు విష్ణు

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం తను ప్రధాన పాత్రలో రూపొందుతున్న సినిమాల షూటింగ్ పూర్తి చేస్తూనే మరోవైపు గెస్ట్ రోల్‌లో కూడా కనిపించి అలరించే ప్రయత్నం చేస్తున్నాడు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కన్నప్ప చిత్రంలో టాలీవుడ్, బాలీవుడ్, మలయాళం, తమిళ ఇండస్ట్రీలకు చెందిన అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రాచీన భారతీయ కన్నప్ప కథాంశం ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు మంచు విష్ణు. 'కన్నప్ప' మూవీ మొత్తం రన్



టైం 3 గంటల 10 నిమిషాలు ఉంటుందని చెప్పిన విష్ణు.. 'ప్రభాస్‌ను మొదట గెస్ట్ రోల్ కోసం తీసుకున్నాం అని అన్నారు. ఆ తర్వాత 30 నిమిషాలు పెంచాం. 'కన్నప్ప'లో చివరి 50 నిమిషాలు ఆయన కనిపించి అలరిస్తారు. ఇక మోహన్ బాబు, ప్రభాస్ మధ్య సీన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. మోహన్ లాల్ రోల్ 15 నిమిషాలు, శివుడిగా అక్షయ్ కుమార్ 10 నిమిషాలు స్క్రీన్‌పై సందడి చేయనున్నారు. ఇప్పటివరకూ నా కెరీర్‌లో ఇంత భారీ సినిమా చేయలేదు అని విష్ణు స్పష్టం చేశారు. మోహన్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ముకేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం అద్భుతమైన విజువల్ ఎఫెకట్స్ మరియు టెక్నికల్ స్టాండర్డ్స్ ని అమలు చేస్తున్నారు. సినిమాలో రుద్ర అవతారంలో ప్రభాస్ కనిపించి సందడి చేయనున్నాడు. ఇక ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, లుక్స్ ఆకట్టుకోగా.. మరో కొత్త పాటను ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు మూవీ టీం వెల్లడించింది. శ్రీకాళ హస్తి అనే పాటను మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా ఆలపించగా, స్టీఫెన్ దేవస్సీ మ్యూజిక్ అందించారు.



## జెఆర్ఎఫ్, నెట్ అర్హత పొందిన వారికి సమాన మార్కులు కేటాయించాలి

### ఒయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డికి విద్యార్థి సంఘాల వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒయు కేటగిరీ 2 అడ్మిషన్లలో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జెఆర్ఎఫ్ ), జాతీయ అర్హత పరీక్ష(నెట్) అర్హత పొందిన విద్యార్థులకు ఇంటర్వ్యూలో సమాన మార్కులను కేటాయించాలని విద్యార్థి సంఘాలు, రీసర్చ్ స్కాలర్స్, పిహెచ్‌డి ఆశావాహులు ఒయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, ఎస్ఎఫ్ఐ ఒయు అధ్యక్షులు కలకోటి ఉదయ్ కుమార్‌తో పాటు పలు విద్యార్థి నాయకులు అశ్వన్, అనంత్, కృష్ణ మధు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 విద్యా సంవత్సరానికి కేటగిరీ 2 పిహెచ్‌డి అడ్మిషన్ల కింద నోటిఫికేషన్ లో జెఆర్ఎఫ్, నెట్ అర్హత పొందిన విద్యార్థులకు కేటాయించిన మార్కుల వెయిటేజీలో ఉన్న అసమానతను సరిచేయాలన్నారు. విశ్వవిద్యాలయం ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌లో జెఆర్ఎఫ్ అభ్యర్థులకు 15మార్కులను కేటాయించగా, నెట్‌లో అర్హత సాధించిన వారికి విద్యా నైపుణ్య ప్రమాణం కింద 10 మార్కులు మాత్రమే కేటాయించారని, ఈ వ్యత్యాసం సమాన అవకాశాలు, సహజ న్యాయ సూత్రాన్ని దెబ్బతీస్తోందని వారు తెలిపారు.ముఖ్యంగా జెఆర్ఎఫ్ హోల్డర్లు ఇప్పటికే సంవత్సరానికి రెండు సార్లు నిర్వహించబడే కేటగిరీ 1, పిహెచ్‌డి అడ్మిషన్లు పొందుతున్నారని, ఈ వ్యత్యాసం సమాన అవకాశాలు, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు చెప్పారు. 2022–23 విద్యా సంవత్సరంలో జెఆర్ఎఫ్, నెట్ హోల్డర్లు ఇద్దరికీ విద్యా ప్రమాణం కింద సమాన మార్కులు (15) కేటాయించారని గుర్తు చేశారు. కేటగిరీ 2లో జెఆర్ఎఫ్, నెట్ అర్హత పొందిన విద్యార్థులిద్దరికీ సమాన మార్కులను కేటాయించి, అడ్మిషన్ ప్రక్రియలో విద్యార్థులందరికీ న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## చార్మినార్ అందాలకు ముగ్ధులైన ఆఫ్రికన్ ప్రతినిధులు

### దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం... వహించిన పేరులో ముఖకవళికల్లోనూ భారతీయత : యోవానీ నాయుడు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** హైదరాబాద్‌కు చిహ్నంగా నిలిచే చార్మినార్ అందాలకు ఆఫ్రికన్ డెలిగేట్‌లు ముగ్ధులయ్యారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో5 రోజుల పర్యటనలో భాగంగా ఆఫ్రికా ఖండంలో మధ్య, పశ్చిమ ఆఫ్రికన్ దేశాల కంటెంట్ క్రియేటర్‌లు ఆదివారం హైదరాబాద్‌కు వచ్చారు. పర్యటనలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, గోల్కొండ కోటలను వారు సందర్శించారు. వారికి ప్రొఫెసర్ సాయి గైడ్ గా వ్యవహరించారు. చార్మినార్‌లోకి వెళ్లి గంటకు పైగా ఉన్నారు. మొదటి అంతస్తు నుండి చార్మినార్, నగర అందాలను వీక్షించడంతో పాటు నిర్మాణ నేపథ్యం తదితర అంశాలను తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ కెమెరాల్లో చార్మినార్ అందాలను నిక్షిప్తం చేశారు. అనంతరం సాలార్ జంగ్ మ్యూజియం ను సందర్శించారు. సాలార్జంగ్ తరాలకు చెందిన వస్తువులు, సేకరణలైన ఫర్నిచర్, శిల్పాలు, చిత్రలేఖనాలు, లిఖితప్రతులు, పింగాణి వస్తువులు, వస్త్రాలు, గడియారాలు, ఏనుగు దంతాల కళాకృతులు లోహపు వస్తువులతోపాటు మ్యూజియంలో భారతీయ కళలు, యూరోపియన్ పెయింటింగ్స్, మిడిల్ ఈస్టర్న్ పురాతన వస్తువులు, ఓరియంటల్ కళాఖండాలు వంటి వస్తువులను ఆసక్తిగా తిలకించారు. మనిషి బొమ్మ వచ్చి గంటలు మోగించే మ్యూజికల్ క్లాక్‌ను స్వయంగా వీక్షించి అబ్బురపడ్డారు. చివరగా చారిత్రాత్మక గోల్కొండ కోటను సందర్శించారు. చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ గంటన్నరకు పైగా గోల్కొండ కోట అందాలను వీక్షించారు. ఆఫ్రికన్ కంటెంట్ క్రియేటర్‌ల హైదరాబాద్ పర్యటన కార్యక్రమాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సమన్వయం చేస్తున్నది. యోవానీ నాయుడు అనే యువతి కంటెంట్ క్రియేటర్ దక్షిణాఫ్రికా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారతదేశ పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చారు. పేరులోనే కాకుండా ముఖ కవళికల్లో అచ్చు తెలుగుదనం, భారతీయత ఉట్టిపడుతున్నది.



## ఆకలి చావులెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ధర లభిస్తుందని దానికి కేవలం 119 లక్షల కోట్లు మాత్రమే ఖర్చవుతుందని, దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌ఘడ్‌లో విప్లవ కారులను ఎన్ కౌంటర్ ల పేరుతో హననం చేయడాన్ని ఆపి శాంతి చర్చలు చేయాలని హితువు పలికారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సిపిఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటాలను సిపిఐ నిర్వహించిందని చెప్పారు.

### జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ ప్రజా పోరాటాలు : తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ రాజీలేని ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్రం విఫలం అయిందన్నారు. రెండు సంవత్సరాల క్రితం కాజీపేటలో ప్రధాని మోడీ శంఖుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీ కి నేటివరకు అనుమతి ఇవ్వలేదన్నారు. ఎన్నికల సందర్భంగా హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలం అయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తిగా ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా అర్హులైన పేదలకు అందించాలని, జిల్లాలో అసంపూర్తిగా ఉన్నా దేవాదుల ప్రాజెక్టును పూర్తిగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు గుడిసె వాసులకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, నిలువనీడలేని పేదలకు ఇండ్ల స్థలాల కోసం భూ పోరాటాలు నడిపింది సిపిఐ అని, జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు.

### ఎర్రజెండాలతో ఎరుపెక్కిన హసన్ పర్తి

రెండు రోజుల పాటు జరగనున్న సిపిఐ హనుమకొండ జిల్లా మహాసభలు సోమవారం హసన్ పర్తి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర జెండాలు, బ్యానర్లతో, పురుషులు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు దరించి ప్రదర్శనలో పాల్గొనడంతో హసన్ పర్తి ఎరుపెక్కింది. స్థానిక సోమశేఖర హాస్పిటల్ నుండి హైస్కూల్ వరకు ప్రదర్శన కొనసాగింది. అనంతరం హైస్కూల్‌లో జరిగిన బహిరంగ సభలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేదునూరి రాజమౌళి, నేదునూరి జ్యోతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, నద్దునూరి అశోక్ స్టాలిన్, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, నకిర్త ఓదెలు, బాషబోయిన సంతోష్, హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా ఆద్వర్యంలో కళాకారులు పాటలు పాడి ఉత్తేజ పరిచారు.

## పరిశ్రమల స్థాపనకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న పిల్లలకు కింది స్థాయి నుంచి సంపూర్ణ పరిజ్ఞానం అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మన జిల్లా పరిధిలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రోటో టైపింగ్, ఇన్నోవేషన్ సెంటర్‌ను పరిశీలించేలా చూడాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. పాఠశాల విద్యార్థులకే కాకుండా ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు కూడా వీటిని వినియోగించుకోవాలని అన్నారు. ప్రపంచ స్థాయిలో మంథని మేధస్సుకు చిహ్నంగా నిలవాలని కృషి చేస్తున్నామని, హైదరాబాద్‌కు దాదాపు 250 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతమైన మంథనిలో చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ తీసుకొని వచ్చామని, భవిష్యత్తులో ఇక్కడ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని చూపించి అనేక కంపెనీలను తీసుకొని వస్తామనిమంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... రోజువారి జీవనంలో మనకు ఉన్న అనేక సమస్యలను సాంకేతికతను వినియోగించి చిన్న చిన్న మార్పులు చేస్తే పరిష్కారం అవుతాయని మనకు ఆలోచన వస్తుందని, అటువంటి ఆలోచనలను వాస్తవ రూపంలో దాల్చేందుకు సహకారం అందించే దిశగా టీ వర్క్స్, డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ బృందం ఆధ్వర్యంలో ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు వచ్చే నూతన ఆలోచనలను ఇక్కడ ఉన్న ప్రోటో టైపింగ్ యంత్రాల మెషిన్స్ ద్వారా తయారీకి ప్రయత్నిస్తామన్నారు. డ్రీమ్ స్టార్ అండ్ రైస్‌ఉన్న ప్రోటో టైపింగ్ యంత్రాల మెషిన్స్ ద్వారా తయారీకి ప్రయత్నిస్తామన్నారు. డ్రీమ్ స్టార్ట్ అండ్ రైస్ ఇన్నోవేషన్ నెట్ వర్క్ కు వయసుతో సంబంధం లేకుండా వినూత్న ఆలోచనలు ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సంచాలకులు జోగేందర్, ఆర్.డి.ఓ.సురేష్,అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహ్మారెడ్డి, సిపిఐ(ఎం)సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి చేరుపల్లి సీతారాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి ధనంజయ, చిక్క దేవాదాసు, రాపోలు జగన్, దాసు సురేష్, రాపోలు వీర మోహన్, ఏశాలఅశోక్, కోట రాజయ్య, జల్టి రాములు, పెండెం సర్వేశం, చేవూరి ధనంజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టిల సబ్‌ప్లాన్ తరహాలో బిసిలకు సైతం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. తద్వారా కుల వృత్తుల పరిరక్షణకు వృత్తుల వారికి నిధులను కేటాయించి, వాటిని ఆధునీకరించి, వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని,తద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు చేనేత సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని, ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృతిదారుల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదన్నారు. రైతన్నలు తమ అసాధారణ ఉద్యమంతో కరుదుకట్టిన ప్రధాని నరేంద్ర మోదీ మెడలు వంచ్చారని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా ఆ తరహా ఉద్యమం అవసరమని చెప్పారు. చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సంఘటితం కావాలన్నారు. మురళి మాట్లాడుతూ అధికారమే వజ్రాయుధమని దానిని అందిపుచ్చుకోవాలంటే పద్మశాలిలు చట్టసభల్లో అడుగు పెట్టాలన్నారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిడిపిలో చేనేత రంగం వాటా 5 శాతమని, ఇంత ఆదాయాన్ని సమకూర్చుతున్న ఈ రంగాన్ని పాలకులు పని కట్టుకుని, మరి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గతంలో చేనేత రంగానికి నాబార్డు ద్వారా రూ.1000 కోట్లు రుణాలుగా ఇచ్చిందని, వీటిని పూర్తిగా నిలిపివేయడంతో చేనేత కార్మికులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు రుణాలు తీసుకునే వాటిని తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కాగా రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. వాటిని ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com